﴿وَمَن لَّمْ يَحْكُم بِمَا أَنزَلَ اللّهُ فَأُوْلَـئِكَ هُمُ الْفَاسِقُونَ﴾(المائدة:۴۷)

**“అల్లాహ్ అవతరింపజేసిన దాని ప్రకారం తీర్పు చెయ్యని వారే పాపాత్ములు.” (అల్ మాయిద : 47)**

షరీయత్ సూత్రాల అన్వయింపు (ఇజ్తెహాద్)కు సంబంధించిన పలుకుల్లో ధర్మవేత్తల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు, వివాదాలు తలెత్తినపుడు కూడా అల్లాహ్ అవతరింపజేసిన షరీయత్ ప్రకారమే తీర్పులు కోరవలసి ఉంటుంది. కాబట్టి ఇజ్తెహాదీ ప్రకటనలకు సంబంధించినంత వరకు దైవగ్రంథం, దైవప్రవక్త (ﷺ) విధానం ద్వారా ఆధారం ఉన్నవాటినే పరిగణనలోకి తీసుకోవాలి. అంతేగాని ఏదేని ఒక ప్రత్యేక అభిమతాన్నో, ఒక ప్రత్యేక ఇమామునో ఉదాహరించి పక్షపాతంగా వ్యవహరించరాదు. అలాగే అన్ని రకాల హక్కులకు సంబంధించిన వివాదాలను కూడా దైవసమ్మతమైన శాసనాంగం ప్రకారమే విచారణ జరిపి, తీర్పులు ఇవ్వాలి. కేవలం వ్యక్తిగత విషయాల (పర్సనల్ లా) కే పరిమితం చెయ్యరాదు. ఇస్లాం పేరు చెప్పుకునే కొన్ని ముస్లిం దేశాలలో కూడా ఈ విధంగా జరుగుతోంది. ఇది పూర్తిగా సరైనది కాదు. ఎందుకంటే ఇస్లాం ఓ సమగ్రమయిన, సంగఠితమయిన వ్యవస్థ. అది వివిధ విభాగాలుగా, ముక్కచెక్కలుగా విభజించనలవి కానిది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُواْ ادْخُلُواْ فِي السِّلْمِ كَآفَّةً﴾(البقرة:۲۰۸)

**“విశ్వాసులారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి.” (అల్ బఖర : 208)**

ఇంకా ఈ విధంగా కూడా సెలవీయబడింది :

﴿أَفَتُؤْمِنُونَ بِبَعْضِ الْكِتَابِ وَتَكْفُرُونَ بِبَعْضٍ﴾(البقرة:۸۵)

**“ఏమిటి, మీరు కొన్ని ఆజ్ఞలను విశ్వసించి, మరి కొన్నింటిని తిరస్కరిస్తున్నారా?” (అల్ బఖర : 85)**

అలాగే ఫికహ్ (ధర్మశాస్త్ర) నియమ నిబంధనలను క్రోడీకరించేవారు, ఆధునిక యుగంలో ఎదురయ్యే కొంగ్రొత్త సవాళ్ళకు వాటిని అన్వయించేవారు, అనుసరించేవారు. ఈ సందర్భంగా గమనించాల్సిందేమంటే, వారు తమ ఇమాముల అభిప్రాయాలను, విశ్లేషణలను ‘దైవగ్రంథం, దైవప్రవక్త (ﷺ) సంప్రదాయం’ అనే గీటురాయిపై పరికించాలి. ఖుర్ఆన్ హదీసులకు అనుగుణంగా ఉన్నదానినే తీసుకోవాలి. వాటికి వ్యతిరేకంగా ఉన్న దానిని నిస్సంకోచంగా వదలిపెట్టాలి. ముఖ్యంగా అఖీదా (విశ్వాసం) విషయంలో చాలా నిర్దిష్టంగా వ్యవహరించాలి. ఎందుకంటే మన ఇమాములు (رحمهم الله) మనకు చేసిన తాకీదు కూడా ఇదే. ఈ విషయంలో వారందరి విధానం కూడా ఇదే. కాబట్టి వారి వసీయతుకు వ్యతిరేకంగా వ్యవహరించినవాడు వారి అనుయాయినని లక్షసార్లు చెప్పినా వారి అనుయాయి కానేకాడు. పైగా అలాంటి వారి గురించి అల్లాహ్ ఏమన్నాడో చూడండి!



﴿اتَّخَذُواْ أَحْبَارَهُمْ وَرُهْبَانَهُمْ أَرْبَاباً مِّن دُونِ اللّهِ وَالْمَسِيحَ ابْنَ مَرْيَمَ﴾(التوبة:۳۱)

**“వారు అల్లాహ్‌ను వదలి తమ పండితులను, సన్యాసులను తమ ప్రభువులుగా చేసుకున్నారు – మర్యమ్ కుమారుడైన మసీహ్‌ను కూడా.” (అత్ తౌబా : 31)**

దివ్య ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి ఒక్క క్రైస్తవులకే పరిమితం కాదు. వారి (క్రైస్తవుల) మాదిరిగా వ్యవహరించిన ప్రతి ఒక్కరికీ ఇది వర్తిస్తుంది. కాబట్టి ఎవరయితే దైవం మరియు దైవప్రవక్త (ﷺ) ఆజ్ఞలకు విరుద్ధంగా – దైవ సమ్మతమయిన షరీయతును వదలి – స్వయం కల్పిత శాసనాల ప్రకారం ప్రజల మధ్య తీర్పులు ఇస్తాడో లేదా తన మనోవాంఛలను అనుసరించి అలాంటి వాటి కోసం డిమాండు చేస్తాడో అతను ఇస్లాం విధించిన హద్దులను దాటిపోయాడు. ఆ తరువాత అతను తనను విశ్వాసి (మోమిన్) అని ఊహించుకున్నప్పటికీ, నిజానికి అతను విశ్వాసిగా మిగిలి ఉండడు. ఎందుకంటే ఇలాంటి ఉద్దేశం కలిగి ఉన్న వారిని అల్లాహ్ సుతరామూ ఇష్టపడడు. పైగా వారిని బూటకపు విశ్వాసిగా ఖరారు చేశాడు. ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿أَلَمْ تَرَ إِلَى الَّذِينَ يَزْعُمُونَ أَنَّهُمْ آمَنُواْ بِمَا أُنزِلَ إِلَيْكَ وَمَا أُنزِلَ مِن قَبْلِكَ يُرِيدُونَ أَن يَتَحَاكَمُواْ إِلَى الطَّاغُوتِ وَقَدْ أُمِرُواْ أَن يَكْفُرُواْ بِهِ وَيُرِيدُ الشَّيْطَانُ أَن يُضِلَّهُمْ ضَلاَلاً بَعِيداً﴾(النساء:۶۰)

**“(ఓ ప్రవక్తా!) నీపై అవతరించిన దానినీ, నీకు పూర్వం వారిపై అవతరించిన దానినీ విశ్వసించాము అని అంటూనే తమ వ్యవహారాలను తీర్పు కోసం దైవేతరుల (తాగూత్) వద్దకు తీసుకుపోగోరే వారిని నీవు చూడలేదా? మరి నిజానికి షైతాన్ (తాగూత్)ని తిరస్కరించమని వారికి (స్పష్టంగా) ఆదేశించటం జరిగింది. షైతానైతే వారిని మార్గం తప్పించి చాలా దూరంలో పడవేయాలని కోరుతున్నాడు.” (అన్ నిసా : 60)**

ఈ రకమయిన వారిలో ద్వంద్వ స్వభావం ఉంటుంది. వారు తమను తాము విశ్వాసులమని పైకి చెప్పుకుంటారు. కాని లోపలి నుంచి తద్భిన్నంగా ఉంటారు. ఎందుకంటే వారు ‘విశ్వాసం’ కోరే ‘నడవడి’కి విరుద్ధంగా ప్రవర్తిస్తారు. మరోవిధంగా చెప్పాలంటే విశ్వాసానికి హాని కలిగించే పనులు చేస్తారు. క్రింది వచనం ద్వారా దీనికి సమర్థన లభిస్తుంది.

﴿وَقَدْ أُمِرُواْ أَن يَكْفُرُواْ بِهِ﴾(النساء:۶۰)

**“నిజానికి షైతాన్‌ను తిరస్కరించమని వారిని ఆజ్ఞాపించడం జరిగింది.” (అన్ నిసా : 60)**

ఎందుకంటే షైతాన్ (తాగూత్)ని తిరస్కరించటమే ఏకేశ్వరోపాసన (తౌహీద్)కు మూలస్తంభం. అల్ బఖరా సూరాలోని క్రింది వచనం కూడా దీనికి ప్రబల తార్కాణమే.

﴿فَمَنْ يَكْفُرْ بِالطَّاغُوتِ وَيُؤْمِن بِاللَّهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقَىٰ لَا انفِصَامَ لَهَا﴾ (البقرة:٢٥٦)

**"కనుక ఎవడయితే అల్లాహ్ తప్ప వేరితర ఆరాధ్యుల (తాగూత్)ను తిరస్కరించి, అల్లాహ్‌ను మాత్రమే విశ్వసిస్తాడో అతను దృఢమయిన ఆధారాన్ని పట్టుకున్నాడు." (అల్ బఖర : 256)**

కనుక మనిషిలో ఈ 'మూలాంశం' లేనంతవరకు అతను సిసలయిన ఏకేశ్వరోపాసి కాజాలడు. ఏకేశ్వరోపాసనే విశ్వాసానికి (ఈమాన్‌కు) ఊపిరి. అది ఉంటేనే అతని సత్‌కర్మలకు సార్థకత చేకూరుతుంది. లేకుంటే చేసుకున్న కర్మలన్నీ వ్యర్థమైపోతాయి. ఉదాహరణకు : దేవుని ఈ ఉత్తర్వులో చాలా స్పష్టంగా చెప్పబడింది –

﴿فَمَنْ يَكْفُرْ بِالطَّاغُوتِ وَيُؤْمِن بِاللَّهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقَىٰ لَا انفِصَامَ لَهَا﴾ (البقرة:٢٥٦)

**"కనుక ఎవడయితే అల్లాహ్ తప్ప వేరితర ఆరాధ్యుల (తాగూత్)ను తిరస్కరించి, అల్లాహ్‌ను మాత్రమే విశ్వసిస్తాడో అతను దృఢమయిన ఆధారాన్ని పట్టుకున్నాడు." (అల్ బఖర : 256)**

ఎందుకంటే తీర్పుకోసం దైవేతరుల వద్దకు పోవటమంటే, ఒకవిధంగా వారిని విశ్వసించటమే. (ఫతహ్ అల్ మజీద్ : పేజీ 467, 468)

అల్లాహ్ అవతరింపజేసిన షరీయత్ (శాసనాంగం) ప్రకారం తీర్పు ఇవ్వని వారి విశ్వాసము (ఈమాన్) విశ్వాసమే కాదు. అలాంటివారి విశ్వాసాన్ని అభిశంసించటం ప్రతి ముస్లిం కర్తవ్యం. దైవసమ్మతమైన షరీయత్‌ను ప్రవేశపెట్టే సమయంలో కేవలం దానివల్ల ప్రజలకు మేలు కలుగుతుందని, శాంతి భద్రతలు నెలకొంటాయని ఆశిస్తే సరిపోదు. ఎందుకంటే కొంతమంది కేవలం ఈ ఒక్క కోణాన్నే చూస్తారు. ఇంతకన్నా ముఖ్యమైన మరో కోణముంది – అదే దైవారాధన. దానిని ప్రజలు విస్మరిస్తుంటారు. ఇలాంటి వారిని దేవుడు లోపమున్న వారుగా ఖరారు చేశాడు. ఎందుకంటే వారు కేవలం తమ స్వంత ప్రయోజనం దృష్ట్యా షరీయత్‌బద్ధమైన తీర్పును ఆశ్రయించారు. దైవారాధనా కోణంపై వారి దృష్టి కేంద్రీకృతమై ఉండదు. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఏమంటున్నాడో గమనించండి :

﴿وَإِذَا دُعُوا إِلَى اللَّهِ وَرَسُولِهِ لِيَحْكُمَ بَيْنَهُمْ إِذَا فَرِيقٌ مِّنْهُم مُّعْرِضُونَ ☆ وَإِن يَكُن لَّهُمُ الْحَقُّ يَأْتُوا إِلَيْهِ مُذْعِنِينَ﴾ (النور:٤٨،٤٩)

**"వారి మధ్య గల వివాదాలను పరిష్కరించటానికి అల్లాహ్ వైపు,**



**ఆయన ప్రవక్త వైపునకు రమ్మని వారిని పిలిచినపుడు కూడా వారిలోని ఒక వర్గం విముఖత చూపుతుంది. అయితే హక్కు తమకే లభిస్తుందని భావించినపుడు మాత్రం వారు ఎంతో వినయంతో అతని వద్దకు వస్తారు." (అన్ నూర్ : 48, 49)**

అంటే, వారు తమ మనసు మెచ్చిన పనులను మాత్రమే చేస్తారు. తమ మనోవాంఛలకు వ్యతిరేకంగా ఉన్నవాటి నుండి మెల్లగా తప్పుకుంటారు. ఆ కారణంగానే వారు తమ వివాదాలను దైవం మరియు దైవప్రవక్త (ﷺ) వైపు తీసుకురారు.

**దైవసమ్మతమైన షరీయత్‌ను కాదని ఇతరత్రా చట్టాల ప్రకారం తీర్పులు కోరటం:**

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَن لَّمْ يَحْكُم بِمَا أَنزَلَ اللَّهُ فَأُولَٰئِكَ هُمُ الْكَافِرُونَ﴾ (المائدة:٤٤)

**"ఎవరు అల్లాహ్ అవతరింపజేసిన 'వహీ' ప్రకారం తీర్పు చెయ్యరో వారే (కరడు గట్టిన) అవిశ్వాసులు." (అల్ మాయిదా : 44)**

అల్లాహ్ అవతరింపజేసిన షరీయత్ ప్రకారం గాకుండా ఇతరత్రా స్వీయకల్పిత శాసనాల ప్రకారం తీర్పులు చేయడం అవిశ్వాసానికి (కుఫ్రుకు) తార్కాణమని పై ఆయత్ ద్వారా విదితమవుతోంది. అదీ మామూలు అవిశ్వాసం కాదు, పెద్ద తరహా అవిశ్వాసం (కుఫ్రె అక్బర్). అది మనిషిని ముస్లిం సముదాయం నుండి బయటికి గెంటేస్తుంది. అయితే చిన్నపాటి అవిశ్వాసానికి (కుఫ్రె అస్గర్‌కి) పాల్పడినవారు ముస్లిం సముదాయం నుండి వెలివేయబడరు. ఇదంతా పరిపాలకుని (లేదా న్యాయాధీశుని) పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది.

ఒకవేళ పరిపాలకుడు (లేక న్యాయాధికారి) దేవుడు అవతరింపజేసిన షరీయత్ ప్రకారం తీర్పు ఇవ్వవలసిన అవసరం లేదని భావిస్తే, ఈ విషయంలో తాను సర్వ స్వతంత్రుణ్ణి అని అతను నమ్మితే, లేదా అతను దైవ శాసనాన్ని కించపరిస్తే లేదా దైవ సమ్మతమయిన శాసనాంగం కన్నా స్వయం కల్పిత చట్టాలు మంచివని అతను అనుకుంటే, లేదా షరీయత్ చట్టాలు ఈ కలికాలానికి సరిపోవు అని భావిస్తే లేదా స్వయంకల్పిత శాసనాలను అమలుపరచి అన్యుల మెప్పు పొందాలన్నది అతని మనోగతమై ఉంటే – వీటిలో ప్రతి ఒక్కటీ కుఫ్రె అక్బర్ (పెద్ద తరహా అవిశ్వాసం) క్రిందికి వస్తుంది.

ఒకవేళ అతను దైవశాసనానుసారం తీర్పు చేయటం తప్పనిసరి అన్న సంగతి తెలిసి ఉండి కూడా, దాని ప్రకారం తీర్పు ఇవ్వకపోతే, తానలా చేయటం తప్పేనని ఒప్పుకుంటే, అందుకుగాను దైవసన్నిధిలో శిక్షార్హుణ్ణి అని అతను భావిస్తున్నట్లయితే – అట్టి పాలనాధికారి పాపాత్ముడుగా, తేలికపాటి కుఫ్ర్‌కు పాల్పడినవాడుగా పరిగణించ బడతాడు.

ఒకవేళ అతను ఏదేని వివాదానికి సంబంధించి షరీయత్ ఆజ్ఞ ఏమిటో తెలుసుకోవటానికి శాయశక్తులా కృషి చేసినప్పటికీ దైవాదేశమేమిటో గ్రహించలేక తీర్పులో పొరపాటు చేసినట్లయితే పొరబడిన వాడుగా పరిగణించబడతాడు. అతని ఇజ్తెహాద్ (షరీయత్ సూత్రాన్వేషణా కృషి)కి గాను ఒకింత పుణ్యఫలం కూడా ప్రాప్తిస్తుంది. మరోవైపు అతని పొరపాటు కూడా మన్నింపుకు నోచుకుంటుంది. (షరహత్తహావియ : పేజీ – 363, 364)

ఈ ఆజ్ఞ ఏదేని ప్రత్యేక వ్యవహారంలో ఇవ్వబడే తీర్పుకు సంబంధించినది.

అయితే సర్వసాధారణ కేసులకు సంబంధించిన తీర్పుల విషయం వేరు. ఈ నేపథ్యంలో షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు :

ఒకవేళ పాలకుడు ధార్మికుడు, షరీయత్‌కు బద్ధుడై ఉండి కూడా జ్ఞానంతో నిమిత్తం లేకుండా తీర్పు ఇస్తే అతను నరకవాసియే. ఒకవేళ పాలకుడు షరీయత్ పరిజ్ఞానం కలవాడై ఉండీ సత్యానికి వ్యతిరేకంగా తీర్పు ఇస్తే అతను కూడా నరకవాసియే. ఒకవేళ జ్ఞానంతో నిమిత్తం లేకుండా, న్యాయాన్యాయాలను కూడా చూడకుండా తీర్పు ఇస్తే అతను ప్రథమ శ్రేణి నరకవాసి అవుతాడు. ఇది ఒకరి వ్యక్తిగత విషయంలో అతను చేసిన న్యాయనిర్ణయానికి సంబంధించిన పరిస్థితి.

కాని అతను గనక ముస్లింల ధార్మిక వ్యవహారంలో సత్యాన్ని అసత్యంగా, అసత్యాన్ని సత్యంగా ఖరారు చేసే సర్వసామాన్యమయిన తీర్పు ఇస్తే, సున్నత్‌ను బిద్అత్‌గా బిద్అత్‌ను సున్నత్‌గా నిర్ధారిస్తే, మంచిని చెడుగా, చెడును మంచిగా ఖరారు చేసినట్లయితే, దైవం మరియు దైవప్రవక్త (ﷺ) చేయమని చెప్పినదానిని నిరోధిస్తే, దైవం మరియు దైవప్రవక్త (ﷺ) నిషేధించిన వాటిని చేయాలని ఆజ్ఞాపిస్తే – ఇక దాని గురించి చెప్పాల్సిందేముంటుంది? ఆ వ్యవహారం గురించి లోకేశ్వరుడు, ప్రవక్తలందరి ఆరాధ్యుడు, తీర్పుదినపు యజమాని అయిన అల్లాహ్‌యే సరైన నిర్ణయం గైకొనగలడు. ఇహపరాలలో సకల స్తోత్రాలు ఆయనకే శోభిస్తాయి.

﴿لَهُ الْحُكْمُ وَإِلَيْهِ تُرْجَعُونَ﴾ (القصص:٨٨)

**"ఆజ్ఞాపించే అధికారం ఆయనకే చెల్లు. మీరంతా ఆయన వైపునకే మరలించబడతారు." (అల్ ఖసస్ : 88)**

﴿هُوَ الَّذِىٓ أَرْسَلَ رَسُولَهُ بِالْهُدَىٰ وَدِينِ الْحَقِّ لِيُظْهِرَهُ عَلَى الدِّينِ كُلِّهِ وَكَفَىٰ بِاللَّهِ شَهِيدًا﴾ (الفتح:٢٨)

**తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ, సత్యధర్మాన్ని ఇచ్చి దాన్ని ఇతర ధర్మాలన్నింటిపై పైచేయిగా ఉండేలా చేయటానికి పంపినవాడు ఆయనే. సాక్షిగా అల్లాహ్‌యే చాలు." (అల్ ఫత్‌హ్ : 28)**

షేఖుల్ ఇస్లాం (رحمه الله) ఇంకా ఇలా అంటున్నారు : "అల్లాహ్ తన ప్రవక్తపై అవతరింపజేసిన షరీయత్‌కు అనుగుణంగా తీర్పు ఇవ్వటం అవశ్యం అన్న విషయంపై



ఎవరికి విశ్వాసం లేదో అతను ఖచ్చితంగా అవిశ్వాసే. కాబట్టి ఏ వ్యక్తయితే అల్లాహ్ అవతరింపజేసిన ఆదేశాన్ని అనుసరించకుండా తన స్వంత అభిప్రాయాన్నిబట్టి ఒకానొక విషయాన్ని న్యాయమని భావించి, తదనుగుణంగా తీర్పు ఇవ్వటం సమ్మతమని అనుకుంటాడో అతను విశ్వాసి కాడు. అతను కాఫిర్. ఎందుకంటే ప్రతి జాతిలో, ప్రతి సముదాయంలో న్యాయసమ్మతమైన తీర్పు ఇవ్వాలన్న ఆదేశమే ఇవ్వబడుతుంది. ఒక్కోసారి మతపెద్దలు, ప్రముఖులు న్యాయమని భావించినదే ఆ మత ధర్మంలో న్యాయంగా పరిగణించబడుతుంది. ఇంకా చెప్పాలంటే; చాలామంది తమ ఆచార సంప్రదాయాల కనుగుణంగా తీర్పు ఇచ్చి, దానిని ఇస్లాంకు ఆపాదిస్తూ ఉంటారు. చూడబోతే వాటికి సంబంధించి దేవుని తరఫున ఏ సూచనా వచ్చి ఉండదు. ఉదాహరణకు : పల్లెటూళ్ళలో ఉండే ప్రాచీన ఆచార సంప్రదాయాలు. అక్కడి పెద్దలు చెట్టుక్రిందనో, రచ్చబండపైనో కూర్చుని అనుశాసనపర్వం నడిపేవారు. వారి మాటలు చట్టంగా చెల్లుబాటవుతుండేవి. దైవగ్రంథాన్ని, దైవప్రవక్త (ﷺ) సంప్రదాయాన్ని కాదని తమ పద్ధతుల ప్రకారం తీర్పు ఇవ్వటమే సరైనదని వారు తలపోసేవారు. వాస్తవానికి ఇది పచ్చి అవిశ్వాసం (కుఫ్ర్). యదార్థమేమిటంటే చాలామంది (గ్రామీణులు) ఇస్లాంలో ప్రవేశించినప్పటికీ, వారు తమ పాలనాధికారుల చేత కల్పించబడిన ఆచారాల ప్రకారం తీర్పులు ఇచ్చేవారు. విచిత్రమేమిటంటే, దేవుడు పంపిన శాసనాంగం ప్రకారమే న్యాయ నిర్ణయాలు గైకొనాలని తెలిసిన మీదట కూడా వారు దీనికి కట్టుబడలేదు సరికదా, దైవ సమ్మతమయిన షరీయత్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వటమే సముచితమని ధీమా వ్యక్తం చేశారు. ఇలాంటి వారంతా అవిశ్వాసులే (కుఫ్ఫార్) అన్నది నిర్వివాదాంశం :" (మిన్‌హాజుల్ సున్నతున్నబవియ్య)

షేఖ్ ముహమ్మద్ బిన్ ఇబ్రాహీమ్ (رحمه الله) ఇలా అంటున్నారు : "తన వివాదాన్ని దైవేతరుని వద్దకు తీసుకుపోవటం పాపం అని, దైవాదేశం ప్రకారం జరిగే తీర్పే సరైన తీర్పు అని తెలిసి కూడా మనిషి ఆ పని చేస్తే అతను చిన్న తరహా కుఫ్ర్‌కు (అవిశ్వాసానికి) ఒడిగట్టిన వాడవుతాడు. అయితే జీవితంలో ఒకట్రొండుసార్లు ఇలా చేసిన వారికే ఈ సూత్రం వర్తిస్తుంది. కాని ఒక పద్ధతి ప్రకారం చట్టాలను తయారు చేసుకుని, వాటిని తమ స్వప్రయోజనాల కనుగుణంగా వాడుకుని, తమవల్ల పొరపాటు జరిగిపోయిందని అరిగిపోయిన రికార్డులా రిపీట్ చేసేవారికి ఇది ఎంతమాత్రం వర్తించదు. ఈ ధోరణి ముమ్మాటికీ కుఫ్ర్ (అవిశ్వాసం) క్రిందికే వస్తుంది. ఇది వారిని మిల్లత్ (ముస్లిం సమాజం) నుండి గెంటేస్తుంది." (ఫతావా షేఖ్ ముహమ్మద్ బిన్ ఇబ్రాహీమ్ ఆలెషేఖ్ : 12/280)

ఎవరయినా ఇస్లామీయ షరీయత్ ప్రకారం నడుస్తూనే స్వయం కల్పిత చట్టాలను షరీయత్‌కు ప్రత్యామ్నాయంగా ఖరారుచేస్తే, ఆ వ్యక్తి స్వయం కల్పిత చట్టాలను షరీయత్ శాసనాలకన్నా మెరుగైనవిగా భావిస్తున్నాడనటానికి అది తార్కాణమన్నమాట! ఈ ధోరణి 'కుఫ్రె అక్బర్' అనటంలో సందేహానికి తావే లేదు. ఇది తౌహీద్‌కు విరుద్ధం. ఇది మిల్లత్ నుండి బహిష్కరించే పోకడ.

## ఏడవ ప్రకరణం

# షరీయత్ నిర్మాణం – ధర్మాధర్మాల నిర్ధారణ దేవుని హక్కు

ఏ ఆదేశాలు, చట్టాల ప్రకారం దాసులు తమ ఆరాధనా విధానాలకు కట్టుబడి ఉంటారో, తమ జీవన వ్యవహారాలన్నింటినీ చక్క దిద్దుకుంటారో, ఏ శాసనాల ప్రకారం వారు తమ వివాదాలను పరిష్కరించుకుంటారో – వాటిని క్రోడీకరించే హక్కు, అధికారం మానవులందరి ప్రభువుకు, సృష్టికర్తకు మాత్రమే ఉంది.

﴿أَلَا لَهُ الْخَلْقُ وَالْأَمْرُ تَبَارَكَ اللَّهُ رَبُّ الْعَالَمِينَ﴾ (الأعراف:٥٤)

**వినండి! సృష్టించటం, ఆజ్ఞాపించటం ఆయనకే ప్రత్యేకం. సకల లోకాల ప్రభువైన అల్లాహ్ అపారమైన శుభాలు కలవాడు. (అల్ ఆరాఫ్ : 54)**

తన దాసుల కొరకు ఏది ఉపయుక్తమో, ఏది లాభదాయకమో అల్లాహ్‌కే బాగా తెలుసు. అందుకే వాటికి కట్టుబడి ఉండవలసిందిగా ఆయన ఆజ్ఞాపిస్తాడు. ఆయన వారికి ప్రభువైనందువల్ల వారి కొరకు శాసనాలను చేస్తాడు. మనుషులు ఆయన దాసులైన కారణంగా ఆయన ఆదేశాలను శిరసావహిస్తారు. వాటికి సంబంధించిన లాభం కూడా వారికే ఇవ్వబడుతుంది. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿فَإِن تَنَازَعْتُمْ فِي شَيْءٍ فَرُدُّوهُ إِلَى اللَّهِ وَالرَّسُولِ إِن كُنتُمْ تُؤْمِنُونَ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ذَٰلِكَ خَيْرٌ وَأَحْسَنُ تَأْوِيلًا﴾ (النساء:٥٩)

**“ఒకవేళ ఏ విషయంలోనయినా మీ మధ్య వివాదం తలెత్తితే దానిని అల్లాహ్ మరియు ప్రవక్త వైపునకు మరల్చండి – మీకు నిజంగానే అల్లాహ్‌పై, అంతిమదినంపై నమ్మకం ఉన్నట్లయితే (మీరిలా చేయటం అనివార్యం). ఇదే మేలైన పద్ధతి. పరిణామం రీత్యా కూడా ఇదే అన్నింటికంటే ఉత్తమమైనది.” (అన్ నిసా : 59)**

ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿وَمَا اخْتَلَفْتُمْ فِيهِ مِن شَيْءٍ فَحُكْمُهُ إِلَى اللَّهِ ذَٰلِكُمُ اللَّهُ رَبِّي﴾ (الشورىٰ:١٠)

**“ఏ ఏ విషయంలో మీరు విభేదించారో, దానికి సంబంధించిన తీర్పు అల్లాహ్‌కే అప్పగించబడుతుంది. ఈ అల్లాహ్‌యే నా ప్రభువు.” (అష్ షూరా : 10)**

మనిషి అల్లాహ్‌ను కాదని వేరొకరిని శాసనకర్తగా చేసుకోవటాన్ని సృష్టికర్త చాలా తీవ్రంగా ఖండించాడు. అందుకే ఆయన ఇలా అంటున్నాడు :



﴿أَمْ لَهُمْ شُرَكَاءُ شَرَعُوا لَهُم مِّنَ الدِّينِ مَا لَمْ يَأْذَن بِهِ اللَّهُ﴾ (الشورىٰ:٢١)

**“ఏమిటీ, అల్లాహ్ ఆజ్ఞతో నిమిత్తం లేకుండానే తమ కోసం ఏవయినా ధర్మాదేశాలను నిర్ధారించే (అల్లాహ్) భాగస్థులను గాని వారు కలిగి ఉన్నారా?” (అష్ షూరా : 21)**

కాబట్టి – అల్లాహ్ శాసనాంగాన్ని గాకుండా ఇతరత్రా శాసనాంగాలను ఆశ్రయించినవాడు అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించాడు. దైవం మరియు దైవప్రవక్త (ﷺ) విధించని ఆరాధనలు బిద్అత్ (క్రొత్త పుంతలు) అవుతాయి. ప్రతి బిద్అత్ (కొంగ్రొత్త పోకడ) మార్గవిహీనతకు నిదర్శనం. ఈ పూర్వరంగంలో దైవప్రవక్త (ﷺ) ఏమన్నారో చూడండి –

“مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا هٰذَا مَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ” (بخاری ومسلم)

**“ఎవడయినా మా ఈ ధర్మం విషయంలో దీనికి సంబంధించని కొత్త విషయమేదైనా ఆవిష్కరిస్తే అది త్రోసిపుచ్చబడుతుంది.” (బుఖారీ, ముస్లిం)**

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది –

“مَنْ عَمِلَ عَمَلًا لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ” (مسلم)

**“ఎవడయినా మేము ఆజ్ఞాపించని దానిని ఆచరిస్తే అది రద్దు చేయదగినది.” (ముస్లిం)**

రాజకీయ వ్యవహారంలోగానీ, ప్రజల వివాదాస్పద విషయాలలో గానీ, పరిపాలనకు సంబంధించిగానీ దైవం మరియు దైవప్రవక్త (ﷺ) ఆదేశాలను గాకుండా ఇతరత్రా చట్టాలను అనుసరిస్తే అది అజ్ఞానంతో కూడిన తీర్పు అవుతుంది :

﴿أَفَحُكْمَ الْجَاهِلِيَّةِ يَبْغُونَ وَمَنْ أَحْسَنُ مِنَ اللَّهِ حُكْمًا لِّقَوْمٍ يُوقِنُونَ﴾ (المائدة:٥٠)

**ఏమిటీ, వారు మళ్లీ అజ్ఞాన (కాల)పు తీర్పును కోరుతున్నారా? నమ్మకం గల వారి కోసం అల్లాహ్‌కన్నా ఉత్తమ తీర్పు ఇవ్వగల వాడెవడుంటాడు?” (అల్ మాయిదా : 50)**

అలాగే –

ఏదేని విషయాన్ని ధర్మం (హలాల్)గానో, అధర్మం (హరామ్) గానో నిర్ణయించే అధికారం అల్లాహ్‌కే ఉంది. ఈ వ్యవహారంలో అల్లాహ్‌కు భాగస్వామి అవటం ఎవరికీ ధర్మసమ్మతం కాదు. సెలవీయబడింది :

﴿وَلَا تَأْكُلُوا مِمَّا لَمْ يُذْكَرِ اسْمُ اللَّهِ عَلَيْهِ وَإِنَّهُ لَفِسْقٌ وَإِنَّ الشَّيَاطِينَ لَيُوحُونَ إِلَىٰ أَوْلِيَائِهِمْ لِيُجَادِلُوكُمْ وَإِنْ أَطَعْتُمُوهُمْ إِنَّكُمْ لَمُشْرِكُونَ﴾ (الانعام:١٢١)

**అల్లాహ్ పేరు స్మరించబడని జంతువులను తినకండి. ఎందుకంటే ఇది ఆజ్ఞోల్లంఘన క్రిందికి వస్తుంది. మీతో వాదులాడటానికి షైతానులు తమ మిత్రులను ఉసిగొల్పుతుంటారు. ఒకవేళ మీరు గనక వారిని అనుసరించారంటే మీరు కూడా అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పించినవారు (ముష్రిక్కులు) అయిపోతారు (జాగ్రత్త)!"**

**(అల్ అన్ ఆమ్ : 121)**

పైన పేర్కొనబడిన దివ్య సూక్తిలో అల్లాహ్ తాను అధర్మంగా నిర్ధారించిన విషయాలను ధర్మసమ్మతంగా చేసుకోవటంలో షైతానులను, వారి స్నేహితులను అనుసరించటాన్ని బహిరంగమైన షిర్క్‌గా ఖరారు చేశాడు. అలాగే దేవుడు హలాల్‌గా చేసిన వాటిని హరామ్‌గా, దేవుడు హరామ్‌గా పేర్కొన్నవాటిని హలాల్‌గా చేసుకునే విషయంలో తమ పండితులను, మతాచార్యులను, పరిపాలకులను అనుసరించేవారిని, వారినే తమ ప్రభువులుగా భావించేవారిని గురించి అల్లాహ్ ఏమన్నాడో గమనించండి :

﴿اتَّخَذُوا أَحْبَارَهُمْ وَرُهْبَانَهُمْ أَرْبَاباً مِّن دُونِ اللّهِ وَالْمَسِيحَ ابْنَ مَرْيَمَ وَمَا أُمِرُوا إِلاَّ لِيَعْبُدُوا إِلَـهاً وَاحِداً لاَّ إِلَـهَ إِلاَّ هُوَ سُبْحَانَهُ عَمَّا يُشْرِكُونَ﴾ (التوبة:٣١)

**"వారు అల్లాహ్‌ను వదలి తమ పండితు (అహ్‌బార్)లను, సన్యాసు (రుహ్‌బాన్)లను తమ ప్రభువులుగా చేసుకున్నారు.–మర్యమ్ కుమారుడైన మసీహ్‌గా కూడా. నిజానికి వారికి, ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించవలసిందిగా ఆజ్ఞాపించబడింది. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. వారు నిర్ధారించుకున్న భాగస్వామ్యాలకు ఆయన అతీతుడు, పవిత్రుడు." (అత్ తౌబా : 31)**

హదీసులో వచ్చిన దాని ప్రకారం దైవప్రవక్త (ﷺ) పూర్వాశ్రమంలో క్రైస్తవునిగా ఉన్న అదీ బిన్ హాతిమ్ (رضي الله عنه) ముందు ఈ సూక్తిని చదివి వినిపించినపుడు, 'దైవప్రవక్తా! మేము వారిని (పండితులను, సన్యాసులను) ఆరాధించలేదు కదా!' అని సందేహం వ్యక్తం చేశారు. దానికి దైవప్రవక్త (ﷺ), "అల్లాహ్ హరామ్‌గా చేసిన (నిషేధించిన) వాటిని, వారు హలాల్ (ధర్మసమ్మతం)గా ఖరారు చేస్తే, దానిని మీరు శిరసావహించారు. అల్లాహ్ హలాల్ (ధర్మసమ్మతం) గా చేసినవాటిని వారు హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేస్తే, మీరు దానిని శిరసావహించారు. అవునా!?" అని ప్రశ్నించగా, 'అవును. ఈ విషయం నిజమే' అని అదీ బిన్ హాతిమ్ ధ్రువీకరించారు. అప్పుడు దైవప్రవక్త (ﷺ), "వారిని ఆరాధించటం అంటే ఇదే" అన్నారు. (తిర్మిజీ, ఇబ్నె జరీర్ మొదలగునవి)

అంటే –

ధర్మాధర్మాల (హలాల్ – హరామ్‌ల) నిర్ధారణ విషయంలో అల్లాహ్‌ను వదలి వారిని (పండితులను, మతాచార్యులను) అనుసరించటం కూడా ఒక విధంగా వారి ఆరాధనగానే, షిర్క్‌గానే ఖరారు చేయబడింది. ఇది షిర్కె అక్బర్ (పెద్ద షిర్క్). ఇది దేవుని



ఏకత్వానికి పూర్తిగా వ్యతిరేకం. 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే సద్వచనానికి వ్యాఘాతంగా పరిణమించే చర్య. ఎందుకంటే ధర్మాధర్మాలను నిర్ణయించే హక్కు, అధికారం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉందన్న భావం ఈ 'కలిమా'లో అంతర్లీనమై ఉంది.

ధర్మాధర్మాల నిర్ధారణ విషయంలో షరీయత్‌కు విరుద్ధంగా ప్రవర్తించిన పండితులను, మతాచార్యులను అనుసరించటమే షిర్క్‌కు తార్కాణంగా పరిణమించినపుడు, షరీయత్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసులు, నాస్తికులు క్రోడీకరించిన చట్టాలను సంగ్రహించిన పరిపాలకుల అడుగులకు మడుగులొత్తటం, వాటిని ముస్లిం దేశాలలో ప్రవేశపెట్టడం ఇంకెంత తీవ్రమైన విషయమో ఆలోచించండి!

فَلاَ حَوْلَ وَلاَ قُوَّةَ إِلاَّ بِاللّهِ

**ఫలా హవ్‌ల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్**

వారైతే అల్లాహ్‌కు బదులు అవిశ్వాసులనే తమ 'ప్రభువులు'గా చేసుకున్నారు. వారు వీరి కోసం ఆదేశాలను, శాసనాలను క్రోడీకరిస్తారు. వారి కోసం అధర్మాన్ని ధర్మంగా ఖరారు చేస్తారు. మనుషుల మధ్య తమవైన శాసనాల ప్రకారం తీర్పులు ఇస్తారు.

## ఎనిమిదవ ప్రకరణం

# అధర్మ శక్తులతో, మూర్ఖులతో చేరటం

(1) మత రాహిత్య ఉద్యమాలలో, ఉదాహరణకు : కమ్యూనిజం, సెక్యులరిజం, పెట్టుబడిదారీ వ్యవస్థ తదితర విధానాలతో జతకట్టడం కూడా ఇస్లాం ధర్మం నుండి తిరిగిపోవటం వంటిదే. ఈ రకమయిన ఉద్యమాలలో చేరిన వ్యక్తి, తాను ఇస్లాం అనుయాయినని అంటే అది కాపట్యంతో కూడిన మాటే. ఎందుకంటే కపటులు (మునాఫిక్‌లు) పైకి ఇస్లాంతో తమ సంబంధాన్ని ప్రకటించినప్పటికీ లోపలి నుండి అవిశ్వాసులతో కలిసి ఉంటారు. వారి ద్వంద్వ ప్రవృత్తిని గురించి అల్లాహ్‌ ఇలా సెలవిచ్చాడు :

﴿وَإِذَا لَقُوا الَّذِينَ آمَنُوا قَالُوا آمَنَّا وَإِذَا خَلَوْا إِلَىٰ شَيَاطِينِهِمْ قَالُوا إِنَّا مَعَكُمْ إِنَّمَا نَحْنُ مُسْتَهْزِئُونَ﴾ (البقرة:١٤)

**వారు విశ్వాసులను కలుసుకున్నప్పుడు, "మేమూ విశ్వసించామండీ" అనంటారు. కాని తమ పెద్దల వద్దకు పోయినప్పుడు, "మేము మీతోనే ఉన్నాము. కాకపోతే వాళ్ళతో పరిహాసమాడుతున్నామంతే" అని చెబుతారు. (అల్‌ బఖర : 14)**

వేరొకచోట ఇలా సెలవిచ్చాడు :

﴿الَّذِينَ يَتَرَبَّصُونَ بِكُمْ فَإِن كَانَ لَكُمْ فَتْحٌ مِّنَ اللَّهِ قَالُوا أَلَمْ نَكُن مَّعَكُمْ وَإِن كَانَ لِلْكَافِرِينَ نَصِيبٌ قَالُوا أَلَمْ نَسْتَحْوِذْ عَلَيْكُمْ وَنَمْنَعْكُم مِّنَ الْمُؤْمِنِينَ﴾ (النساء:١٤١)

**వారు (ఈ కపటులు) మీకు ఏ గతి పడుతుందోనని ఎదురు చూస్తూ ఉంటారు. ఒకవేళ అల్లాహ్‌ తరపు నుండి మీకు విజయం చేకూరితే, "మేము మీతో లేమా?" అని అంటారు. ఒకవేళ అవిశ్వాసులకు కాస్తంత ఆధిక్యత లభిస్తే, "మీకు వ్యతిరేకంగా పోరాడే శక్తి మాకు లేదా? (అయినా సరే) మేము ముస్లింల బారి నుండి మిమ్మల్ని రక్షించ లేదా?" అని వారితో అంటారు. (అన్‌ నిసా : 141)**

మోసగాళ్ళయిన ఈ వంచకులు ద్వంద్వ స్వభావం కలవారై ఉంటారు. వారు ముస్లింల ముందు ఒక మాటంటే, తమ నాస్తిక సోదరుల ముందు మరో మాటంటారు. పైకి ఒక మాటంటే మనసులో ఒక మాట ఉంటుంది.

﴿وَإِذَا لَقُوا الَّذِينَ آمَنُوا قَالُوا آمَنَّا وَإِذَا خَلَوْا إِلَىٰ شَيَاطِينِهِمْ قَالُوا إِنَّا مَعَكُمْ إِنَّمَا نَحْنُ مُسْتَهْزِئُونَ﴾ (البقرة:١٤)



**వారు విశ్వాసులను కలుసుకున్నప్పుడు, "మేమూ విశ్వసించిన వారమే" అంటారు. కాని తమ పెద్దల (నాయకుల) వద్దకు పోయినప్పుడు, "అసలు మేము మీతోనే ఉన్నామండీ. కాకపోతే వారిని ఆటపట్టిస్తున్నా మంతే" అని అంటారు. (అల్‌ బఖర : 14)**

వీరు ఖుర్‌ఆన్‌ హదీసులు కలిగి ఉన్న వారిని పరిహసిస్తూ తమ వద్ద ఉన్న విద్యలపై సంతోషిస్తూ ఉంటారు. ఆ విద్యల ద్వారా వారిలో అహంకారం, చెడు పెరగటం తప్ప వారికి మరే ప్రయోజనం చేకూరదు. అందుకే వారు నిత్యం ధర్మావలంబీకుల్ని వేళాకోళం చేయటమే తమ కర్తవ్యంగా చేస్తుంటారు. అందుకే

﴿اللَّهُ يَسْتَهْزِئُ بِهِمْ وَيَمُدُّهُمْ فِي طُغْيَانِهِمْ يَعْمَهُونَ﴾ (البقرة:١٥)

**"అల్లాహ్‌ కూడా వారితో పరిహాసమాడుతున్నాడు. వారి తలబిరుసు తనాన్ని మరింత అధికం చేస్తున్నాడు. ఫలితంగా వారు అంధులై గమ్య రహితంగా తిరుగుతున్నారు." (అల్‌ బఖర : 15)**

సిఫాతుల్‌ మునాఫిఖీన్‌ లి ఇబ్నుల్‌ ఖయ్యిమ్‌ : పేజీ 19)

యదార్థానికి అల్లాహ్‌ విశ్వాసులతో కలిసి ఉండమని ఆజ్ఞాపించాడు :

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللَّهَ وَكُونُوا مَعَ الصَّادِقِينَ﴾ (التوبة:١١٩)

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతుల వెంట ఉండండి." (అత్‌ తౌబా : 119)**

ఈ ధర్మరాహిత్య ఉద్యమాలన్నీ పరస్పరం చేదోడు వాదోడుగా ఉంటాయి. ఎందుకంటే వాటికి సత్యప్రాతిపదిక లేదు. కమ్యూనిజాన్నే తీసుకోండి. అది దేవుడూ గీవుడూ లేడు పొమ్మని అంటుంది. దైవగ్రంథాలున్న మతాలన్నింటిపై అది యుద్ధ ప్రకటన చేస్తుంది. అలాంటప్పుడు ఏ వ్యక్తయితే అవిశ్వాసంతో కూడిన జీవిత విధానాన్ని అవలంబించాలని నిశ్చయించుకుంటాడో అతను తన అంతరాత్మ ప్రబోధాన్ని తుంగలో తొక్కేశాడు. సెక్యులరిజం కూడా అంతే. అది కూడా మత ప్రమేయంలేని సిద్ధాంతమే. అది కేవలం భౌతికవాదంపై విశ్వాసం చూపుతుంది. దానికొక మార్గదర్శి అనేది ఉండదు. పశువుల్లా జీవించటం తప్ప దాని దృష్టిలో మానవ జీవితానికి ఒక అర్థంపర్థం లేదు. ఇక పెట్టుబడిదారీ వ్యవస్థ విషయానికివస్తే అది ఎంతసేపటికీ 'ధనమూల మిదం జగత్‌' అని అంటుంది. ధనం ఏ విధంగా సంపాదించాలనేది దాని దృష్టిలో ముఖ్యం కాదు, ధనం ప్రోగుచేయాలనేదే ప్రధానం. ఆ ఆర్థిక వ్యవస్థ అంతా 'వడ్డీ'పై ఆధారపడి ఉంటుంది. చూడబోతే అది దైవంపై, దైవప్రవక్త (ﷺ)పై తిరుగుబాటు చేయటం వంటిదే. పైగా అది వ్యక్తులను, జాతులను దివాలా తీయిస్తుంది. దాని (వడ్డీ) ద్వారా నిరుపేదల, శ్రామికుల రక్తం పీల్చబడుతుంది. అలాంటప్పుడు ఏ బుద్ధిమంతుడైనా ఈ ముదనష్టపు వ్యవస్థను

మనస్ఫూర్తిగా ఎలా తన జీవిత లక్ష్యంగా చేసుకోగలడు? ఆవగింజంత విశ్వాసం (ఈమాన్) ఉన్నవాడు కూడా ఈ పని చేయడు. ముస్లిం రాజ్యాలలో చాలామంది ప్రజలు సత్యధర్మానికి దూరమై, మార్గవిహీనత పొడసూపి, అన్యుల పెత్తనానికి లోబడిన కాలంలోనే ఈ నాస్తిక, మిథ్యా ఉద్యమాలు, ఆధిభౌతిక సిద్ధాంతాలు జొరబడ్డాయి.

(2) అజ్ఞాన సముదాయాలతో, వంశం ఆధారంగా పుట్టుకొచ్చిన జాతీయతలతో సంబంధ బాంధవ్యాలు పెంచుకోవటం కూడా ఇస్లాం ధర్మానికి చేటును కొనితెచ్చుకోవటమే. ఇది కూడా ఒకవిధంగా అవిశ్వాసంతో కూడిన పోకడే. ఎందుకంటే ఇస్లాం అన్ని రకాల దురభిమానాలను, వివక్షతో కూడిన నినాదాలను ఖండిస్తుంది. ఈ నేపథ్యంలో విశ్వప్రభువు ఇలా సెలవిచ్చాడు :

﴿يَا أَيُّهَا النَّاسُ إِنَّا خَلَقْنَاكُم مِّن ذَكَرٍ وَأُنثَى وَجَعَلْنَاكُمْ شُعُوباً وَقَبَائِلَ لِتَعَارَفُوا إِنَّ أَكْرَمَكُمْ عِندَ اللَّهِ أَتْقَاكُمْ﴾ (الحجرات:١٣)

**మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు, ఒకే స్త్రీ ద్వారా సృష్టించాము. మరి మీ (పరస్పర) పరిచయం కోసం మిమ్మల్ని వివిధ వర్గాలుగా, తెగలుగా చేశాము. యదార్థానికి మీలో అందరికన్నా ఎక్కువగా భయభక్తులు గలవాడే అల్లాహ్ సమక్షంలో ఎక్కువగా ఆదరణీయుడు. (అల్ హుజురాత్ : 13)**

మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా ఉపదేశించారు :

"لَيْسَ مِنَّا مَنْ دَعَا إِلَىٰ عَصَبِيَّةٍ، وَلَيْسَ مِنَّا مَنْ قَاتَلَ عَلَىٰ عَصَبِيَّةٍ وَلَيْسَ مِنَّا مَنْ غَضِبَ لِعَصَبِيَّةٍ" (مسلم)

**"దురభిమానం వైపు పిలిచేవాడు మా వాడు కాడు. దురభిమానం కోసం పోరాడేవాడు మా వాడు కాడు. దురభిమానం కోసం కోపగించుకునేవాడు మా వాడు కాడు." (ముస్లిం)**

ఇంకా – ఆయన (సఅసం) ఇలా ఉపదేశించారు :

"إِنَّ اللّٰهَ قَدْ أَذْهَبَ عَنْكُمْ عُبِّيَّةَ الْجَاهِلِيَّةِ وَفَخْرَهَا بِالآبَاءِ، إِنَّمَا هُوَ مُؤْمِنٌ تَقِيٌّ أَوْ فَاجِرٌ شَقِيٌّ، النَّاسُ بَنُو آدَمَ خُلِقَ مِنْ تُرَابٍ، وَلَا فَضْلَ لِعَرَبِيٍّ عَلَىٰ عَجَمِيٍّ إِلَّا بِالتَّقْوَىٰ" (ترمذي:٣٢٧٠ وغيره)

**"అల్లాహ్ మీలోని అజ్ఞాన కాలం నాటి అహంభావాలను, పూర్వీకుల గొప్పలు చెప్పుకుని గర్వాతిశయంతో విర్రవీగటాన్ని అంతమొందించాడు. ఇక ఇప్పుడు ధర్మపరాయణుడైన విశ్వాసి అన్నా ఉండాలి లేదా దౌర్భాగ్యుడైన అవిశ్వాసి అన్నా ఉండాలి. మనుషులంతా ఆదం**



**బిడ్డలే. ఆదం మట్టితో పుట్టించబడ్డారు. ఏ అరబ్బుకూ మరో అరబ్బేతర వ్యక్తిపై ఎలాంటి ప్రాధాన్యతా లేదు. ప్రాధాన్యతకు ఏదన్నా ప్రాతిపదిక అనేది ఉంటే అది దైవభీతి (తఖ్వా) మాత్రమే." (తిర్మిజీ –3270 సహీహ్ మొదలగునవి)**

ఈ పార్టీలు, సైద్ధాంతిక వర్గాలు ముస్లిం సముదాయంలో అభిప్రాయ భేదాలను సృష్టించి, చీలికను తీసుకువస్తాయి. కాగా; కలసిమెలసి ఉండాలని, సత్కార్యాలలో, భక్తితో కూడిన పనులలో పరస్పరం సహకరించుకోవాలని అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. విభేదాలు సృష్టించి, అనైక్యతను పెంపొందించటాన్ని ఆయన వారిస్తున్నాడు.

﴿وَاعْتَصِمُوا بِحَبْلِ اللَّهِ جَمِيعاً وَلَا تَفَرَّقُوا وَاذْكُرُوا نِعْمَتَ اللَّهِ عَلَيْكُمْ إِذْ كُنتُمْ أَعْدَاءً فَأَلَّفَ بَيْنَ قُلُوبِكُمْ فَأَصْبَحْتُم بِنِعْمَتِهِ إِخْوَاناً﴾ (آل عمران:١٠٣)

**"అందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. చీలిపోకండి. అల్లాహ్ మీపై కురిపించిన దయానుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి – అప్పుడు మీరు ఒండొకరికి శత్రువులుగా ఉండేవారు. ఆయన మీ హృదయాలలో పరస్పరం ప్రేమానురాగాలను సృజించాడు. దాంతో ఆయన అనుగ్రహం వల్ల మీరు పరస్పరం అన్నదమ్ములుగా మారారు." (ఆలి ఇమ్రాన్ : 103)**

మనం ఒక 'జమాఅత్'తో కలిసి ఉండాలని, అల్లాహ్ అభిలషిస్తున్నాడు. అది దేవుడు మెచ్చిన జమాఅత్ అయి ఉండాలి. కాని ముస్లిం జగతిపై ఐరోపా రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యం తరువాత అందులో (మళ్లీ) వంశం, వర్ణం, జాతీయ పునాదులపై రాగద్వేషాలు, దురభిమానాలు పడగ విప్పాయి. దీనిని వారు ఒక అనివార్య అంశంగా అంగీకరించసాగారు. ఏ సంకుచిత, జాత్యహంకార భావాలను ఇస్లాం నిర్మూలించిందో పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం వల్ల ముస్లింలు మళ్లీ వాటి వెనకే పరుగులు తీశారు. నిజానికి ఇస్లాం వాటిని అజ్ఞాన చేష్టలుగా అభివర్ణించింది. ఆ కాలాన్ని కూడా అజ్ఞానకాలంగా పేర్కొన్నది. వాస్తవానికి అల్లాహ్ ముస్లింలను ఆ అజ్ఞాన కుహరం నుండి వెలికి తీసి, వారికి మహోపకారం చేశాడు. ఈ మహోపకారానికి గాను కృతజ్ఞతలు తెలుపుకోమని కూడా ప్రోత్సహించాడు.

కాబట్టి మోమిన్ (విశ్వాసి) అయిన వ్యక్తి తన అజ్ఞాన కాలం నాటి పరిస్థితులను, సంఘటనలను ఇతరుల ముందు ప్రస్తావించినపుడు వాటిపట్ల తన అయిష్టతను, ఏవగింపును కూడా వ్యక్తపరచాలి. ఆ సంఘటనలను వింటున్నప్పుడు ఎదుటివారిలో రోమాలు నిక్కబొడుచుకునేట్లు చేయాలి. ఆలోచించండి! కారాగారంలో కఠిన శిక్షను అనుభవించిన ఒక వ్యక్తి జైలు నుండి విడుదల అయిన తరువాత, తన కారాగార వృత్తాంతాన్ని తెలుపుతున్నప్పుడు ఒళ్లు గగుర్పొడుస్తుందా? లేదా? తీవ్రమయిన వ్యాధికి

లోనై, మృత్యువుతో పోరాడిన మీదట ఆరోగ్యవంతుడైన ఒక వ్యక్తి తాను అనుభవించిన యాతనను తలచుకున్నప్పుడు శరీరం జలదరిస్తుందా? లేదా? ఇదీ అటువంటిదే. ఇస్లాం మాధుర్యాన్ని ఆస్వాదించిన వ్యక్తి పూర్వాశ్రమంలో తాను చేసిన అజ్ఞాన చేష్టలను తలచుకున్నప్పుడు అతని ఆంతర్యంలో నుండి దుఃఖం పెల్లుబకాలి. తద్వారా దైవం యెడల అతని మనసులో కృతజ్ఞతా భావం జనించాలి. ('రద్దతు వలా అబూబకర్ లహా' నుండి సంగ్రహణం – రచన : అబుల్ హసన్ అలి నద్వి)

ఈ మురాతత్వం దైవాగ్రహానికి ఆనవాలని గ్రహించాలి. తమ ధర్మం పట్ల వైముఖ్య ధోరణిని కనబరచి, ధర్మానికి దూరమయ్యే వారిపై దేవుడు ఆగ్రహిస్తాడు. ఉదాహరణకు ఈ సూక్తిని గమనించండి :

﴿قُلْ هُوَ الْقَادِرُ عَلَى أَن يَبْعَثَ عَلَيْكُمْ عَذَاباً مِّن فَوْقِكُمْ أَوْ مِن تَحْتِ أَرْجُلِكُمْ أَوْ يَلْبِسَكُمْ شِيَعاً وَيُذِيقَ بَعْضَكُم بَأْسَ بَعْضٍ﴾(الانعام:٦٥)

**(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "మీపై నుండి గానీ, మీ పాదాల క్రింది నుండి గానీ మీపైకి శిక్షను తెచ్చే లేదా మిమ్మల్ని వర్గాలుగా విడగొట్టి ఒకరి తడాఖాను ఇంకొకరికి చూపించే శక్తి కూడా ఆయనే కలిగి ఉన్నాడు." (అల్ అన్ ఆమ్ : 65)**

ఈ నేపథ్యంలో మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు :

"وَمَا لَمْ تَحْكُمْ أَئِمَّتُهُمْ بِكِتَابِ اللّٰهِ إِلَّا جَعَلَ اللّٰهُ بَأْسَهُمْ بَيْنَهُمْ" (ابن ماجه:٤٠١٩:حسن)

**"వారి నాయకులు దైవగ్రంథానుసారం తీర్పులు ఇవ్వటం మానుకున్నప్పుడు అల్లాహ్ వారిని పరస్పర ఘర్షణలకు లోను చేస్తాడు."**

**(ఇబ్నుమాజా–4019 హసన్)**

వర్గ దురభిమానం మూలంగా మనిషి ఇతరుల వద్ద ఉండే సత్యాన్ని స్వీకరించేందుకు నిరాకరిస్తాడు. యూదులు చేసింది కూడా అదే. వారి గురించి అల్లాహ్ ఏమన్నాడో చూడండి –

﴿وَإِذَا قِيلَ لَهُمْ آمِنُواْ بِمَا أَنزَلَ اللّهُ قَالُواْ نُؤْمِنُ بِمَا أُنزِلَ عَلَيْنَا وَيَكْفُرونَ بِمَا وَرَاءهُ وَهُوَ الْحَقُّ مُصَدِّقاً لِّمَا مَعَهُمْ﴾(البقرة:٩١)

**"అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని విశ్వసించండి" అని వారితో అన్నప్పుడు, "మాపై అవతరింపజేయబడిన దానిని మేము విశ్వసిస్తున్నాం" అని వారు సమాధానమిస్తారు. దాని తరువాత వచ్చిన దానిని, అది సత్యమైనప్పటికీ, తమ వద్ద ఉన్న గ్రంథాన్ని అది ధ్రువీకరిస్తున్న ప్పటికీ వారు తిరస్కరిస్తారు." (అల్ బఖర : 91)**



అజ్ఞాన భూతం ఆవరించిన వారి పరిస్థితీ ఇంతే. వారు తమ తాతముత్తాతల ప్రేమలో పడి, దైవప్రవక్త (సఅసం) తెచ్చిన సత్యాన్ని తృణీకరించారు :

﴿وَإِذَا قِيلَ لَهُمُ اتَّبِعُوا مَا أَنزَلَ اللّهُ قَالُواْ بَلْ نَتَّبِعُ مَا أَلْفَيْنَا عَلَيْهِ آبَاءنَا﴾(البقرة:١٧٠)

**"అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని అనుసరించండి" అని వారికి చెప్పినప్పుడల్లా, "మా తాతలు తండ్రులు అవలంబిస్తూ ఉండగా చూసిన పద్ధతినే మేము పాటిస్తాము" అని వారు సమాధానమిస్తారు.**

**(అల్ బఖర : 170)**

సమస్త మానవాళి కోసం ఇస్లాంను జీవన విధానంగా సమ్మతించి దేవుడు మహోపకారం చేశాడు. కాగా; అటువంటి ఇస్లాంను ఈ మురాల అనుంగు అనుచరులు తమ మురాలకు ప్రత్యామ్నాయంగా భావించుకుంటున్నారు.

## తొమ్మిదవ ప్రకరణం

# జీవితం యొక్క భౌతిక దృక్పథం, దాని చెడుగులు

జీవితానికి సంబంధించినంత వరకు రెండు దృక్పథాలున్నాయి. ఒకటి : భౌతిక దృక్పథం. రెండు : నిజమయిన దృక్పథం. ఈ రెండు దృక్పథాలలో ప్రతిదీ జీవితంపై తనదైన ముద్రవేస్తుంది.

### 1. భౌతిక దృక్పథం, దాని భావం :

భౌతిక దృక్పథం అంటే ఏమిటంటే మనిషి ఆలోచనలు, ప్రయత్నాలన్నీ ప్రాపంచిక లాభాలను, ఆనందాలను జుర్రుకోవటం వరకే పరిమితం అయి ఉంటాయి. కాబట్టి ఈ జీవితం తరువాత జరగబోయే దానిని గురించి మనిషి బొత్తిగా ఆలోచించడు. దానికోసం లేశమయినా కృషి చేయడు. అసలా విషయాన్నే పట్టించుకోడు. దేవుడు ఈ ప్రాపంచిక జీవితాన్ని పరలోక పంటగా ఖరారు చేశాడని, ఈ ప్రపంచం ఒక పరీక్షా స్థలమని, పరలోకంలో దీని ఫలితం వెలువడుతుందన్న సంగతి కూడా అతనికి తెలిసి ఉండదు. తన ప్రాపంచిక జీవితాన్ని సదాచరణకై వెచ్చించినవాడు రెండు లోకాలలో కూడా సఫలీకృతుడవుతాడని, తన ప్రాపంచిక జీవితాన్ని వృధా చేసినవాడు పారలౌకిక జీవితాన్ని కూడా నాశనం చేసుకున్నట్లేనని అతను గ్రహించడు :

﴿خَسِرَ الدُّنْيَا وَالْآخِرَةَ ذَٰلِكَ هُوَ الْخُسْرَانُ الْمُبِينُ﴾ (الحج:١١)

**"అలాంటివారు ప్రాపంచికంగానూ, పారలౌకికంగానూ నష్టపో యారు. నిజానికి స్పష్టంగా నష్టపోవటం అంటే ఇదే." (అల్ హజ్జ్ : 11)**

దేవుడు ఈ ప్రపంచాన్ని ఊరకే సృష్టించలేదు. దీని వెనుక ఓ గొప్ప లక్ష్యం ఉంది. ఆ మాటే ఇలా చెప్పబడింది :

﴿الَّذِي خَلَقَ الْمَوْتَ وَالْحَيَاةَ لِيَبْلُوَكُمْ أَيُّكُمْ أَحْسَنُ عَمَلًا﴾ (الملك:٢)

**"మీలో మంచి పనులు చేసేవారెవరో పరీక్షించే నిమిత్తం ఆయన చావుబ్రతుకులను సృష్టించాడు." (అల్ ముల్క్ : 2)**

ఇంకా ఇలా సెలవీయబడింది :

﴿إِنَّا جَعَلْنَا مَا عَلَى الْأَرْضِ زِينَةً لَّهَا لِنَبْلُوَهُمْ أَيُّهُمْ أَحْسَنُ عَمَلًا﴾ (الكهف:٧)

**"జనులలో ఎవరు సదాచరణ చేస్తారో పరీక్షించే నిమిత్తం మేము భూమండలంలో ఉన్న దాన్నంతటినీ భూమికి శోభాయమానంగా చేశాము." (అల్ కహఫ్ : 7)**

దేవుడు ఈ ప్రాపంచిక జీవితం కొరకు లెక్కకు మించిన సౌఖ్యసామగ్రిని



సమకూర్చాడు. ఉదాహరణకు – సిరిసంపదలు, సంతానం, అధికారం, హోదాలు, రాజరికం, మనసును రంజింపజేసే అందమైన వస్తువులు, మనకు తెలియని ఇంకా ఎన్నో వస్తువులు ఉన్నాయి.

అందువల్ల కొందరి దృష్టి – మెజారిటీ సంఖ్య ఇలాంటివారిదే – కేవలం వస్తువుల బాహ్య సౌందర్యంపై, ఆకర్షణలపైనే నిలిచిపోయింది. వాటిని వారు తనివితీరా ఆస్వాదించటంలో లీనమైపోయారు. వాటిలోని అగోచర పరమార్థాలను గురించి వారు ఆలోచించలేరు. అందుకే వారు ఆ వస్తువుల రసాస్వాదనలో మునిగిపోయి రాబోయే జీవితం గురించి అలసత్వం వహించారు. ఒక్కోసారి వారు మరణానంతర జీవితంపైనే సందేహం వ్యక్తం చేయసాగారు. కొందరైతే మరణానంతర జీవితాన్ని అసత్యమని కొట్టివేశారు. ఉదాహరణకు :

﴿وَقَالُوا إِنْ هِيَ إِلَّا حَيَاتُنَا الدُّنْيَا وَمَا نَحْنُ بِمَبْعُوثِينَ﴾ (الانعام:٢٩)

**"ఈ ప్రాపంచిక జీవితమే అసలు జీవితం. మళ్లీ మనం బ్రతికించ బడటం అనేది కల్ల" అని వారు చెబుతున్నారు.**

**(అల్ అన్ ఆమ్ : 29)**

ఈ విధమయిన జీవన దృక్పథం కలిగి ఉన్న వారిని దేవుడు చాలా తీవ్రంగా హెచ్చరించాడు. ఆయన ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّ الَّذِينَ لَا يَرْجُونَ لِقَاءَنَا وَرَضُوا بِالْحَيَاةِ الدُّنْيَا وَاطْمَأَنُّوا بِهَا وَالَّذِينَ هُمْ عَنْ آيَاتِنَا غَافِلُونَ☆أُولَٰئِكَ مَأْوَاهُمُ النَّارُ بِمَا كَانُوا يَكْسِبُونَ﴾ (يونس:٧،٨)

**మమ్మల్ని కలుసుకునే విషయంపై నమ్మకం లేనివారికీ, ప్రాపంచిక జీవితంతోనే సంతోషించిన వారికీ, దానితోనే సంతృప్తి చెందినవారికీ, మా ఆయతుల పట్ల నిర్లక్ష్యభావం ప్రదర్శించిన వారికీ – వారు ఆర్జించిన దాని ప్రతిఫలంగా వారి నివాసం నరకాగ్ని అవుతుంది.**

**(యూనుస్ : 7, 8)**

﴿مَن كَانَ يُرِيدُ الْحَيَاةَ الدُّنْيَا وَزِينَتَهَا نُوَفِّ إِلَيْهِمْ أَعْمَالَهُمْ فِيهَا وَهُمْ فِيهَا لَا يُبْخَسُونَ☆أُولَٰئِكَ الَّذِينَ لَيْسَ لَهُمْ فِي الْآخِرَةِ إِلَّا النَّارُ وَحَبِطَ مَا صَنَعُوا فِيهَا وَبَاطِلٌ مَّا كَانُوا يَعْمَلُونَ﴾ (هود:١٥،١٦)

**"ఎవరయితే ఈ ప్రాపంచిక జీవితం పట్ల, దాని అందచందాల పట్ల వ్యామోహితులవుతున్నారో అలాంటి వారికి వారి కర్మలను (వాటి ఫలితాన్ని) మేము ఇక్కడే పూర్తిగా ఇచ్చేస్తాము. ఇక్కడ వారికి ఏ లోటూ జరగదు. అయితే అలాంటి వారికి పరలోకంలో అగ్ని తప్ప**

**మరేమీ లభించదు. ప్రపంచంలో వారు చేసుకున్నదంతా వృధా అయి పోతుంది. వారు చేసే పనులన్నీ మిథ్యగా మారిపోయాయి."**

**(హూద్ : 15, 16)**

ఈ రకమయిన జీవన దృక్పథం గల వారందరికీ ఈ హెచ్చరిక వర్తిస్తుంది. వారు కేవలం ప్రాపంచిక స్వప్రయోజనాల కోసం పారలౌకిక ఆచరణ చేసేవారు గానివ్వండి, ఉదాహరణకు : కపటులు (మునాఫిక్‌లు), ప్రదర్శనాబుద్ధితో సత్కార్యాలు చేసేవారు లేదా మరణానంతర జీవితాన్ని, లెక్కాచారాన్ని నమ్మని అవిశ్వాసులు గానివ్వండి, ఉదాహరణకు : ఇస్లాంకు పూర్వం అజ్ఞాన కాలపు జనుల పరిస్థితి కూడా ఇలాగే ఉండేది. నేటి పెట్టుబడిదారీ విధానాన్ని, కమ్యూనిజాన్ని, సెక్యులరిజాన్ని అవలంబించే వారి పరిస్థితి కూడా ఇంతే. వీళ్ళందరికీ జీవితం యొక్క విలువ, ఉద్దేశం తెలీదు. ఎందుకంటే వారు తమ బుద్ధిజ్ఞానాలను జీవిత లక్ష్యం తెలుసుకునేందుకు వెచ్చించలేదు. వారు తమ శక్తియుక్తులన్నింటినీ వారికోసం ఆగి ఉండని, వాటి కోసం వారు ఆగి ఉండని వాటికై ధారబోశారు. వాటి వెనుకే తమ సమయాన్నంతటినీ ఖర్చు చేశారు. తమ కోసం నిరీక్షిస్తూ ఉన్న ఫలితం కోసం వారు ఏమీ చేసుకోలేదు. కాగా; ఎట్టి పరిస్థితిలోనూ వారు ఆ పరిణామాన్ని ఎదుర్కొనవలసి ఉన్నది.

జీవితం విషయంలో వారి దృక్పథం పశువులకన్నా హీనం. అందుకే వారి గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿أَمْ تَحْسَبُ أَنَّ أَكْثَرَهُمْ يَسْمَعُونَ أَوْ يَعْقِلُونَ إِنْ هُمْ إِلَّا كَالْأَنْعَامِ بَلْ هُمْ أَضَلُّ سَبِيلًا﴾ (الفرقان:٤٤)

**ఏమిటీ, వారిలో అత్యధిక మంది వింటారనీ, అర్థం చేసుకుంటారని నువ్వు (ఇప్పటికీ) అనుకుంటున్నావా? వారు వట్టి పశువుల్లాంటివారు. పైగా వాటికన్నా ఎక్కువగా దారి తప్పారు. (అల్ ఫుర్ఖాన్ : 44)**

ఈ రకమయిన పదార్థ పూజారులను దేవుడు అజ్ఞానులుగా ఖరారు చేశాడు. అందుకే ఇలా అన్నాడు :

﴿وَعْدَ اللَّهِ لَا يُخْلِفُ اللَّهُ وَعْدَهُ وَلَكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُونَ ☆ يَعْلَمُونَ ظَاهِرًا مِّنَ الْحَيَاةِ الدُّنْيَا وَهُمْ عَنِ الْآخِرَةِ هُمْ غَافِلُونَ﴾ (الروم:٦،٧)

**కాని చాలామంది (ఈ సంగతిని) తెలుసుకోరు. వారికి ప్రాపంచిక జీవితపు పై పై విషయాలు (మాత్రమే) తెలుసు. పరలోకం గురించి వారికి బొత్తిగా తెలీదు. (అర్ రూమ్ : 6, 7)**

వారు ఎన్ని కొంగ్రొత్త ఆవిష్కరణలు చేసినా, వైజ్ఞానిక సాంకేతిక రంగాలలో వారెంత అనుభవజ్ఞులు, నిపుణులు అయినా – వాస్తవంలో వారు జ్ఞానులు, విజ్ఞులు



కారు. 'జ్ఞాని' అని పిలిపించుకునే అర్హత వారికి లేదు. ఎందుకంటే వారి జ్ఞానం ప్రాపంచిక జీవితపు బాహ్య వస్తువుల పరిధిని దాటి ముందుకుపోదు. వారి జ్ఞానం లోపభూయిష్టమైనది. అందుకే వారు ఆదరణీయులు, మానవీయులైన విజ్ఞుల సరసన నిలబడలేరు. దైవం గురించి, సిసలైన జీవిత లక్ష్యం గురించి అవగాహన ఉన్నవారు మాత్రమే జ్ఞాను లనదగినవారు. అలాంటి వారి గురించి అల్లాహ్ ఏమన్నాడో చూడండి :

﴿إِنَّمَا يَخْشَى اللَّهَ مِنْ عِبَادِهِ الْعُلَمَاءُ﴾ (فاطر:٢٨)

**అల్లాహ్ దాసులలో జ్ఞాన సంపన్నులు మాత్రమే ఆయనకు భయపడ తారు. (ఫాతిర్ : 28)**

దేవుడు ఖారూన్ గురించి, అతని ఖజానా గురించి ప్రస్తావించిన వృత్తాంతంలో కూడా ప్రాపంచిక జీవితపు భౌతిక దృక్పథమే ఉపమానంగా ఇవ్వబడింది :

﴿فَخَرَجَ عَلَى قَوْمِهِ فِي زِينَتِهِ قَالَ الَّذِينَ يُرِيدُونَ الْحَيَاةَ الدُّنْيَا يَا لَيْتَ لَنَا مِثْلَ مَا أُوتِيَ قَارُونُ إِنَّهُ لَذُو حَظٍّ عَظِيمٍ﴾ (القصص:٧٩)

**మరి ఖారూన్ అంగరంగ వైభవంతో తన జాతి జనులలోకి కదలి వచ్చినప్పుడు, ప్రాపంచిక జీవితాన్ని కోరుకునేవారు, "ఖారూనుకు ప్రసాదించబడినదే మాకూ లభిస్తే ఎంత బాగుండు! నిజంగా ఇతను పెట్టిపుట్టినవాడు" అన్నారు. (అల్ ఖసస్ : 79)**

పై సూక్తిలో చెప్పబడిన ముఖ్య విషయం ఏమిటంటే, ప్రాపంచిక జీవితమే సర్వస్వం అనుకున్నవారు, తమ ఆధిభౌతికతత్వం ప్రకారం ఖారూన్‌కు లభించిన సిరిసంపదలే తమకూ ప్రాప్తించాలని కాంక్షించారు. ఖారూన్‌ని చూసి అసూయ చెందారు. ఖారూన్‌ను గొప్ప భాగ్యవంతుడుగా పేర్కొన్నారు. నేటి అభివృద్ధి చెందిన దేశాలలో జనుల పరిస్థితి కూడా ఇదే. అక్కడి పారిశ్రామిక, ఆర్థిక ప్రగతిని బలహీన విశ్వాసం గల ముస్లింలు మెచ్చుకోలు దృష్టితో చూస్తారు. కాని వారి అవిశ్వాసాన్ని, వారికి పట్టబోయే పర్యవసానాన్ని గురించి యోచన చేయరు. వారి ఈ తప్పుడు దృష్టి కోణం మూలంగా వారి హృదయాలలో పదార్థ పూజారుల యెడల గౌరవ భావం జనిస్తుంది. అందువల్ల ఎన్నో చెడు విషయాలలో వారిని అనుకరించటం మొదలెడతారు. దానికి బదులు వీరు ఈ భౌతికవాదుల కష్టపడే స్వభావాన్ని, ఆవిష్కరణల కోసం వారు చేసే కఠోర తపస్సును, క్రమశిక్షణను, పట్టుదలను పుణికి పుచ్చుకునేందుకు ప్రయత్నిస్తే బావుండేది. కాని వారలా చేయరు. అల్లాహ్ సెలవిచ్చినట్లు–

﴿وَأَعِدُّوا لَهُم مَّا اسْتَطَعْتُم مِّن قُوَّةٍ﴾ (الانفال:٦٠)

**"మీరు వాళ్లను ఎదుర్కోవటానికి శాయశక్తులా బలాన్ని కూడగట్టు కోండి." (అల్ అన్‌ఫాల్ : 60)**

### (2) జీవితానికి సంబంధించిన సరైన దృక్పథం :

జీవితానికి సంబంధించిన సరైన దృక్పథం ఏమిటంటే, జీవిత కాలంలో ప్రాప్తమైన సిరిసంపదలను, పదవులను, పేరు ప్రతిష్ఠలను మనిషి పరలోక కర్మల కొరకు సహాయ కారిగా మలచుకోవాలి.

కాబట్టి ప్రపంచం స్వతహాగా నిందార్హమైనది కాదు. నిందార్హమైనా, ప్రశంసార్హమైనా – అది దాసుల వైఖరినిబట్టి ఉంటుంది. ప్రపంచం వాస్తవానికి పరలోకానికి వారధి వంటిది. తద్వారా స్వర్గం కొరకు కావలసిన సామగ్రిని ఇక్కడ నుండి సమకూర్చుకోవటం జరుగుతుంది. అక్కడ స్వర్గవాసులకు లభించే అత్యుత్తమ జీవితం ప్రపంచంలో వారు చేసుకున్న సత్కర్మలపైనే ఆధారభూతమై ఉంటుంది.

ఈ విధంగా ప్రపంచం కర్మ భూమి. సాధనా స్థలం. ఆరాధనా విషయం. దైవమార్గంలో ఖర్చుచేసే, సత్కార్యాలలో ముందంజవేసే క్షేత్రం!

స్వర్గవాసులనుద్దేశించి అల్లాహ్ ఇలా అంటాడు :

﴿كُلُوا وَاشْرَبُوا هَنِيئًا بِمَا أَسْلَفْتُمْ فِي الْأَيَّامِ الْخَالِيَةِ﴾ (الحاقة:٢٤)

**"గత కాలంలో మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా హాయిగా తినండి, త్రాగండి." (అల్ హాఖ్ఖహ్ : 24)**



### పదవ ప్రకరణం

# మంత్రించి ఊదటం, తావీజులు కట్టటం

### (1) మంత్రించి ఊదటం (రుఖియ) :

అంటే బాధలో ఉన్న వ్యక్తిపై ఏదైనా పఠించి ఊదటం. ఉదాహరణకు : జ్వరం, మూర్ఛ రోగం, తదితర జబ్బులున్న వ్యక్తి. దీనిని మంత్రం అని కూడా అంటారు. ఇది రెండు రకాలు :

**మొదటి రకం :** షిర్క్ ప్రమేయం లేని మంత్రం. సూటిగా చెప్పాలంటే దివ్య ఖుర్ఆన్‌లోని సూక్తులనుగానీ, దైవనామాలను గానీ పఠించి అతన్ని దేవుని రక్షణలో ఇవ్వటం (రోగి స్వస్థత కోసం అల్లాహ్‌ను అర్థించటం). ఈ రకమయిన మంత్రం ధర్మసమ్మతమే. ఎందుకంటే దైవప్రవక్త (ﷺ) ఈ విధంగా మంత్రించటమే గాక, దీనిని సమ్మతంగా ఖరారు చేశారు. ఆ మేరకు ఆజ్ఞాపించారు కూడా.

ఔఫ్ బిన్ మాలిక్ (رضي الله عنه) ఇలా అంటున్నారు : మేము అజ్ఞాన కాలంలో మంత్రించి ఊదేవారం. అందుకే మేము, 'ఓ దైవప్రవక్తా! దీని గురించి తమరి అభిప్రాయం ఏమిటి?' అని ప్రశ్నించాం. దానికాయన (ﷺ),

"اِعْرِضُوا عَلَيَّ رُقَاكُمْ، لَا بَأْسَ بِالرُّقَى مَا لَمْ تَكُنْ شِرْكًا" (مسلم)

**"మీ మంత్రాలేమిటో నా ముందు సమర్పించండి. షిర్క్ ప్రమేయం లేకుండా ఉన్నంతవరకూ మంత్రించి ఊదటంలో అభ్యంతరం ఏమీ లేదు" అన్నారు. (సహీహ్ ముస్లిం)**

అల్లామా సుయూతీ (رحمه الله) ఇలా అంటున్నారు : మంత్రించి ఊదటం ధర్మసమ్మతమే అనే విషయంలో విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉంది. కాకపోతే అది మూడు షరతులకు కట్టుబడి ఉండాలి.

**మొదటి షరతు** : దైవ వచనాల, దైవనామాల ఆధారంగా మంత్రించి ఊదాలి.

**రెండవ షరతు** : అది అరబీ భాషలో ఉండాలి. దాని భావం స్పష్టంగా ఉండాలి.

**మూడవ షరతు** : మంత్రం స్వతహాగా ప్రభావపూరితం (ప్రయోజనకరం) కాదని, దేవుని విధివ్రాత ప్రకారమే దాని ప్రభావం ఉంటుందని నమ్మకం కలిగి ఉండాలి. (ఫత్‌హుల్ మజీద్ : పేజీ – 135)

మంత్రించే పద్ధతి ఏమిటంటే, నిర్ణీత దైవవచనాలను పఠించి రోగిపై ఊదాలి. లేదా నీటిపై మంత్రించి దానిని రోగికి త్రాగించాలి. సాబిత్ బిన్ ఖైస్ (رضي الله عنه) హదీసు ద్వారా ఈ విషయం రూఢీ అవుతోంది : "దైవప్రవక్త (ﷺ) బత్‌హాన్ నుండి కొద్దిగా మట్టి తీసుకున్నారు. దానిని ఒక పాత్రలో వేశారు. ఆ నీటిపై ఏదో పఠించి ఊదారు. తరువాత ఆ నీటిని ఆయనపై కుమ్మరించారు." (అబూదావూద్–3885 జయీఫుల్ అస్‌నాద్, కితాబుత్తిబ్, సహీహ్ ఇబ్నె హిబ్బాన్ – 1418)

**రెండవ రకం :** షిర్క్‌కు ప్రమేయం ఉన్నది. అంటే దైవేతరుల సహాయం అర్థించే మంత్రతంత్రాలు. ఇందు నిమిత్తం దైవేతరులను మొరపెట్టుకోవటం, వారి సహాయం కోరటం, వారి శరణుజొచ్చుటం, జిన్నాతుల పేర్లతో, ప్రవక్తల పేర్లతో, దైవదూతల పేర్లతో, పుణ్య పురుషులపేర్లతో మంత్రించి ఊదటం – ఇదంతా దైవేతరులను మొరపెట్టుకోవటం క్రిందికే వస్తుంది. ఇది షిర్కె అక్బర్. లేదా అరబీలో గాకుండా వేరితర భాషల్లో ఉండే మంత్రాలు. అర్థంకాని విధంగా – అస్పష్టంగా – ఉండే మంత్రాలు. వాటిలో అవిశ్వాసంతో, షిర్కుతో కూడిన వాక్యాలు ఉండవచ్చు. ఆ విషయం మనకు తెలీకనూ పోవచ్చు – ఈ విధమయిన మంత్రాలు కూడా సమ్మతం కావు.

## (2) తావీజులు

అంటే దిష్టి తగలకుండా ఉండేందుకు చిన్న పిల్లల మెడలో వ్రేలాడదీసే త్రాళ్లు. ఒక్కోసారి వృద్ధ స్త్రీ పురుషుల మెడలో కూడా ఇలాంటివి వ్రేలాడదీయబడతాయి.

### తాయెత్తులు రెండు రకాలు

**మొదటి రకం :**

ఖుర్‌ఆన్ ఆధారంగా కట్టే తావీజులు. అంటే ఖుర్‌ఆనీ సూక్తులను లేదా అల్లాహ్ నామాలను, గుణాలను లిఖించి, వ్యాధి నివారణ పొందే ఉద్దేశంతో వ్రేలాడదీయబడేవి. ఈ విధమయిన తావీజులకు సంబంధించి ఇస్లామీయ విద్వాంసులలో భిన్నాభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో రెండు ఉద్ఘాటనలున్నాయి.

**మొదటిది :** ఈ విధమయిన తావీజు వ్రేలాడదీయటం సమ్మతమే. ఇది అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (رضي الله عنه) పలుకు. హజ్రత్ ఆయిషా (رضي الله عنها) ద్వారా ఈ విధంగానే ఉల్లేఖించబడినది. అబూ జాఫర్ అల్ బాఖర్ మరియు వేరొక ఉల్లేఖనంలో అహ్మద్ బిన్ హంబల్ (رحمه الله) ఉవాచ కూడా ఇదే. వీరంతా తావీజులు వ్రేలాడదీయరాదనే హదీసును గురించి వ్యాఖ్యానిస్తూ, "అది షిర్కుతో కూడిన తావీజులకు సంబంధించిన హదీసు" అని అభిప్రాయపడ్డారు.

రెండవది : ఈ రకమయిన తావీజులు వ్రేలాడదీయటం ధర్మసమ్మతం కాదు. ఇది అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్, ఇబ్నె అబ్బాస్ (رضي الله عنهم) ల ఉవాచ. హుజైఫా, ఉఖబా బిన్ ఆమిర్, ఇబ్నె ఉకైమ్ (رضي الله عنهم) ప్రభృతులు కూడా ఇలాగే అభిప్రాయపడ్డారు. తాబయీల ఒక జమాఅత్ కూడా ఇంచుమించు ఇలాగే అభిప్రాయపడింది. వీరిలో ఇబ్నె మస్‌ఊద్ (رضي الله عنه) శిష్యులు, వేరొక ఉల్లేఖనం ప్రకారం ఇమామ్ అహ్మద్ కూడా ఉన్నారు. వీరి శిష్యుల్లో కూడా చాలామంది ఇదే అభిప్రాయాన్ని అవలంబించారు. తరువాతి తరాల వారు కూడా దీనికి కట్టుబడ్డారు. ఇబ్నె మస్‌ఊద్ (رضي الله عنه) గారి ఈ క్రింది హదీసు వారి కట్టుబాటుకు నిదర్శనంగా ఉంది :

''إِنَّ الرُّقَى وَ التَّمَائِمَ وَالتِّوَلَةَ شِرْكٌ'' (ابن ماجہ:٣٥٣٠صحيح)

**"నిశ్చయంగా మంత్రించి ఊదటం, తాయెత్తులు వేయటం, తివల షిర్క్‌తో కూడుకున్నవి."(అహ్మద్, అబూదావూద్, ఇబ్నుమాజ–3530 సహీహ్, హాకిమ్)**



తివల అనేది కూడా ఒక విధమయిన చేతబడి (క్షుద్రవిద్య). దీని మూలంగా భర్త దృష్టిలో భార్య, భార్య దృష్టిలో భర్త ప్రియాతిప్రియమైన వారైపోతారన్నది ఆ విద్య చేయించే వారి తలంపు.

క్రింద పేర్కొనబడిన మూడు కారణాల దృష్ట్యా ఈ రెండవ అభిప్రాయమే సరైనది:

(1) సర్వసాధారణంగా తాయెత్తులు కట్టడం పట్ల వారింపు ఉంది. ఈ సర్వసాధారణమును 'ప్రత్యేకం' చేసే ఆధారం ఏదీ కనబడదు.

(2) షిర్క్ ద్వారాలను మూసివేయటంలో ఈ 'వారింపు' ఉపయుక్తంగా ఉన్నది. కాగా; తావీజులు వ్రేలాడదీయవచ్చున్న ఫత్వా (ధార్మిక తీర్పు) షిర్క్‌తో కూడుకున్న తావీజులను ప్రోత్సహించేందుకు ఆస్కారముంది. అది ఏ విధంగానూ సమ్మతం కాదు.

(3) ఖుర్‌ఆనీ ఆయతులను తావీజుగా చేసి వ్రేలాడదీసినపుడు, అలా వ్రేలాడదీసేవాడు తప్పకుండా వాటిపట్ల అమర్యాదకరంగా ప్రవర్తిస్తాడు. ఎందుకంటే ఆ తావీజు కాలకృత్యాలు తీర్చుకునే సమయంలో కూడా అతని మెడలో వ్రేలాడుతూనో, చేతికి కట్టబడో ఉంటుంది. (ఫత్‌హుల్ మజీద్ : పేజి : 136)

## రెండవ రకం :

ఈ కోవలో ఖుర్‌ఆన్ సూక్తుల ఆధారంగా చేయబడిన తావీజులతో పాటు వేరితర తాయెత్తులన్నీ చేరి ఉంటాయి. ఉదాహరణకు : గవ్వలు, బొమికలు, దారాలు, వెంట్రుకలు, చిప్పలు, చెప్పులు, భూత పిశాచాల పేర్లు ఇత్యాదివి. ఈ రకమయిన తావీజులు ముమ్మాటికీ నిషిద్ధం (హరామ్). అవి ఖచ్చితంగా షిర్క్ క్రిందికి వస్తాయి. ఎందుకంటే ఈ రకమయిన వస్తువులలో అల్లాహ్ నామాల, వాక్యాల బదులు వాటిని ఇతరత్రా వాటితో ముడిపెట్టడం జరుగుతుంది. దైవేతరులను ఆశ్రయించటం జరుగుతుంది. కాగా; హదీసులో ఇలా ఉంది :

''مَنْ تَعَلَّقَ شَيْئاً وُكِلَ إِلَيْهِ'' (ترمذی:٢٠٧٢حسن:احمد)

**"ఎవరయినా ఏదయినా వస్తువుతో సంబంధం ఏర్పరచుకుంటే అతను దాని పరమే చేయబడతాడు." (అహ్మద్, తిర్మిజీ–2072 హసన్)**

అంటే దేవుడు అతన్ని ఆ వస్తువుకే అప్పగిస్తాడు. కనుక ఎవరయితే అల్లాహ్‌తో దృఢ సంబంధం ఏర్పరచుకుంటాడో, అల్లాహ్‌నే నమ్ముకుంటాడో, తన వ్యవహారాలన్నింటినీ అల్లాహ్ పరం చేస్తాడో అలాంటి వ్యక్తి కొరకు స్వయంగా అల్లాహ్‌యే చాలు. ఆయన ప్రతి దూరాన్ని అతనిపై దగ్గర చేస్తాడు. ప్రతి కష్టాన్ని అతని కోసం సులువు చేస్తాడు. మరెవరయితే అల్లాహ్‌ను గాకుండా ఇతర సృష్టితాలను ఆశ్రయిస్తాడో, తాయెత్తుల,

అధర్మమయిన విద్యల, సమాధుల, దర్గాల సహాయం కోర్తాడో అతను వాటికే అప్పగించ బడతాడు. అవి అతనికి ఏ విధంగానూ ఉపయోగపడవు. అతనికి లాభనష్టాలు కలిగించే శక్తి వాటికి ఉండదు. ఆ విధంగా అతని విశ్వాసం (అఖీదా) కూడా వ్యర్థమై పోతుంది. అల్లాహ్‌తో అతనికి గల సంబంధం కూడా తెగిపోతుంది. అల్లాహ్ అతనికి తోడ్పడటం మానుకుంటాడు.

కాబట్టి ముసల్మాను తన విశ్వాసానికి విఘాతం కలిగించే విషయాల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. కాబట్టి అతను అధర్మమైన మందులను, చికిత్సలను త్యజించాలి. తన రోగుల చికిత్స కోసం మాయలమారుల వద్దకు, మోసగాళ్ల వద్దకు పోరాదు. ఎందుకంటే అలాంటి దగాకోరులు అన్నిటికన్నా ముందు ఇతని హృదయాన్ని, ఇతని నమ్మకాన్ని రోగగ్రస్తం చేసేస్తారు. అల్లాహ్‌పై భరోసా చేసిన వాడికి అల్లాహ్‌యే చాలు.

కొంతమంది అవసరం లేకపోయినా తావీజులు పెట్టుకుంటారు. నిజానికి వారికి ఏ జబ్బూ ఉండదు. కాని వారు అనుమానమనే అతి పెద్ద రోగానికి లోనై ఉంటాడు. తమకు దిష్టి తగులుతుందని, ఇతరులు తమను చూసి ఈర్ష్య చెందుతారేమోనని పొద్దస్తమానం అనుమానిస్తూ ఉంటారు. అలాగే మరి కొంతమంది తమ వాహనాలకు, పశువులకు, లేదా ఇంటి గుమ్మానికి 'విరుగుడు'ను కడుతుంటారు. ఇదంతా విశ్వాస బలహీనత వల్ల అలా చేస్తారు. విశ్వాస బలహీనతే అసలు రోగం. దానికి చికిత్స తౌహీద్ (దేవుని ఏకత్వం), సిసలయిన విశ్వాసం ఆధారంగా చేయటం చాలా అవసరం.



## పదకొండవ ప్రకరణం

# దైవేతరుల పేర ప్రమాణం చేయటం, సృష్టితాల ఆశ్రయం పొందటం, వారిని మొరపెట్టుకోవటం, సహాయమర్థించటం

**(అ) దైవేతరులపై ప్రమాణం చేయటం :**

మాననీయుడయిన ఒక వ్యక్తి లేక ఒక వస్తువు గురించి ప్రస్తావించి విషయాన్ని నొక్కి చెప్పేందుకు ప్రమాణం చేయటం ప్రమాణం లేక ఒట్టు అనబడుతుంది. మన్నన, భక్తి, సత్కారం లాంటివి అల్లాహ్ హక్కు. కాబట్టి దైవేతరుల పేర ప్రమాణం చేయటం సమ్మతం కాదు. 'ప్రమాణం' అనేది కేవలం అల్లాహ్ పేర లేదా ఆయన నామాల గుణగణాలపై జరగాలన్న దానిపై విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉంది. అలాగే దైవేతరుల పేర ప్రమాణం చేయటం నిషిద్ధం మరియు అధర్మం అనే విషయంలో కూడా విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉంది (హాషియా ఇబ్నుల్ ఖాసిం అలీ కితాబుత్తౌహీద్ – పేజీ : 303)

దైవేతరులపై ప్రమాణం చేయటం షిర్క్. ఎందుకంటే ఇబ్నె ఉమర్ (رضي الله عنهما) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (صلى الله عليه وسلم) ఇలా ప్రవచించారు :

”مَنْ حَلَفَ بِغَيْرِاللّٰهِ فَقَدْ كَفَرَ أَوْ أَشْرَكَ“ (ترمذی:۱۵۳۵ صحیح،احمد،حاکم)

**"దైవేతరుని పేర ప్రమాణం చేసినవాడు అవిశ్వాసానికి లేదా బహుదైవా రాధనకు ఒడిగట్టాడు." (అహ్మద్, తిర్మిజీ–1535 సహీహ్, హాకిమ్)**

ఇది షిర్కె అస్గర్ (చిన్న తరహా షిర్క్). అయితే ప్రమాణం చేయబడిన వ్యక్తి గనక అతని దృష్టిలో ఆరాధనీయుడుగా ఉంటే గనక ఇది కూడా పెద్ద తరహా షిర్క్ (షిర్కె అక్బర్) గానే భావించబడుతుంది. నేటి సమాధి పూజారుల పరిస్థితి ఇలాంటిదే. వారు అల్లాహ్‌కన్నా ఎక్కువగా సమాధివారలకు భయపడతారు. అల్లాహ్ పట్ల చూపవలసిన భక్తికన్నా అధికంగా తమకు గురివున్న సమాధి వారిపట్ల చూపుతారు. తాము నమ్మే వలీ పేర ప్రమాణం చేయమని వారిలో ఎవరినయినా అనండి; వారు తమ ప్రమాణంలో సత్యవంతులై ఉంటేనే ప్రమాణం చేస్తారు. కాని అల్లాహ్ పేర ప్రమాణం చేయమని చెబితే, వెంటనే – తడబడకుండా – ప్రమాణం చేసేస్తారు. అతను చెప్పేది అబద్ధమైనాసరే.

ఎవరి పేరు మీద ప్రమాణం చేస్తారో అతని పట్ల భక్తీ ప్రపత్తులు ఉంటాయి. ఈ భక్తీ ప్రపత్తులు అల్లాహ్‌కే శోభాయమానం. అలాగే అల్లాహ్ పేర ప్రమాణం చేసినపుడు, ఆ ప్రమాణం పట్ల గౌరవ ప్రపత్తులను పాటించటం కూడా అవసరమే. అందుకే చీటికి మాటికీ ప్రమాణం చేయకూడదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَلَا تُطِعْ كُلَّ حَلَّافٍ مَّهِينٍ﴾ (القلم:١٠)

**“నీవు అదేపనిగా ప్రమాణాలు చేసే తుచ్ఛుని మాట వినకు.” (అల్ ఖలమ్ : 10)**

ఇంకా ఇలా సెలవిచ్చాడు :

﴿وَاحْفَظُوا أَيْمَانَكُمْ﴾ (المائدة:٨٩)

**“మీరు ప్రమాణాల విషయంలో జాగ్రత్త పడండి.” (అల్ మాయిద : 89)**

అంటే, మరీ అంతగా అవసరముంటేనే, సత్యం కొరకు, మంచి కొరకు ప్రమాణం చేయవలసిన అవసరం ఉందని భావిస్తేనే ప్రమాణం చేయండి. ఎందుకంటే చీటికీ మాటికీ ప్రమాణాలు చేయటం, అబద్ధపు ప్రమాణాలు చేయటం అంటే ఒక విధంగా అల్లాహ్‌ను కించపరచటం క్రిందికే వస్తుంది. ఇది తౌహీద్ పరిపూర్ణతకు విరుద్ధాంశం. మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రబోధించారు :

“ముగ్గురు వ్యక్తులతో అల్లాహ్ మాట్లాడడు, వారిని పవిత్రపరచడు. వారి కొరకు వ్యధా భరితమయిన శిక్ష ఉంది” – ఈ హదీసులో తరువాత ఇలా అనబడింది :

”وَرَجُلٌ جَعَلَ اللّٰهُ بِضَاعَتَهُ، لَا يَشْتَرِي إِلَّا بِيَمِينِهِ وَلَا يَبِيعُ إِلَّا بِيَمِينِهِ“ (صحيح الجامع :٥٣٨٣)

**“వారిలో ఒకడెవడంటే, అతను అల్లాహ్‌ను తన (వర్తక) సామగ్రిగా చేసుకున్నాడు. కనుక అతను ఏదయినా కొనుగోలు చేసినపుడు ఆయన పేరు మీద ప్రమాణం చేస్తాడు. అమ్మినపుడు కూడా ఆయనపై ఒట్టేస్తాడు.” (ఈ హదీసును తిబ్రానీ ప్రామాణిక సనదుతో ఉల్లేఖించారు. సహీహుల్ జామె–5383).**

పై హదీసులో ఎక్కువగా ప్రమాణాలు చేయటంపై హెచ్చరిక చేయబడింది. పదే పదే ప్రమాణం చేయటం సమ్మతం కాదనటానికి ఇది నిదర్శనం. ఎందుకంటే అల్లాహ్ నామం పట్ల గౌరవ ప్రపత్తులు ఉండాలి.

అలాగే అల్లాహ్ పేరున అబద్ధ ప్రమాణాలు చేయటం నిషిద్ధం (హరామ్). దీనినే **‘యమీనె గమూస్’** అంటారు. (ఇది ఎటువంటి ప్రమాణమంటే, అది ప్రమాణం చేసేవాణ్ణి పాపానికి లోనుచేస్తుంది. నరకానికి ఆహుతి చేస్తుంది. అంటే, తెలిసి కూడా జరిగిపోయిన దానిపై అబద్ధపు ప్రమాణం చేయటమన్నమాట). అల్లాహ్ కపట విశ్వాసుల ఈ లక్షణాన్ని విశదీకరిస్తూ, వారు తెలిసి కూడా అల్లాహ్ పేరుపై అసత్య ప్రమాణాలు చేస్తారని చెప్పాడు. పై విషయాల సారాంశమేమిటంటే –

(1) దైవేతరుల పేరు మీద ప్రమాణం చేయటం : ఉదాహరణకు – అమానతు, కాబా గృహం లేదా దైవప్రవక్త (ﷺ)పై ప్రమాణం చేయటం హరామ్, షిర్క్.



(2) తెలిసీ అల్లాహ్‌పై అసత్య ప్రమాణం చేయటం హరామ్ (నిషిద్ధం). ఇదే ‘యమీనె గమూస్’ అనబడుతుంది.

(3) అవసరం లేకపోయినప్పటికీ పదే పదే అల్లాహ్‌పై ఒట్టేసుకోవటం హరామ్ – ఒకవేళ అతను తన ప్రమాణంలో సత్యవంతుడైనప్పటికీ మాటిమాటికీ ప్రమాణం చేయరాదు. ఎందుకంటే ఇలా చేయటం వల్ల అల్లాహ్ గౌరవప్రపత్తులకు విఘాతం కలుగుతుంది.

(4) అవసరం వచ్చినపుడు – సత్యం కొరకు – అల్లాహ్‌పై ప్రమాణం చేయటం ధర్మసమ్మతం.

## (అ) దైవ సామీప్యం కొరకు సృష్టితాలను ‘సాధనం’ గా చేసుకోవటం:

‘తౌసిల్’ అంటే ఏదేని ఒక వస్తువు ద్వారా దగ్గర అవటం, లేదా దాని వరకు చేరటం అన్నమాట! సామీప్యాన్ని ‘వసీలా’ అంటారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَابْتَغُوا إِلَيْهِ الْوَسِيلَةَ﴾ (المائدة:٣٥)

**“ఆయన సామీప్యాన్ని పొందే సాధనం వెతకండి.” (అల్ మాయిద:35)**

అంటే; అల్లాహ్‌కు విధేయులై ఉంటూ, ఆయన ప్రసన్నతను చూరగొనే మార్గాన్ని అనుసరిస్తూ ఆయన సామీప్యం పొందండి అని భావం.

## తవస్సుల్ రెండు రకాలు

**మొదటి రకం :** ధర్మసమ్మతమైన అత్ తవస్సుల్. ఇది కూడా రెండు రకాలు.

**(1) అల్లాహ్ నామాలను, గుణగణాలను సాధనంగా చేసుకోవటం** – ఉదాహరణకు : అల్లాహ్ ఒక చోట ఈ విధంగా ఆదేశించాడు :

﴿وَلِلّٰهِ الْأَسْمَاءُ الْحُسْنَى فَادْعُوهُ بِهَا وَذَرُوا الَّذِينَ يُلْحِدُونَ فِي أَسْمَائِهِ سَيُجْزَوْنَ مَا كَانُوا يَعْمَلُونَ﴾ (الاعراف:١٨٠)

**అల్లాహ్‌కు మంచి పేర్లు ఉన్నాయి. కాబట్టి మీరు ఆ పేర్లతో ఆయన్నే పిలవండి. ఆయన పేర్ల విషయంలో వక్రంగా వాదించే వారిని వదలిపెట్టండి. వారు చేస్తూ ఉండిన దానికి వారు తప్పకుండా శిక్షించబడతారు. (అల్ ఆరాఫ్ : 180)**

**(2) విశ్వాసం మరియు సత్కర్మలను అల్లాహ్ సన్నిధిలో సాధనంగా చేసుకోవటం:**

ఉదాహరణకు అల్లాహ్ విశ్వాసుల గురించి ఇలా సెలవిచ్చాడు :

﴿رَبَّنَا إِنَّنَا سَمِعْنَا مُنَادِيًا يُنَادِي لِلْإِيمَانِ أَنْ آمِنُوا بِرَبِّكُمْ فَآمَنَّا رَبَّنَا فَاغْفِرْ لَنَا ذُنُوبَنَا وَكَفِّرْ عَنَّا سَيِّئَاتِنَا وَتَوَفَّنَا مَعَ الْأَبْرَارِ﴾ (آل عمران:١٩٣)

**"మా ప్రభూ! పిలిచేవాడొకడు విశ్వాసం (ఈమాన్) వైపు పిలవటం, 'ప్రజలారా! మీ ప్రభువును విశ్వసించండి' అని పిలుపునివ్వటం మేము విన్నాము. కనుక మేము విశ్వసించాము. కనుక ఓ ప్రభూ! మా పాపాలను క్షమించు. మా చెడుగులను మా నుండి దూరం చెయ్యి. సజ్జనులతో పాటు మాకు మరణం వొసగు." (ఆలి ఇమ్రాన్ : 193)**

గుహ వారి హదీసు దీనికి ఒక ప్రబల తార్కాణం. ఆ ముగ్గురు వ్యక్తులు గుహలో తల దాచుకొని ఉండగా ఒక కొండరాయి విరిగి ఆ గుహ ముఖద్వారం వద్ద పడింది. దాంతో గుహ ముఖద్వారం మూసుకుపోయింది. అప్పుడు ఆ ముగ్గురు సజ్జనులు తాము తమ జీవితంలో చేసుకున్న సత్కర్మలను ఆధారంగా చేసుకుని దైవాన్ని ప్రార్థించారు. అల్లాహ్ వారి ప్రార్థనను ఆలకించాడు. ఆ కొండరాయి గుహ ముఖద్వారం నుండి జరిగిపోయింది. దాంతో వారు ఆ గుహ నుండి సురక్షితంగా బయటపడ్డారు.

**(3) దైవసన్నిధిలో ఆయన 'తౌహీద్'ను ఆశ్రయించటం :**

దైవప్రవక్త హజ్రత్ యూనుస్ (عليه السلام) ఇలా చేశారు :

﴿فَنَادَىٰ فِي الظُّلُمَاتِ أَن لَّا إِلَٰهَ إِلَّا أَنتَ سُبْحَانَكَ﴾ (الأنبياء:۸۷)

**ఆఖరికి అతను చీకట్లలో నుంచి ఇలా మొరపెట్టుకున్నాడు : "ఓ అల్లాహ్! నీవు తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. నీవు పవిత్రుడవు." (అంబియా : 87)**

**(4) అల్లాహ్ వైపు మరలి తన అవసరాన్ని, నిస్సహాయ స్థితిని వ్యక్తపరచి దానిని సాధనంగా చేసుకోవటం :** ఉదాహరణకు :- దైవప్రవక్త హజ్రత్ అయ్యూబ్ (عليه السلام) ఈ విధంగా చేశారు :

﴿أَنِّي مَسَّنِيَ الضُّرُّ وَأَنتَ أَرْحَمُ الرَّاحِمِينَ﴾ (الأنبياء:۸۳)

**"(ప్రభూ!) నాకు ఈ వ్యాధి సోకింది. నీవు కరుణించే వారందరిలోకీ అపారంగా కరుణించేవాడవు." (అంబియా : 83)**

**(5) బ్రతికి ఉన్న సత్పురుషుల దుఆలను దైవసన్నిధిలో సాధనంగా చేయటం :** ఉదాహరణకు, ప్రవక్త సహచరులు (رضي الله عنهم) కరువు కాటకాల సమయంలో దైవసన్నిధిలో ప్రార్థించమని దైవప్రవక్త (ﷺ)ను అభ్యర్థించేవారు. ఆయన (ﷺ) పరమపదించిన తరువాత ఆయన పినతండ్రి అయిన అబ్బాస్ (رضي الله عنه) గారిని ప్రార్థించమని కోరేవారు. వారి కోరికపై ఆయన ప్రార్థించేవారు. (బుఖారీ)

**(6) తమ పాపాలను అంగీకరిస్తూ దైవసన్నిధిలో వాటిని సాధనంగా చేసుకోవటం :** ఉదాహరణకు, దైవప్రవక్త హజ్రత్ మూసా (عليه السلام) ఇలా ప్రార్థించారు :

﴿قَالَ رَبِّ إِنِّي ظَلَمْتُ نَفْسِي فَاغْفِرْ لِي﴾ (القصص:۱۶)



**"నా ప్రభూ! నాకు నేనే అన్యాయం చేసుకున్నాను. కనుక నన్ను క్షమించు." (అల్ ఖసస్ : 16)**

## రెండవ రకం : అధర్మమైన వసీలా

ఇంతవరకూ వచ్చిన ధర్మసమ్మతమైన సాధనాలు తప్ప వేరితర పద్ధతుల ద్వారా ఆశ్రయం పొందినట్లయితే అది అధర్మమయిన వసీలా (ఆధారం)గా పరిగణించబడుతుంది. ఉదాహరణకు : మృతుల ప్రార్థన, సిఫారసులను సాధనంగా చేసుకోవటం. దైవప్రవక్త (ﷺ) ఔన్నత్యాన్ని, అంతస్తును వసీలాగా చేసుకోవటం. ప్రాణులలో ఏ ఒక్కరి వ్యక్తిత్వాన్నయినా, వారి హక్కునయినా వసీలాగా చేసుకోవటం. దీని వివరాలు క్రింద పేర్కొనబడ్డాయి –

**(1) మృతులను దుఆ చేయమని కోరటం హరామ్ (నిషిద్ధం) :**

ఎందుకంటే వారు జీవించి ఉండగా ప్రార్థించే శక్తి కలిగి ఉంటారు. మరణించిన తరువాత వారికి ఆ శక్తి ఉండదు. సిఫారసు కొరకు మృతులను కోరటం కూడా అధర్మమే. ఎందుకంటే ఉమర్ బిన్ ఖత్తాబ్, ముఆవియా బిన్ అబీ సుఫ్యాన్ (رضي الله عنهم) లు గానీ, వారి కాలం నాటి సహాబీలు తాబయీలుగానీ కరువు కాటకాలు వచ్చినపుడు వర్షం కొరకు దైవాన్ని ప్రార్థించవలసిందిగా బ్రతికి ఉన్నవారినే కోరేవారు. ఉదాహరణకు : హజ్రత్ అబ్బాస్ (رضي الله عنه), యజీద్ బిన్ అస్వద్‌లను అభ్యర్థించేవారు. అంతేగాని వారు దైవప్రవక్త (ﷺ) సమాధి వద్దకు వచ్చి లేదా వేరొక స్థానంలో కూర్చొని ప్రవక్త (ﷺ) గారిని 'వసీలా'గా చేసుకోలేదు. సిఫారసు కోసం కూడా ఆయన్ని వేడుకోలేదు. వర్షం కోసం కూడా ఆయన్ని మొరపెట్టుకోలేదు. పైగా వారు, ఆ కాలంలో సజీవులుగా ఉన్న అబ్బాస్ (رضي الله عنه), యజీద్ బిన్ అస్వద్ వంటి వారినే అభ్యర్థించారు. ఈ సందర్భంగా హజ్రత్ ఉమర్ (رضي الله عنه) ఇలా అంటున్నారు :

**"ఓ అల్లాహ్! గతంలో మేము మా ప్రవక్త ద్వారా నిన్ను అర్థించేవారము. నీవు వర్షం కురిపించి మా కరువు తీర్చేవాడివి. ఇప్పుడు మేము మా ప్రవక్త బాబాయి గారిని ఆశ్రయించి నిన్ను ప్రార్థిస్తున్నాము. కనుక మాపై వర్షం కురిపించు."**

షరీయత్ ప్రకారం దైవప్రవక్త (ﷺ) ను దుఆ కొరకు సాధనంగా చేసుకోవటానికి వీలు లేనపుడు వారు ఆయన (ﷺ) బదులు ఆయన బాబాయి గారిని 'సాధనం' గా చేసుకున్నారు.

ఒకవేళ సమాధి వద్దకు వచ్చి ప్రార్థనల కొరకు ఆయన్ని 'వసీలా'గా చేసుకోవటం ధర్మసమ్మతం అయివుంటే, ప్రవక్త ప్రియసహచరులు తప్పకుండా ఆ పని చేసి ఉండేవారు. (మజ్మూఅ ఫతావా : 1/318, 319)

కాని ప్రియ సహచరులు (رضي الله عنهم) దైవప్రవక్త (ﷺ)మరణించిన పిదప అలా

చేయలేదంటే, మృతులను ఆశ్రయించటం ధర్మసమ్మతం కాదని తేలిపోయింది. ప్రవక్త శిష్యులు ఆయన (ﷺ) సమాధి వద్దకు వచ్చి ఏదన్నా విజ్ఞప్తి చేసుకోవటంగానీ, సిఫారసు కొరకు అభ్యర్థించుకోవటం గానీ చేయలేదు. ఒకవేళ అందుకు అనుమతి ఉండి ఉంటే వారు ప్రవక్త సమాధిని విడిచిపెట్టి, ఆయన (ﷺ) కంటే తక్కువ స్థాయిగల సహచరుల వద్దకు వెళ్ళేవారే కాదు.

**(2) దైవప్రవక్త (ﷺ) అంతస్తును, వేరితరుల అంతస్తులను 'వసీలా' (ఆధారం)గా చేసుకోవటం సమ్మతం కాదు :**

దైవప్రవక్త (ﷺ) స్థాయిని, అంతస్తును 'వసీలా'గా చేసుకునే విషయమై ఈ క్రింది హదీసు ఉదాహరించబడుతోంది –

''إِذَا سَأَلْتُمُ اللّٰهَ فَاسْئَلُوهُ بِجَاهِي، فَإِنَّ جَاهِي عِنْدَاللّٰهِ عَظِيمٌ'' (موضوع، باطل التوسل للالباني: ١١٦)

**(మీరు అల్లాహ్‌ను ఏదైనా అడగదలచినపుడు నా హోదాను, అంతస్తును ఆసరాగా చేసుకుని అడగండి. ఎందుకంటే అల్లాహ్ దగ్గర నా స్థాయి చాలా గొప్పది. మౌజూ, బాతిల్, 'అత్తవస్సుల్ లిల్' – అల్ బాని–116).**

ఇదొక కాల్పనిక హదీసు. ఇందులో సత్యం లేశమైనా లేదు. ఎన్నదగ్గ పుస్తకాలలో గానీ, ప్రామాణిక హదీసు సంకలనాలలో గానీ దీని జాడ ఎక్కడా లేదు. హదీసువేత్తలు కూడా ఈ 'హదీసు'ను ఎక్కడా ప్రస్తావించలేదు. (మజ్మూఅ ఫతావా : 10/319)

**(3) సృష్టితాలలో ఏ ఒక్కరి అస్తిత్వాన్నయినా ఆధారంగా చేసుకోవటం ధర్మసమ్మతం కాదు :**

ఎందుకంటే సృష్టితాల అస్తిత్వాన్ని ఆధారంగా చేసుకుని అర్థించటాన్ని అల్లాహ్ దుఆ స్వీకృతికి కారణంగా చేయలేదు. ఆ విధంగా చేయటాన్ని తన దాసుల కొరకు సమ్మతించనూ లేదు.

**(4) సృష్టితాల హక్కును 'వసీలా'గా చేసుకోవటం రెండు కారణాల వల్ల అధర్మం :**

**మొదటిది :** అల్లాహ్‌పై ఏ ప్రాణికీ ఎటువంటి హక్కూ లేదు. పైగా అల్లాహ్‌యే తన సృష్టితాలపై దయదలుస్తున్నాడు. వారికి ఉపకారం చేస్తున్నాడు. ఉదాహరణకు : అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَكَانَ حَقًّا عَلَيْنَا نَصْرُ الْمُؤْمِنِينَ﴾ (الروم: ٤٧)

**"విశ్వాసులకు సహాయపడటం మా బాధ్యత." (అర్ రూమ్ : 47)**

ఈ విధంగా విధేయుడైన దైవదాసుడు దేవుని దయానుగ్రహాలకు, బహుమానానికి



పాత్రుడవుతాడు. అంతేగాని సాటి మనుషులలో ఒకరి హక్కు ఇంకొకరిపై ఉన్నట్లుగా మనిషి హక్కు దైవంపై ఉండదు.

**రెండవది :** అల్లాహ్ ఏ దాసుణ్ణి అయినా ప్రత్యేకంగా కటాక్షించదలిస్తే అది అతనికే ప్రత్యేకం. వేరొకరికి దానితో ఎలాంటి సంబంధం లేదు. కనుక ఎవరయినా అర్హత లేని వ్యక్తి దానిని 'వసీలా'గా చేసుకుంటే, తనకు పరిచితం కాని వస్తువు ద్వారా వసీలా పొందినట్లవుతుంది. కాగా; దాంతో అతనికెలాంటి సంబంధం ఉండదు. అటువంటి పనివల్ల అతనికెలాంటి లాభం చేకూరదు. తత్సంబంధితమయిన హదీసు పదాలు ఇవి:

''أَسْأَلُكَ بِحَقِّ السَّائِلِينَ'' (الضعيفة: ٢٤، ابن ماجه: ٧٧٨ ضعيف)

**"నేను నిన్ను అర్థించేవారి హక్కు ఆధారంగా అర్థిస్తున్నాను." (అజ్జయీఫ–24, ఇబ్నుమాజ–778 జయీఫ్)**

ఈ హదీసు సత్యమని నిరూపితం కాలేదు. ఎందుకంటే దీని సనదులో అతియ అల్ ఉఫా అనే ఉల్లేఖకుడు కొంతమంది హదీసువేత్తల ప్రకారం ఎన్నదగ్గవాడు కాదు. అందువల్ల ఈ రకమయిన హదీసును విశ్వాస వ్యవహారాలలో ఒకానొక ముఖ్యాంశం కొరకు ఆధారంగా చేసుకోవటం తగదు. అదలా ఉంచితే ఫలానా వ్యక్తి హక్కు ఆధారంగా అర్థిస్తున్నట్లు ఇదమిత్థంగా చెప్పబడలేదు. దానికి బదులు అర్థించే వారి హక్కు ఆధారంగా అర్థిస్తున్నట్లు ప్రస్తావించబడింది. అర్థించేవారి హక్కు ఏమిటంటే వారి దుఆలు స్వీకరించబడాలి – అల్లాహ్ వారికి ఆ మేరకు హామీ ఇచ్చినట్లుగా! ఆ హక్కును అల్లాహ్ స్వయంగా తనపై తప్పనిసరిగా చేసుకున్నాడు. వేరితరులు ఆయనపై దానిని తప్పనిసరిగా చేయలేదు. కాబట్టి యదార్థానికి అల్లాహ్ యొక్క నిజమయిన వాగ్దానాన్ని ఆధారంగా చేసుకుని అర్థించాలి గాని సృష్టితాల హక్కును ఆశ్రయించి కాదు.

**(ఇ) సహాయం చేయమని, కష్టం తొలగించమని సృష్టితాలను అర్థించటం :** ఇస్లామీయ పరిభాషలో దీని కొరకు రెండు ప్రత్యేక పదాలు ఉన్నాయి. (1) ఇస్తిఆనత్ (2) ఇస్తిగాసహ్

**1. ఇస్తిఆనత్ :** ఏదేని వ్యవహారంలో మద్దతును, సమర్థనను కోరటం.

**2. ఇస్తిగాసహ్ :** ఏదేని ఆపదను, కష్టాన్ని దూరం చేయమని విజ్ఞప్తి చేయటం.

సహాయపడమని, గండం నుండి గట్టెక్కించమని సృష్టితాలను కోరటం రెండు రకాలుగా ఉంటుంది.

మొదటి రకం : తనకు సహాయపడమని లేదా తనను ఆదుకోమని బ్రతికి ఉన్న వారిని అడగటం. అయితే వారిలో అట్టి స్థోమత, శక్తి ఉండి ఉండాలి. ఇలాంటి సహాయం కొరకు అర్థించటం ధర్మసమ్మతమే. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఏమన్నాడో చూడండి :

﴿وَتَعَاوَنُوا عَلَى الْبِرِّ وَالتَّقْوَىٰ﴾ (المائدة: ٢)

**సత్కార్యాలలో, దైవభీతితో కూడిన విషయాలలో పరస్పరం సహాయ**

**సహకారాలు అందించుకోండి. (అల్ మాయిద : 2)**

అల్లాహ్ ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿فَاسْتَغَاثَهُ الَّذِي مِن شِيعَتِهِ عَلَى الَّذِي مِنْ عَدُوِّهِ﴾ (القصص:١٥)

**అతని వర్గానికి చెందిన వ్యక్తి, శత్రు వర్గానికి చెందినవానికి వ్యతిరేకంగా సహాయపడమని మూసాను పిలిచాడు. (అల్ ఖసస్ : 15)**

## రెండవ రకం :

కేవలం అల్లాహ్ మాత్రమే చేయగల పనులకై సృష్టితాలను అర్థించటం. ఇది అధర్మం. ఉదాహరణకు : మృతులను సహాయం కొరకు మొరపెట్టుకోవటం లేదా ఆపదను తొలగించమని ఫిర్యాదు చేసుకోవటం లేదా కేవలం అల్లాహ్‌కు సాధ్యమైన విషయాల కొరకు బ్రతికి ఉన్న వారిని అర్థించటం, కష్టాన్ని దూరం చేయమని విన్నవించుకోవటం. ఉదాహరణకు : రోగులకు ఆరోగ్యాన్ని ప్రసాదించటం, ప్రకృతి వైపరీత్యాల వంటి గండాల నుండి గట్టెక్కించటం, వ్యాకులతను దూరం చేయటం మొదలగునవి. ఇలాంటి వాటి కోసం మనుషులను (సృష్టితాలను) వేడుకోవటం అధర్మం. పైగా ఇది షిర్కె అక్బర్ (పెద్ద తరహా షిర్క్) గా పరిగణించబడుతుంది. దైవప్రవక్త (ﷺ) హయాంలో ఒక కపట విశ్వాసి ముస్లిములను వేధించేవాడు. దానిపై కొంతమంది సహచరులు, "దైవప్రవక్త (ﷺ) వద్దకు వెళ్ళి అతని బెడదను తొలగించమని ఫిర్యాదు (ఇస్తిగాసహ్) చేద్దాం పదండి" అని కూడబలుక్కుని వెళ్ళారు. దైవప్రవక్త (ﷺ) వారితో ఇలా అన్నారు –

"إِنَّهُ لَا يُسْتَغَاثُ بِي وَ إِنَّمَا يُسْتَغَاثُ بِاللهِ" (طبرانی، مجمع الزوائد:١٧٢٧٦، حسن، احمد)

**"ఫిర్యాదు చేసుకోవలసింది నాకు కాదు, అల్లాహ్‌కు ఫిర్యాదు చేసుకోవాలి." (తిబ్రానీ, మజ్మూఉ జవాయిద్–17276, అహ్మద్)**

తన కోసం 'ఇస్తెగాసహ్' (ఫిర్యాదు) పద ప్రయోగాన్ని ఆయన (ﷺ) ఇష్టపడలేదు. చూడబోతే ఆయన (ﷺ) తన జీవిత కాలంలో ఆ బెడదను తొలగించే స్థోమత కలిగి ఉన్నారు. అయితే తౌహీదు (దేవుని ఏకత్వపు) రక్షణ కోసం, షిర్క్ ద్వారాలను మూసివేయటం కోసం, తమ ప్రభువు పట్ల వినయ వినమ్రతలలో ఏ లోటూ రాకుండా జాగ్రత్తపడే నిమిత్తం, తన అనుయాయుల మనో వాక్కాయ కర్మలను సంస్కరించే నిమిత్తం ప్రవక్త మహనీయులు (ﷺ) అలా అన్నారు : తన జీవిత కాలంలోనే ఆయన (ﷺ) ఈ విషయంలో ఇంత సెన్సెటివ్‌గా ఉన్నప్పుడు, తన మరణానంతరం ఈ విధంగా ఫిర్యాదు (ఇస్తెగాసహ్) చేసుకోవటాన్ని ఎలా సహిస్తారు? కేవలం అల్లాహ్ మాత్రమే చేయగల పనుల కోసం ఆయన్ని (ﷺ) అర్థించటం ఎంత వరకు సబబు? (ఫత్‌హుల్ మజీద్, పేజీ : 196, 197).

ఇలాంటి విషయాలు ప్రవక్త మహనీయుల (ﷺ) పట్లనే ధర్మసమ్మతం కానపుడు ఇతరుల పట్ల మాత్రం ఎలా ధర్మసమ్మతం అవుతాయి? ముమ్మాటికీ కాలేవు.



**ఐదవ అధ్యాయం**

# దైవప్రవక్త (ﷺ) యెడల, ఆయన కుటుంబీకుల యెడల, ప్రియ సహచరుల (رضي الله عنهم) యెడల తప్పనిసరిగా ఉండవలసిన విశ్వాసం

ఈ విషయాన్ని ఆరు ప్రకరణములుగా విభజించటం జరిగింది.

**మొదటి ప్రకరణం:** దైవప్రవక్త (ﷺ) పట్ల ఆదరాభిమానాలు అవశ్యం. అభిమానంలో అతిశయిల్లరాదని తాకీదు. ఆయన (ﷺ) ఔన్నత్యం, అంతస్తు గురించి విశదీకరణ.

**రెండవ ప్రకరణం :** ఆయన (ﷺ)కు విధేయత చూపటం, ఆయన్ని (ﷺ) అనుసరించటం అనివార్యం.

**మూడవ ప్రకరణం:** ఆయన (ﷺ)పై దురూద్, సలాం పంపవలసిన ఆవశ్యకత.

**నాల్గవ ప్రకరణం :** ప్రవక్త ఇంటివారల ప్రాశస్త్యం. వారిపట్ల మర్యాదగా మెలగవలసిన ఆవశ్యకత – ఈ సందర్భంగా అతివాదానికి లోనుకారాదని ఉద్బోధ.

**ఐదవ ప్రకరణం :** ప్రవక్త ప్రియసహచరుల ప్రాశస్త్యం. వారి విషయంలో తప్పనిసరిగా ఉండవలసిన నమ్మకం. పరస్పర విభేదాల విషయంలో 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' వైఖరికి కట్టుబడటం గురించి.

**ఆరవ ప్రకరణం :** సహాబా మరియు ఇమాముల సూచనలను తూలనాడరాదని ఉద్బోధ.

**మొదటి ప్రకరణం**

# మహనీయ ముహమ్మద్ (ﷺ) యెడల ప్రేమాభిమానాలు, గౌరవ ప్రపత్తులు తప్పనిసరి. అయితే అతివాదం అవాంఛనీయం. ఆయన (ﷺ) స్థాయి అత్యున్నతం

**(1) ఆయన (ﷺ) యెడల ప్రేమాభిమానాలు, గౌరవ ప్రపత్తులు అవశ్యం :**

అందరికన్నా ముందు అల్లాహ్ యెడల ప్రేమాతిశయంతో మెలగవలసిన బాధ్యత దాసునిపై ఉంది. ఇది ఆరాధనలో అత్యుత్తమ శ్రేణికి చెందిన అంశం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَالَّذِينَ آمَنُوا أَشَدُّ حُبًّا لِّلَّهِ﴾ (البقرة:١٦٥)

**"విశ్వసించిన వారు అల్లాహ్‌ను ప్రగాఢంగా ప్రేమిస్తారు." (అల్ బఖర:165)**

ఎందుకంటే తన దాసులను అసంఖ్యాకమయిన అనుగ్రహాల ద్వారా దయదలిచే ప్రభువు ఆయనే.

అల్లాహ్ యెడల ప్రేమ తరువాత ఆయన సందేశహరులైన ముహమ్మద్ (ﷺ)పై అత్యధిక ప్రేమను కలిగి ఉండటం అవశ్యం. ఎందుకంటే ఆయనే (ﷺ) జనులను అల్లాహ్ వైపు పిలిచారు. ఆయన పట్ల మన బాధ్యతలేవో ఎరుకపరిచారు. ఆయన షరీయత్‌ను మనకు పరిచయం చేశారు. ఆయన ఆజ్ఞలను మనకు విడమరచి చెప్పారు. విశ్వాసులకు (ముస్లింలకు) ప్రాప్తమయిన ఇహపరాల సాఫల్యాలన్నీ ఆయన (ﷺ) ద్వారానే ప్రాప్తించాయి. ఏ వ్యక్తీ ఆయనకు విధేయత చూపకుండా, ఆయన విధానాన్ని అనుసరించకుండా స్వర్గంలో ప్రవేశించలేడు. హదీసులో ఉంది :

"ثَلَاثٌ مَنْ كُنَّ فِيهِ وَجَدَ حَلَاوَةَ الإِيمَانِ أَنْ يَكُونَ اللّٰهُ وَرَسُولُهُ أَحَبَّ إِلَيْهِ مِمَّا سِوَاهُمَا، وَأَنْ يُحِبَّ الْمَرْءَ لَا يُحِبُّهُ إِلَّا لِلّٰهِ، وَأَنْ يَكْرَهَ أَنْ يَعُودَ فِي الْكُفْرِ بَعْدَ أَنْ أَنْقَذَهُ اللّٰهُ مِنْهُ، كَمَا يَكْرَهُ أَنْ يُقْذَفَ فِي النَّارِ" (متفق عليه)

**"మూడు విషయాలు ఎవరిలోనయితే ఉన్నాయో అతను విశ్వాస మాధుర్యాన్ని పొందాడు. (1) అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త అతని దృష్టిలో వేరితరులకన్నా ఎక్కువ ప్రియతములై ఉండాలి.**



**(2) అతను ఎవరిని ప్రేమించినా కేవలం అల్లాహ్ కొరకే ప్రేమించేవాడై ఉండాలి. (3) అల్లాహ్ తనకు మోక్షం ప్రసాదించిన మీదట, తాను అవిశ్వాసం (కుఫ్ర్) వైపునకు మళ్ళించబడటం అనేది అతని దృష్టిలో అగ్నిలో పడవెయ్యబడటం కన్నా ఎక్కువ అయిష్టకరం అయి ఉండాలి." (ముత్తఫఖున్ అలై – ఉభయేకీభవితం)**

దైవప్రవక్త (ﷺ) యెడల గల ప్రేమ దైవప్రేమకు లోబడి ఉండాలి. స్థాయి రీత్యా అది అల్లాహ్ ప్రేమ తర్వాతే.

ఒక్క అల్లాహ్ తప్ప – ఆయన (ﷺ) యెడల గల ప్రేమ మిగిలిన వారందరి ప్రేమకన్నా అత్యధికంగా ఉండాలి. ఈ విషయమై ఆయన (ﷺ) ఇలా అన్నారు :

"لَا يُؤْمِنُ أَحَدُكُمْ حَتَّىٰ أَكُونَ أَحَبَّ إِلَيْهِ مِنْ وَلَدِهِ وَوَالِدِهِ وَالنَّاسِ أَجْمَعِينَ" (بخاری ومسلم)

**"మీలో ఏ వ్యక్తి కూడా, తన ఆలుబిడ్డలకన్నా, తన తల్లిదండ్రులకన్నా, సమస్త మానవులకన్నా ఎక్కువగా నన్ను ప్రేమించనంత వరకూ విశ్వాసి కాజాలడు." (ముత్తఫఖున్ అలై)**

విశ్వాసి కొరకు దైవప్రవక్త (ﷺ) అతని ప్రాణంకన్నా ఎక్కువ ప్రియతములై ఉండాలని హదీసులో అనబడింది. ఒక హదీసు ప్రకారం హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (رضي الله عنه), "ఓ దైవప్రవక్తా (ﷺ)! మీరు నా ప్రాణం తప్ప మిగతా వస్తువులన్నింటికన్నా నాకు ఎక్కువ ప్రియతములు" అని చెప్పగా, ఆయన (ﷺ) ఇలా అన్నారు :

"وَالَّذِي نَفْسِي بِيَدِهِ حَتَّىٰ أَكُونَ أَحَبَّ إِلَيْكَ مِنْ نَفْسِكَ" (بخاری)

**"ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! నీ దృష్టిలో నేను నీ ప్రాణం కన్నా ఎక్కువ ప్రియతముణ్ణి కానంత వరకూ (నీ విశ్వాసం పరిపూర్ణం కాజాలదు)."**

**ఇది విని ఉమర్ (రజి) "ఇప్పుడు మీరు నా దృష్టిలో నా ప్రాణం కన్నా ఎక్కువ ప్రియతములు" అన్నారు. అప్పుడు ఆయన (సఅసం), "ఉమర్! ఇప్పుడు నీ విశ్వాసం పరిపూర్ణం అయింది" అని చెప్పారు. (బుఖారీ)**

ఈ హదీసు ద్వారా ప్రస్ఫుటమయిన విషయం ఏమిటంటే, ఒక విశ్వాసి (మోమిన్) దైవప్రవక్త (ﷺ)ను ప్రగాఢంగా ప్రేమించటం తప్పనిసరి. అల్లాహ్ ప్రేమ తర్వాత

మిగతా వస్తువులన్నింటి కంటే అధికంగా అతను మహాప్రవక్త (ﷺ)ను ప్రేమించాలి. ఎందుకంటే దైవప్రవక్త (ﷺ) పట్ల గల ప్రేమ రెండవ స్థానంలో ఉంటే, దేవుని పట్ల గల ప్రేమ మొదటి స్థానంలో ఉండాలి. ఎవరు ఎవరిని ప్రేమించినా అది అల్లాహ్ ప్రీతి కొరకే అయి ఉండాలి.

దైవప్రవక్త (ﷺ) యెడల గల ప్రేమ మన నుండి కోరేది ఏమిటి? అంటే మనం ఆయన యెడల మర్యాదపూర్వకంగా మెలగాలి. ఆయనకు విధేయత చూపాలి. ఆయన విధానాన్ని ఖచ్చితంగా అనుసరించాలి. ఆయన (ﷺ) మాటకు వేరితరుల మాటకన్నా ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. ఆయన (ﷺ) నెలకొల్పిన సంప్రదాయం మనకు శిరోధార్యం కావాలి.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ఇలా అంటున్నారు :

మనిషి ఎవరిని ఎంతగా ప్రేమించినా, ఎంతటి గౌరవ ప్రపత్తులతో మెలగినా అది అల్లాహ్ పట్ల గల ప్రేమకు, భక్తికి లోబడి ఉన్నప్పుడు మాత్రమే ఆమోదయోగ్యమవుతుంది. ఉదాహరణకు : దైవప్రవక్త (ﷺ) యెడల మనకు గల ఆదరాభిమానాలు, ఆయన్ని (ﷺ) ప్రవక్తగా పంపిన వాని యెడల (అల్లాహ్ యెడల) గల ప్రేమాభిమానాల పరిపూర్తికి తార్కాణం. ఎందుకంటే అల్లాహ్ ఆయన్ని ప్రేమిస్తున్నందువల్లనే ఆయన (ﷺ) అనుయాయులు ఆయన్ని ప్రేమిస్తున్నారు. అల్లాహ్ ఆయన్ని సత్కరించినందువల్లనే ఉమ్మత్ సభ్యులు ఆయన పట్ల సత్కార భావంతో వ్యవహరిస్తున్నారు. ఈ విధంగా అల్లాహ్ కొరకే ఆయన (ﷺ) యెడల ప్రేమాభిమానం ప్రకటిస్తున్నారు.

మొత్తానికి అల్లాహ్ తన ప్రవక్త (ﷺ)ను అపూర్వంగా సత్కరించాడు. ఆయన వ్యక్తిత్వం పట్ల గౌరవభావంతో పాటు ప్రేమ, భయం కూడా కలిగేలా మలిచాడు. అందుకే ఆయన్ని చూచిన మనిషిలో ప్రేమ జనించటంతో పాటు గౌరవ భావం, భయం కూడా కలుగుతాయి. ప్రవక్త ప్రియ సహచరుల (رضي الله عنهم)కు ఆయన్ని చూసినపుడు ఈలాంటి భావనే కలిగేది. ఇతర మనుషులను చూసినపుడు వారికి ఇలాంటి వింతానుభూతి కలిగేది కాదు.

అమ్ర్ బిన్ ఆస్ (رضي الله عنه) ఇస్లాం స్వీకరించిన తరువాత ఆయన్ని (ﷺ) ఉద్దేశ్యించి ఇలా అన్నారు : "నా దృష్టిలో మీకన్నా ఎక్కువ ఆగ్రహించదగినవారు, ద్వేషించదగినవారు ఎవరూ ఉండేవారు కారు. కాని ఇస్లాం స్వీకరించిన మీదట నా దృష్టిలో మీకన్నా ఎక్కువ ప్రియతముడైన వ్యక్తి ఎవరూ లేరు. నా దృష్టిలో మీకన్నా ఎక్కువ ఆదరణీయుడైన వ్యక్తి ఎవరూ లేరు. మీ గుణగణాలను గురించి వివరించమని నాతో అంటే నేను వివరించలేను. ఎందుకంటే మీ పట్ల గల భయం, గౌరవభావం వల్ల నేను ఎన్నడూ మిమ్మల్ని తనివితీరా చూడలేకపోయాను."

ఉర్వహ్ బిన్ మస్ఊద్ ఖురైషులతో ఇలా అన్నాడు : "నా జాతి ప్రజలారా!



దైవసాక్షిగా చెబుతున్నాను. రోము, పారసీక చక్రవర్తుల దర్బారులోనూ, వేరితర రాజ్యాధినేతల దర్బారులోనూ వెళ్ళే అవకాశం నాకు లభించింది. కాని ముహమ్మద్ (ﷺ) అనుచరులు ముహమ్మద్ (ﷺ) యెడల చూపేంతటి గౌరవ ప్రపత్తులను నేను ఏ చక్రవర్తి పట్ల కూడా అతని పాలితులు చూపుతున్నట్లు కానలేదు. దైవసాక్షి! ఆయన పట్ల గల గౌరవం కొద్దీ వారు ఆయన కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం లేదు. ఆయన ఎప్పుడయినా ఉమ్మి వేసినా అది ఎవరో ఒక సహచరుని అరచేతుల్లో పడుతోంది – దానిని అతను తన ముఖానికో, ఛాతీకో పూసుకుంటున్నాడు. ఆయన వుజూ చేస్తున్నప్పుడు, క్రిందపడే నీళ్లను తీసుకోవటానికి వారు పరస్పరం ఎగబడుతున్నారు." (జిలాయిల్ ఇఫ్హామ్ : 120, 121)

**(2) ఆయన (ﷺ)ను కొనియాడటంలో అతిశయిల్లకూడదు :**

ఒకరి ప్రేమలో, మన్ననలో మితిమీరి పోవటాన్ని అరబీలో 'ఘులూ' అంటారు. దీనినే తెలుగులో అతిశయిల్లటం, అతిగా ప్రవర్తించటం అనవచ్చు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿لَا تَغْلُوا فِي دِينِكُمْ﴾ (النساء:١٧١)

**"మీరు మీ ధర్మం విషయంలో అతిశయిల్లకండి."(అన్ నిసా : 171)**

ఒకరి పొగడ్తలో హద్దుమీరి పోవటాన్ని, అందులో అబద్ధాలను కూడా జొప్పించటాన్ని **'ఇత్‌రా'** అంటారు.

దైవప్రవక్త (ﷺ) యెడల అతిశయిల్లటం అంటే – ఆయన (ﷺ) గొప్పతనాన్ని వర్ణించేటప్పుడు మితిమీరిపోవటం, సూటిగా చెప్పాలంటే ఆయన్ని దైవదాస్యపు, దైవదౌత్యపు స్థానం నుండి మరింత పైకెత్తటం, దైవత్వపు కొన్ని గుణాలను ఆయన (ﷺ)కు ఆపాదించటం, అల్లాహ్‌ను వదలి సహాయం కొరకు ఆయన్ని (ﷺ) అర్థించటం, గండం నుండి గట్టెక్కించమని విజ్ఞప్తి చేసుకోవటం మొదలగునవి.

ఆయన్ని పొగడటంలో శృతి మించటం (ఇత్‌రా) అంటే : ఆయన (ﷺ) ను మెచ్చుకునేటప్పుడు అతిశయోక్తులతో కూడిన మాటలు చెప్పటం. ఇలా చేయరాదని ఆయన (ﷺ) స్వయంగా తాకీదు చేశారు –

"لَا تُطْرُونِي كَمَا أَطْرَتِ النَّصَارَى ابْنَ مَرْيَمَ إِنَّمَا أَنَا عَبْدٌ فَقُولُوا: عَبْدُ اللهِ وَرَسُولُهُ" (متفق عليه)

**"క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసా (ఏసుక్రీస్తు)ను పొగడటంలో మితిమీరినట్లుగా మీరు నా ప్రశంసలో మితిమీరకండి. నేనొక దాసుణ్ణి**

**మాత్రమే. కనుక నన్ను దైవదాసుడనీ, ఆయన ప్రవక్త అనీ అనండి." (ముత్తఫకున్ అలై)**

అంటే నన్ను పొగిడే విషయంలో అనుచితంగా ప్రవర్తించకండి. అవసరానికి మించి పొగడకండి. క్రైస్తవులు ఈసా (ﷺ)ను పొగడ్తల్లో ముంచెత్తుతూ, కడకు ఆయన్ని దైవత్వపు స్థానంలో ప్రతిష్ఠించారు. నా ప్రభువు నన్ను ఏ గుణాలతో సత్కరించాడో ఆ గుణాలతోనే నన్ను శ్లాఘించండి. నన్ను అల్లాహ్ దాసుడని అనండి. అల్లాహ్ సందేశ హరుడని అనండి.

"మీరు మా సయ్యిద్ (నాయకమన్యులు)" అని కొంతమంది సహచరులు (رضي الله عنهم) చెప్పినపుడు, "అల్లాహ్‌యే అసలు సయ్యిద్" అని ఆయన (ﷺ) పలికారు.

అప్పుడు వారు, "మీరు మా అందరిలోకెల్లా ఉత్తములు. బలపరాక్రమాల రీత్యా దావూద్ దహెష్ కన్నా గొప్పవారు" అని అభిప్రాయపడగా ఆయన (ﷺ) ఇలా అన్నారు : "నిశ్చయంగా మీరు ఈ మాటలనండి లేదా వాటిలో కొన్ని మాత్రమే అనండి (కాదనను). కాని చూడండి! షైతాన్ మిమ్మల్ని దారి తప్పించరాదు సుమా!" (అబూదావూద్) (అంటే అప్రయత్నంగా అంటే ఫరవాలేదు గాని, అందులో మోహమాటానికి తావుండరాదు. కృత్రిమంగా మాటలు కల్పించకూడదు. అవి షైతాన్ తరఫున వకాల్తా పుచ్చుకున్నట్లుగా ఉండకూడదు. ఎందుకంటే దీనివల్ల షైతాన్‌కు మిమ్మల్ని పెడదారి పట్టించే అవకాశం చిక్కుతుంది).

కొంతమంది ఆయన్ని (ﷺ) ఉద్దేశ్యించి, "ఓ దైవప్రవక్తా! మా అందరిలోకీ శ్రేష్ఠుడా! మా అందరిలోకీ ఉత్తముడైన వాని పుత్రుడా! మా నాయకుడా! మా నాయకుని కుమారుడా!" అని సంబోధించగా, ఆయన (ﷺ) ఇలా ఉపదేశించారు :

"يَا أَيُّهَا النَّاسُ قُولُوا بِقَوْلِكُمْ وَلَا تَسْتَهْوِيَنَّكُمُ الشَّيْطَانُ، أَنَا مُحَمَّدٌ عَبْدُ اللّٰهِ وَرَسُولُهُ، مَا أُحِبُّ أَنْ تَرْفَعُونِي فَوْقَ مَنْزِلَتِي الَّتِي أَنْزَلَنِي اللّٰهُ عَزَّوَجَلَّ" (نسائى فى عمل اليوم و الليلة ۲۴۸/۲۴۹، صحيحه ۱۰۹۷، احمد: ۳/۱۵۳، ۲۴۱، ابن حبان: ۲۴۰)

**"ప్రజలారా! మీరు నా గురించి ఈ విధమైన మాటలు అనగలరు. కాని చూడండి! షైతాన్ మిమ్మల్ని కవ్వించకూడదు సుమా! ముహమ్మద్ నైన నేను దైవదాసుడను, దైవప్రవక్తను. గౌరవోన్నతుడగు అల్లాహ్ నన్ను ఏ స్థానంలో ఉంచాడో, ఆ స్థానం నుండి నన్ను పైకెత్తడాన్ని నేను ఇష్టపడను." (అహ్మద్-3/153, నసాయి, అస్సహీహహ్ -1097)**

మహాప్రవక్త (ﷺ) నిశ్చయంగా మానవోత్తములై ఉండి కూడా "మీరు మా నాయకులు ... మీరు మా అందరిలోకీ శ్రేష్ఠులు ... మీరు మా అందరికన్నా గొప్పవారు"



లాంటి బిరుదులను తన కొరకు ఇష్టపడలేదు. తన విషయంలో ప్రజలను అతివాదం నుండి దూరంగా ఉంచటానికి, తౌహీద్‌ను రక్షించటానికి ఆయన (ﷺ) ఈ విధంగా పలకరాదని తాకీదు చేశారు. తనను కేవలం రెండు గుణాలతో సత్కరించమని ఆయన (ﷺ) కోరారు. అవే (1) దైవదాసుడు (2) దైవప్రవక్త. ఒక దాసుని కొరకు ఇవే చాలా గొప్ప స్థానాలు. ఇలా పలకటం వల్ల మనిషి అతిశయిల్లడానికి గానీ, అతని విశ్వాసానికి ముప్పు వాటిల్లడానికి గానీ ఆస్కారం ఉండదు. దేవుడు ఆయన్ని ఏ స్థానంపై ప్రతిష్ఠించాడో, ఏ స్థాయిని ఆయన కొరకు సమ్మతించి ఆమోదించాడో ఆ స్థానం కన్నా పైకెత్తటాన్ని ఆయన సుతరామూ ఇష్టపడలేదు. అయినప్పటికీ చాలామంది ఆయన (ﷺ) వారింపును అతిక్రమించారు. ఏ విషయాల కొరకు కేవలం అల్లాహ్‌ను మాత్రమే అర్థించాలో వాటికై ప్రవక్త (ﷺ)ను అర్థించటం మొదలెట్టారు. కష్టాలను తొలగించమని దైవప్రవక్త (ﷺ)కు ఫిర్యాదు చేసుకోసాగారు. ఉదాహరణకు : మీలాదుల రూపంలో, ఖసీదాల, నాతుల రూపంలో అడ్డూ ఆపూ లేకుండా ప్రజలు ఆయన (స)ను అర్థించసాగారు. ఈ సందర్భంగా వారు అల్లాహ్ హక్కుకు – ప్రవక్త (ﷺ) హక్కుకు మధ్య గల వ్యత్యాసాన్ని కూడా మరచిపోయారు.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) తన 'ఖసీదా కనూనియా'లో ఇలా అన్నారు:

لـلـه حـق لا يـكـون لـغـيـره    ولـعـبـده حـق هـمـا حـقـان
لاتجعلوا الحقين حقا واحدا    مـن غيـر تـميـز ولا فـرقـان

**అల్లాహ్ యొక్క ఒక హక్కుంది. అది ఎవరికీ చెందదు. ఆయన దాసుని హక్కు ఒకటుంది. ఇవి రెండూ వేర్వేరు హక్కులు. కనుక ఆ రెండు హక్కులనూ విచక్షణా రహితంగా ఒకే హక్కుగా చేయకండి.**

### (3) ఆయన (ﷺ) స్థానం అత్యున్నతం

దేవుడు ఆయన (ﷺ)కు ప్రసాదించిన స్థానం గురించి, ఆయన్ని ప్రశంసించిన తీరును గురించి అభివర్ణించటం ఏ విధంగానూ ఆక్షేపణీయం కాదు. అల్లాహ్ ఆయనకు ప్రశంసాత్మకమైన అత్యున్నత స్థానంపై ప్రతిష్ఠించాడు. ఆయన (ﷺ) అల్లాహ్ దాసులు. అల్లాహ్ సందేశహరులు. మానవులందరిలోనే ఉత్తములు, సర్వశ్రేష్ఠులు. ఆయన కేవలం మానవుల కొరకే కాదు, జిన్నుల వైపునకు కూడా ప్రవక్తగా చేసి పంపబడ్డారు. ఆయన ప్రవక్తలలో కెల్లా శ్రేష్ఠులు. ఆయన ప్రవక్తల పరంపరకు పరిసమాప్తిగా వచ్చిన అంతిమ దైవప్రవక్త. ఆయన తరువాత మరే ప్రవక్తా రారు. అల్లాహ్ ఆయన (ﷺ) హృదయాన్ని ఆయన కొరకు విప్పారజేశాడు. ఆయన నామ స్మరణను ఉన్నతికి చేర్చాడు. ఆయన

(ﷺ) ఆజ్ఞను ఎదిరించే వారిపై అవమానాన్ని, పరాభవాన్ని విధించాడు. ఆయన ప్రశంసాత్మకమయిన 'మఖామె మహ్మూద్'ను పొందారు. దాని గురించి పరమ ప్రభువు ఈ విధంగా ప్రస్తుతించాడు.

﴿عَسَى أَن يَبْعَثَكَ رَبُّكَ مَقَاماً مَّحْمُوداً﴾(الاسراء:٧٩)

**"త్వరలోనే నీ ప్రభువు నిన్ను 'మఖామె మహ్మూద్' (ప్రశంసాత్మక మయిన స్థానం)పై ప్రతిష్ఠిస్తాడు." (అల్ ఇస్రా : 79)**

ప్రళయదినాన దేవుడు తన ప్రవక్త (స)ను జనుల సిఫారసు కొరకు నిలిపే అత్యున్నత స్థానం అది! ఈ స్థానం ఒక్క ముహమ్మద్ ప్రవక్త (ﷺ) వారికే ప్రత్యేకం. ఆయన తప్ప మరే ప్రవక్తకూ ఈ స్థానం లభించదు.

ఆయన (ﷺ) దేవుని సృష్టితాలలో అందరికన్నా అధికంగా అల్లాహ్‌కు భయపడేవారు. అందరికన్నా ఎక్కువ భక్తిపరాయణులు. ఆయన (ﷺ) సమక్షంలో హెచ్చు స్వరంతో మాట్లాడటాన్ని సయితం అల్లాహ్ వారించాడు. ఆయన (ﷺ) ఎదుట మెల్లగా మాట్లాడేవారిని అల్లాహ్ ప్రశంసించాడు. ఇలా సెలవిచ్చాడు :

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَرْفَعُوا أَصْوَاتَكُمْ فَوْقَ صَوْتِ النَّبِيِّ وَلَا تَجْهَرُوا لَهُ بِالْقَوْلِ كَجَهْرِ بَعْضِكُمْ لِبَعْضٍ أَن تَحْبَطَ أَعْمَالُكُمْ وَأَنتُمْ لَا تَشْعُرُونَ ☆إِنَّ الَّذِينَ يَغُضُّونَ أَصْوَاتَهُمْ عِندَ رَسُولِ اللَّهِ أُوْلَئِكَ الَّذِينَ امْتَحَنَ اللَّهُ قُلُوبَهُمْ لِلتَّقْوَى لَهُم مَّغْفِرَةٌ وَأَجْرٌ عَظِيمٌ ☆إِنَّ الَّذِينَ يُنَادُونَكَ مِن وَرَاء الْحُجُرَاتِ أَكْثَرُهُمْ لَا يَعْقِلُونَ☆وَلَوْ أَنَّهُمْ صَبَرُوا حَتَّى تَخْرُجَ إِلَيْهِمْ لَكَانَ خَيْراً لَّهُمْ وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ﴾(الحجرات:٢،٥)

**"ఓ విశ్వాసులారా! మీ కంఠ స్వరాలను ప్రవక్త కంఠస్వరం కంటే హెచ్చుగా ఉంచకండి. మీరు పరస్పరం బిగ్గరగా మాట్లాడుకునే విధంగా ఆయన (స)తో బిగ్గరగా మాట్లాడకండి. దీనివల్ల మీ కర్మలన్నీ వ్యర్థమైపోవచ్చు. దాని గురించి మీకు తెలియకనూపోవచ్చు. ఎవరయితే దైవప్రవక్త సమక్షంలో అణకువతో (తగ్గు స్వరంతో) మాట్లాడతారో వారి హృదయాలను అల్లాహ్ ధర్మపరాయణత (తఖ్వా) కోసం పరికించుకున్నాడు. వారికి మన్నింపుతో పాటు గొప్ప ప్రతిఫలం కూడా ఉంది. (ఓ ప్రవక్తా!) ఎవరయితే కుటీరాల వెనుక నుండి నిన్ను కేకవేసి పిలుస్తున్నారో వారిలో చాలామందికి (బొత్తిగా)**



**బుద్ధిలేదు. నీవంతట నీవుగా వారి దగ్గరకు వెడలి వచ్చేవరకూ వారు గనక ఓపిక పట్టి ఉంటే, అది వారి కొరకు మేలై ఉండేది. అల్లాహ్ క్షమాగుణం కలవాడు, దయాశీలుడు." (అల్ హుజురాత్:2 – 5)**

ఇమామ్ ఇబ్నె కసీర్ (رحمه الله) ఇలా అంటున్నారు : "ఈ సూక్తులలో అల్లాహ్ విశ్వాసులైన తన దాసులకు మర్యాదను, సంస్కారాన్ని నేర్పాడు. దైవప్రవక్త (ﷺ) యెడల ఎలా గౌరవభావంతో, మర్యాదపూర్వకంగా మసలుకోవాలో తెలియజేశాడు. దైవప్రవక్త (ﷺ) సమక్షంలో తమ కంఠస్వరాలను ప్రవక్త కంఠస్వరం కన్నా పెంచరాదని హితబోధ చేశాడు."

తన ప్రవక్త (ﷺ)ను పేరుతో పిలవటాన్ని కూడా అల్లాహ్ వారించాడు. అంటే 'ఓ ముహమ్మద్!' (ﷺ)అని అన్యులు పిలిచినట్లుగా పిలవరాదని, ఆయన ప్రవక్తా పదవి దృష్ట్యా 'ఓ దైవప్రవక్తా!', 'ఓ సందేశహరుడా!' అని మాత్రమే పిలవాలని ఉపదేశించాడు. ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿لَاتَجْعَلُوا دُعَاء الرَّسُولِ بَيْنَكُمْ كَدُعَاء بَعْضِكُم بَعْضاً﴾(النور:٦٣)

**"మీరు దైవప్రవక్త పిలుపును, మీలో మీరు పిలుచుకునే మామూలు పిలుపులా భావించకండి." (అన్ నూర్ : 63)**

స్వయంగా అల్లాహ్ సయితం ఆయన్ని 'ఓ ప్రవక్తా!' అని సంబోధించాడు. అల్లాహ్ మరియు ఆయన దూతలు ఆయన (ﷺ)పై దురూద్, సలాం (కారుణ్యం) పంపుతున్నారు. తన దాసులు కూడా తన ప్రవక్త (ﷺ)పై సలాత్, సలాంలను పంపాలని అల్లాహ్ ఆజ్ఞాపించాడు. ఈ విధంగా సెలవీయబడింది :

﴿إِنَّ اللَّهَ وَمَلَائِكَتَهُ يُصَلُّونَ عَلَى النَّبِيِّ يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا صَلُّوا عَلَيْهِ وَسَلِّمُوا تَسْلِيماً﴾(الاحزاب:٥٦)

**నిశ్చయంగా అల్లాహ్, ఆయన దూతలు దైవప్రవక్తపై కారుణ్యాన్ని పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా అతనిపై దురూద్ పంపండి. అత్యధికంగా అతనికి 'సలాములు' పంపుతూ ఉండండి. (అల్ అహ్జాబ్ : 56)**

అయితే ఖుర్ఆన్ హదీసుల ఆధారాలతో నిమిత్తం లేకుండా ఆయన్ని కొనియాడే ఉద్దేశంతో ఓ నిర్ధారిత సమయాన్ని, ఓ ప్రత్యేక దినాన్ని ప్రత్యేకించుకోవటం తగదు. ఈ మధ్య కొందరు ప్రబుద్ధులు ప్రవక్త (ﷺ) కీర్తన నిమిత్తం, ఆయన (ﷺ) పుట్టిన

తేదీగా భావించబడుతున్న దినాన్ని ప్రత్యేకించుకుంటున్నారు. ఇది ధర్మసమ్మతం కాదు. పైగా ఇదొక బిద్అత్ (కొత్త పోకడ).

ఆయన (ﷺ) నెలకొల్పిన సున్నత్ (సంప్రదాయం)ను గౌరవించటం, దానిని పాటించటం తప్పనిసరి అని నమ్మటం కూడా ఆయన (ﷺ) పట్ల గౌరవ మర్యాదల్లో అంతర్భాగమే. ఎందుకంటే ఖుర్ఆన్ తరువాత ఆయన (ﷺ) సున్నత్‌కు రెండవ స్థానం ఉంది. అది (సున్నత్) కూడా అల్లాహ్ తరఫున అందిన సంకేతమే. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿ وَمَا يَنطِقُ عَنِ الْهَوَى ☆ إِنْ هُوَ إِلَّا وَحْيٌ يُوحَى ﴾(النجم:٣-٤)

**అతను (ప్రవక్త) తన మనోవాంఛలకు లోబడి మాట్లాడటం లేదు. అది అతని వద్దకు పంపబడే 'వహీ' (దైవవాణి) తప్ప మరేమీ కాదు. (అన్ నజ్మ్ : 3, 4)**

కనుక దైవప్రవక్త (ﷺ) వారి సున్నత్ (విధానం, సంప్రదాయం)లో సందేహాలు రేకెత్తించటం, దాని ప్రాశస్త్యాన్ని తగ్గించటం ధర్మసమ్మతం కాదు. అలాగే దాని పరంపర, సనదులకు సంబంధించిన ప్రామాణికత లేక బలహీనతపై మిడిమిడి జ్ఞానంతో వ్యాఖ్యానించటం, జ్ఞానంతో నిమిత్తం లేకుండానే వాటికి తాత్పర్యం చెప్పటం సరైనది కాదు. ఈ మధ్య కాలంలో దైవప్రవక్త (ﷺ) సున్నత్‌పై నోరు పారేసుకునే అజ్ఞానులు చాలామంది పుట్టుకొచ్చారు. ముఖ్యంగా విద్యార్థి దశలో ఉన్న నవ యువకులు ఈ విషయంలో మరీను. వారు నిశిత జ్ఞానం లేకుండానే – కేవలం కొన్ని పుస్తకాలు చదివి, హదీసుల ప్రామాణికతపై, వాటి బలహీనతపై, హదీసు ఉల్లేఖకులపై 'అధిక ప్రసంగాలు' చేసేస్తున్నారు. ఈ ధోరణి స్వయంగా వారికీ, ఉమ్మత్‌కి కూడా ప్రమాదకరమే. వారు అల్లాహ్‌కు భయపడాలి. తమ అవధులను మీరకూడదు. ఇది చాలా అవసరం.



## రెండవ ప్రకరణం

# దైవప్రవక్త (ﷺ)కు విధేయత చూపటం అనివార్యం

మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఆదేశించిన వాటిని నెరవేరుస్తూ, ఆయన (ﷺ) వారించిన వాటికి దూరంగా ఉంటూ విధేయత చూపటం ప్రతి వ్యక్తికీ తప్పనిసరి. ఆయన (ﷺ) దైవప్రవక్త అని సాక్ష్యమిచ్చిన ప్రతి ఒక్కరి నుండీ ఈ విధంగా కోరబడింది. ఆయన (ﷺ)కు విధేయత చూపవలసిందిగా దేవుడు అనేక సూక్తులలో ఆజ్ఞాపించాడు. కొన్నిచోట్లయితే తనకు విధేయత చూపమని ఆజ్ఞాపించిన వెంటనే, తన ప్రవక్త (ﷺ)కు కూడా విధేయత కనబరచాలని ఆదేశించాడు. ఉదాహరణకు :

﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا أَطِيعُوا اللَّهَ وَأَطِيعُوا الرَّسُول﴾(النساء:٥٩)

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్త (స)కు విధేయులై ఉండండి." (అన్ నిసా : 59)**

ఇలాంటి సూక్తులు ఇంకా ఉన్నాయి. ఒక్కోచోట కేవలం ఆయన (ﷺ)కు విధేయత చూపమని చెప్పబడింది. ఉదాహరణకు :

﴿ مَّن يُطِعِ الرَّسُولَ فَقَدْ أَطَاعَ اللَّهَ ﴾(النساء:٨٠)

**ఈ ప్రవక్తకు విధేయత చూపినవాడు అల్లాహ్‌కు విధేయత చూపినట్లే. (అన్ నిసా : 80)**

వేరొక చోట ఈ విధంగా సెలవీయబడింది :

﴿وَأَطِيعُوا الرَّسُولَ لَعَلَّكُمْ تُرْحَمُونَ﴾(النور:٥٦)

**దైవప్రవక్త విధేయులుగా మసలుకోండి – తద్వారానే మీరు కరుణించబడతారు. (అన్ నూర్ : 56)**

ఒక్కోచోట తన ప్రవక్త (ﷺ)కు అవిధేయత కనబరిచే వారిని దేవుడు హెచ్చరించాడు. ఉదాహరణకు :

﴿ فَلْيَحْذَرِ الَّذِينَ يُخَالِفُونَ عَنْ أَمْرِهِ أَن تُصِيبَهُمْ فِتْنَةٌ أَوْ يُصِيبَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴾ (النور:٦٣)

**"వినండి! ఎవరు ప్రవక్త ఆజ్ఞను ఎదిరిస్తున్నారో వారు, తమపై ఏదయినా ఘోర విపత్తు వచ్చిపడుతుందేమోనని లేదా తమను ఏదయినా బాధాకరమయిన శిక్ష చుట్టుముడుతుందేమోనని భయపడాలి." (అన్ నూర్ : 63)**

అంటే వారి ఆంతర్యం ఏదైనా ఉపద్రవానికి – అంటే అవిశ్వాసానికిగానీ, కాపట్యానికి గానీ, బిద్అత్‌కు గానీ ఆలవాలం అవుతుందేమో! లేదా ప్రాపంచిక జీవితంలోనే ఏదయినా బాధాకరమైన విపత్తు వారిపై వచ్చి పడుతుందేమో! అంటే – హత్య గావించ బడటమో లేదా కఠిన కారాగార శిక్ష పడటమో లేదా మరేదయినా ఆకస్మిక ప్రమాదానికి గురవటమో జరగవచ్చు.

ఆయన (ﷺ) యెడల ప్రేమను అల్లాహ్ దైవప్రీతికి తార్కాణంగా, పాపాల మన్నింపునకు సాధనంగా ఖరారు చేశాడు :

﴿قُلْ إِن كُنتُمْ تُحِبُّونَ اللَّهَ فَاتَّبِعُونِي يُحْبِبْكُمُ اللَّهُ وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ﴾(آل عمران:٣١)

**(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను క్షమిస్తాడు." (ఆలి ఇమ్రాన్ : 31)**

ఇంకా – ఆయన (ﷺ) యెడల చూపే విధేయతను మార్గదర్శకత్వంగా, అవిధేయతను మార్గవిహీనతగా అల్లాహ్ ఖరారు చేశాడు :

﴿وَإِن تُطِيعُوهُ تَهْتَدُوا﴾(النور:٥٤)

**మీరు దైవప్రవక్త మాటను విన్నప్పుడే మీకు సన్మార్గం లభిస్తుంది. (అన్ నూర్ : 54)**

ఆ తరువాత ఇలా అనబడింది :

﴿فَإِن لَّمْ يَسْتَجِيبُوا لَكَ فَاعْلَمْ أَنَّمَا يَتَّبِعُونَ أَهْوَاءَهُمْ وَمَنْ أَضَلُّ مِمَّنِ اتَّبَعَ هَوَاهُ بِغَيْرِ هُدًى مِّنَ اللَّهِ إِنَّ اللَّهَ لَا يَهْدِي الْقَوْمَ الظَّالِمِينَ﴾(القصص:٥٠)

**మరి వారు గనక నీ సవాలును స్వీకరించకపోతే, వారు తమ మనో వాంఛలను అనుసరించే జనులని తెలుసుకో! అల్లాహ్ మార్గదర్శ కత్వాన్ని కాకుండా తన మనోవాంఛల వెనుక నడిచే వానికన్నా ఎక్కువ మార్గభ్రష్టుడెవడుంటాడు? అల్లాహ్ దుర్మార్గులకు ఎట్టిపరిస్థితిలోనూ సన్మార్గం చూపడు. (అల్ ఖసస్ : 50)**

ఆయన (ﷺ) లో ఆయన అనుయాయుల కొరకు గొప్ప ఆదర్శం ఉందన్న శుభవార్తను కూడా దేవుడు వినిపించాడు. ఉదాహరణకు ఈ సూక్తిని చూడండి :

﴿لَقَدْ كَانَ لَكُمْ فِي رَسُولِ اللَّهِ أُسْوَةٌ حَسَنَةٌ لِّمَن كَانَ يَرْجُو اللَّهَ وَالْيَوْمَ الْآخِرَ وَذَكَرَ اللَّهَ كَثِيرًا﴾(الاحزاب:٢١)

**నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది –**



**అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు. (అల్ అహ్‌జాబ్ : 21)**

ఇమామ్ ఇబ్నె కసీర్ (رحمه الله) ఇలా అంటున్నారు : "దైవప్రవక్త (ﷺ) వారి సమస్త వాక్కాయ కర్మలలో, పరిస్థితులలో ఆయన్ని అనుసరించే విషయంలో ఈ సూక్తి ఒక ప్రాతిపదిక వంటిది. అందుకే కందక యుద్ధం జరిగిన రోజు దేవుడు సహన స్థయిర్యాలతో వ్యవహరించాలనీ, శత్రువుల ఎదుట ధైర్యంగా నిలబడాలనీ, పోరాటపటిమను కనబరచాలనీ లోకేశ్వరుని తరపున అనుగ్రహించబడే సౌలభ్యాల కోసం నిరీక్షించాలని ఉపదేశించాడు. మీపై నిత్యం ప్రళయదినం వరకూ దైవకారుణ్యం, శాంతి కలుగుగాక!"

దేవుడు తన ప్రవక్త (ﷺ)కు విధేయత చూపవలసిందిగా, ఆయన (ﷺ) విధానాన్ని అనుసరించవలసిందిగా ఖుర్‌ఆన్‌లో దాదాపు 40 చోట్ల ఆదేశించాడు. కాబట్టి ఆయన (ﷺ) తెచ్చిన షరీయత్‌ను అధ్యయనం చేయటం, దానిని అనుసరించటం మనకు అన్నపానీయాల కన్నా ముఖ్యం. ఎందుకంటే మనిషికి అన్నపానీయాలు లభించకపోతే ప్రపంచంలో మరణం సంభవిస్తుంది. కాని దైవప్రవక్త (ﷺ)కు గనక విధేయత చూపకపోతే, ఆయన సంప్రదాయాన్ని అనుసరించకపోతే పరలోకంలో శాశ్వతమయిన శిక్షను చవిచూడవలసి ఉంటుంది. అలాగే ఆయన (ﷺ) సకల ఆరాధనలలో తన పద్ధతిని అనుసరించవలసిందిగా ఆజ్ఞాపించారు. కనుక మనం ఆరాధనలను ఆయన (ﷺ) చేసినట్లుగానే చేయాలి. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿لَقَدْ كَانَ لَكُمْ فِي رَسُولِ اللَّهِ أُسْوَةٌ حَسَنَةٌ﴾(الاحزاب:٢١)

**నిశ్చయంగా మీ కొరకు దైవప్రవక్త (ﷺ)లో అత్యుత్తమ ఆదర్శం ఉంది. (అల్ అహ్‌జాబ్ : 21)**

మహనీయ ముహమ్మద్ (ﷺ) మనకిలా ఉపదేశించారు :

"صَلُّوا كَمَا رَأَيْتُمُونِي أُصَلِّي"(بخاری)

**"నేను నమాజ్ చేస్తుండగా నన్ను చూసిన విధంగానే మీరు నమాజ్ చేయండి." (బుఖారీ)**

ఇంకా ఇలా అన్నారు :

"خُذُوا عَنِّي مَنَاسِكَكُمْ"(مسلم)

**“మీరు నా నుండి హజ్జ్ క్రియలను నేర్చుకోండి.” (ముస్లిం)**

ఈ విధంగా హెచ్చరించారు :

”مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ“ (صحيح مسلم)

**“ఎవరయినా మేము ఆజ్ఞాపించని దానిని ఆచరిస్తే, అట్టి కర్మ త్రోసి పుచ్చబడుతుంది.” (సహీహ్ ముస్లిం)**

ఇంకా ఇలా చెప్పారు :

”مَنْ رَّغِبَ عَنْ سُنَّتِي فَلَيْسَ مِنِّي“ (بخاری ومسلم)

**“ఎవడయితే నా విధానం పట్ల విముఖత చూపాడో వాడు నా వాడు కాదు.” (బుఖారీ, ముస్లిం)**

ఈ విధంగా ఖుర్ఆన్ హదీసులలో ఆయన (ﷺ) కు విధేయత చూపవలసిందిగా సూచించే ఆజ్ఞలు ఇంకా అనేకం ఉన్నాయి. ఆయన (ﷺ) కు అవిధేయత చూపరాదని కూడా చెప్పబడింది.



**మూడవ ప్రకరణం**

# దైవప్రవక్త (ﷺ) పై దురూద్, సలాం పంపే ఆదేశం షరీయత్ బద్ధమైనది

అల్లాహ్ తన షరీయత్‌లో తన ప్రవక్త (ﷺ) యెడల ముస్లింలు నెరవేర్చవలసిన బాధ్యతలను విశదీకరించాడు. వాటిలో ఒకటి ఆయన (ﷺ)పై దురూద్ సలాంలు పంపటం. అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఈ విధంగా ఆదేశించాడు :

﴿إِنَّ اللَّهَ وَمَلَائِكَتَهُ يُصَلُّونَ عَلَى النَّبِيِّ يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا صَلُّوا عَلَيْهِ وَسَلِّمُوا تَسْلِيمًا﴾ (الاحزاب:٥٦)

**నిశ్చయంగా అల్లాహ్, ఆయన దూతలు కూడా దైవప్రవక్తపై కారుణ్యాన్ని పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా అతనిపై దురూద్ పంపండి. అత్యధికంగా సలాములు (కూడా) పంపుతూ ఉండండి. (అల్ అహ్‌జాబ్ : 56)**

ఇమామ్ బుఖారీ గారు అబుల్ ఆలియాతో ఇలా అన్నారు :

“అల్లాహ్ దురూద్ పంపించటమంటే అర్థం, ఆయన తన దూతల ముందు తన ప్రవక్త (ﷺ)ను మెచ్చుకుంటాడు. దైవదూతలు దురూద్ పంపటమంటే భావం వారు ‘దుఆ’ చేస్తారు. మనుషులు ఆయన (ﷺ)కు దురూద్ పంపటమంటే ఆయన (ﷺ) మన్నింపు కొరకు, కారుణ్యం కొరకు అల్లాహ్‌ను అర్థించటం అన్నమాట.”

పై సూక్తి ద్వారా మహాప్రవక్త (ﷺ) స్థాయి, అంతస్తు ఎంత గొప్పదో అర్థమవుతోంది. ఊర్ధ్వ లోకాలలో దేవుడు తన సమీప దూతల ముందు ప్రవక్త (ﷺ)ను ప్రశంసించాడు. దైవదూతలు కూడా ఆయన (ﷺ) ఉన్నత స్థానాల కోసం ప్రార్థిస్తున్నారు. భూలోకవాసులు కూడా ఆయన (ﷺ) కారుణ్యం కొరకు ప్రార్థించవలసిందిగా దేవుడు ఆదేశించాడు – ఆ విధంగా ఊర్ధ్వలోకాల వారు, భూలోక వాసులు కూడా ప్రవక్త (ﷺ)ను శ్లాఘించటంలో ఏకమవ్వాలన్నది దేవుని అభిమతం. ఎంతటి ఉన్నత స్థానం!

‘సల్లిమూ తస్లీమా’ అంటే ఆయన (ﷺ)కు ఇస్లామీయ అభివాదం పంపమని అర్థం. కాబట్టి ఎవరయినా ప్రవక్త (ﷺ)కు దురూద్ పంపదలచినపుడు దురూద్‌తో పాటు సలామ్‌ని కూడా పంపాలి. కేవలం ఒక్క దానితో సరిపెట్టుకోకూడదు. కేవలం ‘సల్లల్లాహు అలైహి’ అని అనరాదు. కేవలం ‘అలైహిస్సలాం’ అని కూడా అనరాదు. ఎందుకంటే రెండింటినీ ఒకేసారి పలకాలన్నది దైవాజ్ఞ.

ప్రవక్త (ﷺ)పై దురూద్ పంపమని ఎన్నో చోట్ల నొక్కి చెప్పబడింది. కొన్ని చోట్ల తప్పనిసరి (వాజిబ్) అని అనబడితే, కొన్నిచోట్ల అలా చేయటం అభిలషణీయం (ముస్తహబ్) అనీ, సున్నతె ముఅక్కదా అని కూడా వక్కాణించబడింది.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) తన పుస్తకం "జలాఅల్ అఫ్‌హామ్" లో 41 చోట్ల, ఆయన (ﷺ)పై దురూద్, సలాంలను పంపటం మస్నూన్ (సున్నత్) అని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన ఇలా అన్నారు :

"మొదటి చోట : అన్నిటికన్నా ముఖ్యమైన, గట్టిగా నొక్కి వక్కాణించబడిన చోటు నమాజ్ – నమాజ్‌లోని చివరి తషహ్హుద్ (చివరి ఖాయిదా)లో దురూద్ పంపాలి. ఈ విషయంలో ముస్లిములందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది. కాని ఇక్కడ అది వాజిబ్ (తప్పనిసరి) అనే విషయంలో మటుకు భేదాభిప్రాయం ఉంది." (జలాయిల్ అఫ్‌హామ్ – పేజీ : 222, 223).

తరువాత ఆయన దురూద్ పంపవలసిన సందర్భాలేవో (ప్రసంగాల)లో జుమా ప్రసంగం, పండుగల ప్రసంగం, ఇస్తిస్ఖా ప్రసంగం, ముఅజ్జిన్ అజాన్ పలుకులకు సమాధానం పలికినప్పుడు, మస్జిద్‌లో ప్రవేశించినప్పుడు, మస్జిద్ నుండి వెడలినప్పుడు, ఆయన (ﷺ) ప్రస్తావన వచ్చినప్పుడు. ఆ తరువాత అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ప్రవక్త (ﷺ)పై దురూద్ పంపటం వల్ల కలిగే సత్ఫలితాలను, ప్రయోజనాలను విశదీకరించారు. ఈ సందర్భంగా ఆయన 40 ప్రయోజనాలను ప్రస్తావించారు. (జిలాఉల్ అఫ్‌హామ్ – పేజీ : 302)

వాటిలో కొన్ని ప్రయోజనాలివి :

1. ప్రవక్త (ﷺ)పై దురూద్ పంపటమంటే అల్లాహ్ ఆదేశపాలన చేయటమే.
2. ఒకసారి దురూద్ పంపిన వానిపై అల్లాహ్ తరఫున పది కారుణ్యాలు అవతరిస్తాయి (ముస్లిం).
3. 'దుఆ' ప్రారంభంలో దురూద్ పంపటం వల్ల ఆ దుఆ స్వీకారయోగ్యమయ్యే అవకాశాలు పెరిగిపోతాయి.
4. దురూద్ పంపటంతో పాటు ఆయన (ﷺ)కు ప్రశంసాత్మకమయిన స్థానం కూడా ప్రసాదించమని వేడుకున్నట్లయితే, ఆ వ్యక్తి ఆయన (ﷺ) సిఫారసుకు హక్కుదారుడై పోతాడు.
5. దురూద్ (పంపటం) పాపాల మన్నింపునకు సాధనం.
6. దైవప్రవక్త (ﷺ)పై దురూద్, సలామ్‌లు పంపిన వ్యక్తి దానికి జవాబుగా ప్రవక్త (ﷺ) వారి 'ప్రతిసలాం'కు హక్కుదారుడై పోతాడు.

మహాప్రవక్త (ﷺ)పై దైవ కారుణ్యం మరియు శాంతి వర్షించుగాక!



### నాల్గవ ప్రకరణం

## ప్రవక్త ఇంటివారి ప్రాశస్త్యం, వారి హక్కులు

'అహ్లె బైత్' అంటే ప్రవక్త (ﷺ) ఇంటివారలు అని అర్థం. అంటే ఎవరెవరిపై దానధర్మాలు (సదఖా) పుచ్చుకోవటం నిషేధించబడిందో వారంతా ఇందులోకి వస్తారు. అంటే హజ్రత్ అలీ (رضي الله عنه) సంతానం, హజ్రత్ జాఫర్ (رضي الله عنه) సంతానం, అఖీల్ (رضي الله عنه) సంతానం, అబ్బాస్ (رضي الله عنه) సంతానం, బనూ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ మరియు మహాప్రవక్త (ﷺ) సతీమణులు, ఆయన కుమార్తెలు – వీరంతా 'అహ్లె బైత్' అనబడతారు. దీనికి ఆధారం దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వచనం :

﴿إِنَّمَا يُرِيدُ اللَّهُ لِيُذْهِبَ عَنكُمُ الرِّجْسَ أَهْلَ الْبَيْتِ وَيُطَهِّرَكُمْ تَطْهِيرًا﴾ (الاحزاب:٣٣)

**ఓ ప్రవక్త ఇంటివారలారా! మీ నుండి (అన్ని రకాల) మాలిన్యాన్ని దూరం చేయాలన్నది, మిమ్మల్ని పూర్తిగా పరిశుద్ధ పరచాలన్నది అల్లాహ్ అభిలాష. (అల్ అహ్‌జాబ్ : 33)**

**ఇమామ్ ఇబ్నె కసీర్ (رحمه الله) ఇలా అంటున్నారు : దేవుని ఈ ఆదేశం ﴿إِنَّمَا يُرِيدُ اللَّهُ لِيُذْهِبَ عَنكُمُ الرِّجْسَ أَهْلَ الْبَيْتِ وَيُطَهِّرَكُمْ تَطْهِيرًا﴾ వచ్చిన తరువాత ఖుర్ఆన్‌పై యోచన చేసే ఏ వ్యక్తికయినా ప్రవక్త (ﷺ) గారి పవిత్ర సతీమణులు అహ్లెబైత్ (ప్రవక్త ఇంటివారలు) పరిధిలోకి వస్తారనే విషయంలో సందేహం కలుగదు. ఎందుకంటే అసలు ఈ ఆయత్ అవతరించింది ప్రవక్త సతీమణుల నేపథ్యంలోనే. అందుకే ఆ తరువాత ఇలా అనబడింది :**

﴿وَاذْكُرْنَ مَا يُتْلَى فِي بُيُوتِكُنَّ مِنْ آيَاتِ اللَّهِ وَالْحِكْمَةِ﴾ (الاحزاب:٣٤)

**మీ ఇండ్లలో పారాయణం చేయబడే అల్లాహ్ ఆయతులను, ప్రవక్త ప్రవచనాలను స్మరించుకుంటూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ మృదు స్వభావి, అన్నీ తెలిసినవాడు. (అల్ అహ్‌జాబ్ : 34)**

అంటే దేవుడు తన ప్రవక్త(ﷺ)పై ఖుర్ఆన్ హదీసులలో ఏ ఏ విషయాలనయితే అవతరింపజేస్తున్నాడో వాటిని ఆచరణలో పెట్టండి అని భావం.

ఖతాదా తదితర ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఈ ఆయతుకు తాత్పర్యంగా ఇలా అన్నారు:

సమస్త జనుల మధ్య మీకు ప్రత్యేకంగా ఇవ్వబడిన అనుగ్రహాన్ని జ్ఞాపకం చేసుకోండి. అదేమంటే వహీ (దైవవాణి) కేవలం మీ ఇండ్లలోనే అవతరించేది.

అబూబకర్ పుత్రిక అయిన ఆయిషా సిద్దీఖా (رضي الله عنها) ఈ గొప్ప అనుగ్రహానికి వేరితరులకన్నా ఎక్కువ హక్కుదారు. ఈ విషయంలో ఆమెకు విశిష్ఠ స్థానం దక్కింది. ఎందుకంటే ఒక్క ఆయిషా (رضي الله عنها) తప్ప ప్రవక్త సతీమణులలో వేరితరుల పడకపై ఉండగా ఆయన (ﷺ)పై 'వహీ' రాలేదు. దైవప్రవక్త (ﷺ) స్వయంగా ఈ విషయం వివరించారు. ఈ పూర్వరంగంలో కొందరు విద్వాంసులు ఇలా అభిప్రాయపడ్డారు : ఎందుకంటే ఆయన (ﷺ) ఒక్క ఆయిషా (رضي الله عنها) గారికి తప్ప వేరెవరినీ కన్యగా ఉండగా వివాహమాడలేదు. అందుచేత ఈ విషయంలో ఆమెగారికి ప్రత్యేకత నొసంగటం సమంజసమని భావించబడింది. ఇక ఆయన (ﷺ) సతీమణులు ఆయన ఇంటివారలలో చేరి ఉన్నప్పుడు, ఆయన (ﷺ) సమీప బంధువులకు ఇంటివారల (అహ్లె బైత్)లో చేరే హక్కు ప్రప్రథమంగా ఉంటుంది. (తఫ్సీర్ ఇబ్నె కసీర్)

అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వర్గీయులు దైవప్రవక్త (ﷺ) ఇంటివారల పట్ల అపారమైన గౌరవాభిమానాలు కలిగి ఉండేవారు. వారి విషయంలో 'ఘదీరెఖుమ్' దినాన దైవప్రవక్త (ﷺ) చేసిన వసీయతును వారు కాపాడుకునేవారు. దైవప్రవక్త (ﷺ) ఈ విధంగా తాకీదు చేశారు :

"أُذَكِّرُكُمُ اللهَ فِي أَهْلِ بَيْتِي" (مسلم)

**"నేను నా ఇంటివారల విషయంలో అల్లాహ్‌కు భయపడవలసినదిగా మిమ్మల్ని తాకీదు చేస్తున్నాను." (ముస్లిం)**

అందుచేత అహ్లె సున్నత్ వల్ జమాఅత్‌కి చెందినవారు అహ్లెబైత్ పట్ల గౌరవ మన్ననలు కలిగి ఉంటారు. ఎందుకంటే ఇలా చేయటం ప్రవక్త (ﷺ) యెడల గౌరవ ప్రపత్తులకు చిహ్నం. కాకపోతే వారు ప్రవక్త (ﷺ)ను నిజంగా అనుసరించేవారై ఉండాలి. మిల్లత్‌పై స్థిరంగా ఉండాలి. ఏ విధంగానయితే ప్రవక్త పినతండ్రి అయిన అబ్బాస్ (رضي الله عنه), వారి పిల్లలు, హజ్రత్ అలీ (رضي الله عنه) మరియు ఆయన పిల్లలు ఉండేవారో. కాని వారొకవేళ ప్రవక్త (ﷺ) విధానానికి వ్యతిరేకులుగా ఉంటే, ధర్మానికి కట్టుబడి ఉండకపోతే – అట్టి పరిస్థితిలో వారితో స్నేహబంధం ఏర్పరచుకోవటం సమ్మతం కాదు – వారు అహ్లెబైత్‌లోని వారైనప్పటికీ!

'అహ్లెబైత్'కు సంబంధించినంత వరకు అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వారి విధానం సహేతుకమైనది, సమతూకంతో కూడుకున్నది. వారిలో ఎవరు ధర్మంపై స్థిరంగా ఉన్నారో వారిని ఆదరిస్తారు. మరెవరు సున్నత్‌కు విరుద్ధంగా, ధర్మం పట్ల విముఖంగా



ఉంటున్నారో వారితో తెగత్రెంపులు చేసుకుంటారు. ఎందుకంటే వారు ధర్మం (దీన్) పై స్థిరంగా ఉండనంత వరకూ – వారు అహ్లెబైత్‌లోని వారైనంత మాత్రాన, దైవప్రవక్త (ﷺ) బంధువులైనంత మాత్రాన – అది వారికెలాంటి ప్రయోజనం చేకూర్చదు.

హజ్రత్ అబూహురైరా (رضي الله عنه) కథనం : దైవప్రవక్త (ﷺ) పై

﴿وَأَنذِرْ عَشِيرَتَكَ الْأَقْرَبِينَ﴾ (الشعراء:٢١٤)

**"నీవు నీ సమీప బంధువులను హెచ్చరించు" (అష్ షుఅరా : 214)**

అనే దివ్య వచనం అవతరించినప్పుడు ఆయన (ﷺ) లేచి నిలబడి ఇలా అన్నారు :

"يَا مَعْشَرَ قُرَيْشٍ أَوْ كَلِمَةٍ نحوها-اِشْتَرُوا أَنْفُسَكُمْ، لَا أُغْنِي عَنْكُمْ مِنَ اللهِ شَيْئًا ،يَا عَبَّاس ابْنَ عَبْدِ الْمُطَّلِبِ لَا أُغْنِي عَنْكَ مِنَ اللهِ شَيْئًا يَا صَفِيَّةُ عَمَّةَ رَسُولِ اللهِ لَا أُغْنِي عَنْكَ مِنَ اللهِ شَيْئًا وَيَا فَاطِمَةَ بِنْتَ مُحَمَّدٍ سَلِينِي مِنْ مَالِي مَا شِئْتِ ،لَا أُغْنِي عَنْكَ مِنَ اللهِ شَيْئًا" (بخاری)

**"ఓ ఖురైషు వర్గీయులారా! – లేదా అలాంటిదే మరో పదం వాడారు – మిమ్మల్ని మీరు రక్షించుకోండి. నేను అల్లాహ్ సన్నిధిలో మీకే విధంగానూ ఉపయోగపడలేను. అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడైన ఓ అబ్బాస్! అల్లాహ్ సమక్షంలో నేను మీ కొరకు ఎలాంటి అధికారం కలిగిలేను. దైవ సందేశహరుని అత్త ఓ సఫియా! నేను అల్లాహ్ సన్నిధిలో నీకు ఏ విధంగానూ తోడ్పడలేను. ఓ ముహమ్మద్ పుత్రిక ఫాతిమా! నా సొమ్ములో నుండి నీకేం కావాలో తీసుకో. అల్లాహ్ సన్నిధిలో నేను నీకు ఏ విధంగానూ ఉపయోగపడలేను." (బుఖారీ)**

వేరొక హదీసులో ఆయన (ﷺ) ఇలా ప్రవచించారు :

"مَنْ بَطَّأَ بِهِ عَمَلُهُ لَمْ يُسْرِعْ بِهِ نَسَبُهُ" (مسلم)

**"ఎవరి ఆచరణ అతన్ని వెనక్కి వదిలేస్తుందో అతని వంశం అతన్ని ముందుకు పంపదు." (ముస్లిం)**

అహ్లెబైత్‌లోని కొందరి పట్ల అతిగా వ్యవహరించే రాఫ్జీల (షియావర్గీయుల)

పోకడతో 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' తెగత్రెంపులను ప్రకటిస్తుంది. ఎందుకంటే వారు అన్ని రకాల పాపాలకు దోషాలకు అతీతులు, పవిత్రులు అని రాఫ్జీలు దావాచేస్తారు. అలాగే రుజుమార్గగాములైన అహ్లెబైత్ పట్ల ద్వేషభావాన్ని, అక్కసును వెళ్లగ్రక్కే, వారిపై శాపనార్థాలు పెట్టే 'నవాసిబ్' వర్గీయులతో తమకు ఎట్టి సంబంధం లేదని అహ్లె సున్నత్ వల్ జమాఅత్ ప్రకటిస్తోంది. అహ్లెబైత్‌కు చెందిన వారి 'వసీలా'ను పొందే, వారితోపాటు ప్రభువులుగా పరిగణించే బిద్అతీలతో కూడా అహ్లెసున్నత్ వల్ జమాఅత్ తన తెగత్రెంపుల ప్రకటన చేస్తోంది.

ఈ విషయంలో గానీ, మరితర వ్యవహారాలలో గానీ 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' మధ్యేమార్గం అవలంబిస్తుంది. అది ఎల్లప్పుడూ రుజుమార్గంపై నిలకడ కలిగి ఉంటుంది. అహ్లెబైత్ వారి విషయంలోనూ, ఇతరుల విషయంలోనూ అది అతివాదానికి, కుడి ఎడమల అపవాదాలకు లోనవదు. ఆ మాటకొస్తే రుజుమార్గగాములైన ప్రవక్త కుటుంబీకులు సయితం తమ పట్ల అతిశయిల్లరాదని చెప్పారు. అతిశయిల్లేవారిని వారు సుతరామూ ఇష్టపడలేదు. అలాంటివారితో సంబంధం త్రెంచుకున్నారు. పైగా అమీరుల్ మోమినీన్ హజ్రత్ అలీ (رضي الله عنه) గారు తన అభిమానంలో అతిగా వ్యవహరించేవారిని అగ్నిలో కాల్చివేశారు. వారిని హతమార్చిన చర్యను ఇబ్నె అబ్బాస్ (رضي الله عنهما) కూడా సమర్థించారు. అయితే అగ్నితో కాల్చేబదులు ఖడ్గంతో హతమార్చాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే హజ్రత్ అలీ (رضي الله عنه) అతివాదుల నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ సబాను కడతీర్చే ఉద్దేశ్యంతో పిలిపించారు. కాని అతను పలాయనం చిత్తగించి, అజ్ఞాన వాసంలోకి వెళ్ళిపోయాడు.



**ఐదవ ప్రకరణం**

# ప్రవక్త (ﷺ)సహచరుల (رضي الله عنهم) ఔన్నత్యం, వారి యెడల సద్భావన తప్పనిసరి. వారి మధ్యగల పరస్పర భేదాభిప్రాయాల విషయంలో అహ్లెసున్నత్ వల్ జమాఅత్ వైఖరి

**(1) సహాబా అంటే ఎవరు? వారి గురించి ఎటువంటి నమ్మకం కలిగి ఉండాలి?**

**సహాబా :** 'సహాబీ'కి బహువచనం 'సహాబా'. విశ్వాస (ఈమాన్) స్థితిలో దైవప్రవక్త (ﷺ)ను కలుసుకుని, విశ్వాసస్థితిలో తనువు చాలించిన వారంతా సహాబా (సహచరులు– رضي الله عنهم) అనబడతారు.

వారు ముస్లిం సమాజంలో అందరికన్నా శ్రేష్ఠులని, ఇస్లాం వైపు ముందంజవేసిన వారని, ప్రవక్త సహచర్య భాగ్యం పొందినవారని, ప్రవక్త (ﷺ)తో కలిసి జిహాద్ చేసినవారని, షరీయత్ బరువు బాధ్యతలను మోయటమే గాకుండా దానిని తమ తరువాతి తరాల వారికి అందించిన ధన్యజీవులని, ఈ కారణంగా వారు ప్రపంచంలోనే అత్యుత్తమ సమూహం అని మనం విశ్వసించటం తప్పనిసరి (వాజిబ్). అల్లాహ్ తన అంతిమ గ్రంథంలో వారిని కొనియాడుతూ ఇలా సెలవిచ్చాడు :

﴿وَالسَّابِقُونَ الْأَوَّلُونَ مِنَ الْمُهَاجِرِينَ وَالْأَنصَارِ وَالَّذِينَ اتَّبَعُوهُم بِإِحْسَانٍ رَّضِيَ اللَّهُ عَنْهُمْ وَرَضُوا عَنْهُ وَأَعَدَّ لَهُمْ جَنَّاتٍ تَجْرِي تَحْتَهَا الْأَنْهَارُ خَالِدِينَ فِيهَا أَبَدًا ذَٰلِكَ الْفَوْزُ الْعَظِيمُ﴾ (التوبة:١٠٠)

**ముహాజిర్లలో, అన్సార్లలో ప్రప్రథమంగా ముందంజవేసిన వారితోనూ, తరువాత చిత్తశుద్ధితో వారిని అనుసరించినవారితోనూ అల్లాహ్ ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల సంతుష్టులయ్యారు. క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలను అల్లాహ్ వారికోసం సిద్ధం చేసి ఉంచాడు. వాటిలో వారు కలకాలం ఉంటారు. గొప్ప సాఫల్యం అంటే ఇదే. (అత్ తౌబా : 100)**

ఇంకా ఈ విధంగా ప్రస్తుతించాడు :

﴿مُحَمَّدٌ رَّسُولُ اللَّهِ وَالَّذِينَ مَعَهُ أَشِدَّاءُ عَلَى الْكُفَّارِ رُحَمَاءُ بَيْنَهُمْ تَرَاهُمْ رُكَّعًا سُجَّدًا يَبْتَغُونَ فَضْلًا مِّنَ اللَّهِ وَرِضْوَانًا سِيمَاهُمْ فِي وُجُوهِهِم مِّنْ أَثَرِ السُّجُودِ ذَٰلِكَ مَثَلُهُمْ فِي التَّوْرَاةِ وَمَثَلُهُمْ فِي الْإِنجِيلِ كَزَرْعٍ أَخْرَجَ شَطْأَهُ فَآزَرَهُ فَاسْتَغْلَظَ فَاسْتَوَىٰ عَلَىٰ سُوقِهِ يُعْجِبُ الزُّرَّاعَ لِيَغِيظَ بِهِمُ الْكُفَّارَ وَعَدَ اللَّهُ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ مِنْهُم مَّغْفِرَةً وَأَجْرًا عَظِيمًا﴾ (الفتح:٢٩)

**ముహమ్మద్ (ﷺ) అల్లాహ్ ప్రవక్త. ఆయన వెంట ఉన్నవారు అవిశ్వాసులకు కొరుకుడు పడనివారు. ఒండొకరి పట్ల మాత్రం దయార్ద్ర హృదయులు. దైవ కృపను, దైవప్రసన్నతను చూరగొనే ప్రయత్నంలో వారు (దైవ సన్నిధిలో) వినమ్రులై వంగటాన్ని, సాష్టాంగ పడటాన్ని నీవు చూస్తావు. వారి సాష్టాంగ ప్రణామాల ప్రత్యేక ప్రభావం వారి ముఖారవిందాలపై తొణికిసలాడుతూ ఉంటుంది. వీరికి సంబంధించిన ఈ ఉపమానమే తౌరాతులో ఉంది. ఇన్‌జీలులో (కూడా) వారి ఉపమానం ఉంది. అది ఒక పంటపొలం వంటిది. అది తన మొలకను మొలకెత్తించింది. తరువాత దానిని బలపరిచింది. ఆ తరువాత అది లావు అయింది. ఆపైన అది తన కాండంపై నిటారుగా నిలబడింది. రైతులను అలరించసాగింది – వారి ద్వారా అవిశ్వాసులను మరింత ఉడికించాలని! వారిలో విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి మన్నింపును, గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేసి ఉన్నాడు. (అల్ ఫత్‌హ్ : 29)**

ఇంకా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿لِلْفُقَرَاءِ الْمُهَاجِرِينَ الَّذِينَ أُخْرِجُوا مِن دِيَارِهِمْ وَأَمْوَالِهِمْ يَبْتَغُونَ فَضْلًا مِّنَ اللَّهِ وَرِضْوَانًا وَيَنصُرُونَ اللَّهَ وَرَسُولَهُ أُولَٰئِكَ هُمُ الصَّادِقُونَ ☆ وَالَّذِينَ تَبَوَّءُوا الدَّارَ وَالْإِيمَانَ مِن قَبْلِهِمْ يُحِبُّونَ مَنْ هَاجَرَ إِلَيْهِمْ وَلَا يَجِدُونَ فِي صُدُورِهِمْ حَاجَةً مِّمَّا أُوتُوا وَيُؤْثِرُونَ عَلَىٰ أَنفُسِهِمْ وَلَوْ كَانَ بِهِمْ خَصَاصَةٌ وَمَن يُوقَ شُحَّ نَفْسِهِ فَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ﴾ (الحشر:٨-٩)

**(ముఖ్యంగా ఈ 'ఫై' సొమ్ము) తమ ఇల్లూ వాకిలి నుండీ, తమ ఆస్తిపాస్తుల నుండీ గెంటివేయబడిన నిరుపేద ముహాజిర్లకు చెందుతుంది. (ఎందుకంటే) వారు దైవానుగ్రహాన్ని, దైవప్రసన్నతను ఆశిస్తూ**



**దైవానికీ, ఆయన ప్రవక్తకూ తోడ్పడుతున్నారు. వారే సిసలయిన సత్యసంధులు. ఇకపోతే; వీరికంటే ముందే ఈ ప్రదేశం (మదీనా) లోనూ, విశ్వాసంలోనూ స్థానికులుగా ఉన్నవారు (వారికి కూడా ఈ సొమ్ము వర్తిస్తుంది). వారు ఇల్లూ వాకిలిని వదలి తమ వైపునకు వలసవచ్చే ముహాజిర్లను ప్రేమిస్తారు. వారికి ఏమి ఇవ్వబడినా తమ ఆంతర్యాలలో ఏ కాస్త కూడా సంకోచాన్ని రానివ్వరు. తాము ఎంతో అవసరంలో ఉన్నప్పటికీ తమపైన వారికే ప్రాధాన్యతనిస్తారు. వాస్తవానికి తమ ఆంతర్యంలోని స్వార్థప్రియత్వం (పేరాశ) నుండి రక్షించబడినవారే కృతార్థులు. (అల్ హష్ర్ : 8, 9)**

ఈ సూక్తులలో దేవుడు ముహాజిర్లను, అన్సార్లను మెచ్చుకున్నాడు. వారిని సత్కార్యాల వైపు ముందంజవేసే వారుగా అభివర్ణించాడు. తాను వారి పట్ల ప్రసన్నుణ్ణి అయ్యానని, వారి కొరకు పిల్లకాలువలు ప్రవహించే ఉద్యాన వనాలను సిద్ధపరచి ఉంచానని తెలిపాడు. ఇంకా వారిలోని సుగుణాలను తెలుపుతూ వారు పరస్పరం దయాగుణం కలవారని, అవిశ్వాసులకు మాత్రం సింహస్వప్నమని చెప్పాడు. వారు అత్యధికంగా దైవసన్నిధిలో వంగేవారని, సాష్టాంగ ప్రణామాలు చేసేవారని, వారి ఆంతర్యాలు నిర్మలంగా ఉండేవని చెప్పాడు. వారిలోని మరో ప్రత్యేకత ఏమిటంటే; వారు దైవవిధేయతా చిహ్నాంతో కనుగొనబడేవారు. అల్లాహ్ వారిని తన ప్రవక్త సహచర్యం కొరకు ఎంపిక చేశాడు – తద్వారా అవిశ్వాసులను మరింతగా ఉడికించాలని. వారిలో ముహాజిర్లు అనబడే వారి విశిష్టత ఏమిటంటే, వారు అల్లాహ్ ప్రీతి కొరకు, ధర్మసంస్థాపనార్థం తమ స్వదేశాన్ని, తమ ఆస్తిపాస్తులను వదలి ప్రస్థానం చేశారు. ఈ విషయంలో వారు నిజాయితీపరులని నిరూపించుకున్నారు. అన్సార్లు అనబడేవారి ప్రత్యేకత ఏమిటంటే వారు మదీనావాసులు. ముహాజిర్లను ఆదుకోవటంలో, దైవధర్మానికి తోడ్పడటంలో నికార్సయిన విశ్వాసులని నిరూపించుకున్నారు. వారిలోని ఓ గొప్ప సుగుణం ఏమిటంటే వారు తమ ముహాజిర్ సోదరులను అమితంగా ప్రేమించేవారు. వారి ప్రేమ నిష్కల్మషమయినది. వారి ఆంతర్యాలలో కల్లాకపటం ఉండేది కాదు. వారు ఎల్లప్పుడూ తమ ఆత్మలపై తమ ముహాజిర్ సోదరులకే ప్రాధాన్యత ఇచ్చారు. వారి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకునేవారు. వారి మనసులలో పిసినారితనం, సంకుచిత స్వభావం ఏ కోశానా ఉండేవి కావు. అందుకే వారు విజయ భాగ్యానికి నోచుకున్నారు. ఇవి వారిలోని సర్వసామాన్యమయిన సుగుణాలు. అలాగే కొన్ని ప్రత్యేక సుగుణాల దృష్ట్యా వారిలో కొందరు మరికొందరి కంటే గొప్పవారుగా కీర్తించబడ్డారు – ముఖ్యంగా ఇస్లాం కొరకు, ధర్మయుద్ధం కొరకు, హిజ్రత్ కొరకు ముందంజవేసిన కారణంగా!

వారిలో అందరికన్నా గొప్ప సహాబీలు (رضي الله عنهم) నలుగురు ధర్మ ఖలీఫాలు. అంటే

హజ్రత్ అబూబకర్, హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ అలీ (رضي الله عنهم). ఆ తరువాత అష్రె ముబష్షిరహ్ – అంటే స్వర్గలోక శుభవార్త ప్రపంచంలోనే పొందిన ధన్యజీవులు. వారు (నలుగురు ధర్మఖలీఫాలతో పాటు) తల్హా, జుబైర్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, అబూ ఉబైదా బిన్ జర్రాహ్, సాద్ బిన్ అబీ వఖ్ఖాస్, సయీద్ బిన్ జైద్ (رضي الله عنهم)లు. ముహాజిర్లకు అన్సార్లపై ఒకింత ప్రాధాన్యం ఉంది. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి, అహ్లె బైఅతే రిజ్వాన్‌లో ఉన్నవారికి ప్రత్యేక ప్రాధాన్యత వొసగబడింది. అలాగే మక్కా విజయానికి పూర్వం ఇస్లాం స్వీకరించి జిహాద్ చేసినవారు, మక్కా విజయం తర్వాత ఇస్లాం స్వీకరించిన సహాబీల కన్నా గొప్పవారు.

**(2) ప్రవక్త సహచరుల మధ్య విభేదాల, అంతఃకలహాల విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వైఖరి :**

**ఉపద్రవానికి మూలం :** ప్రవక్త ప్రియ సహచరుల మధ్య చీలిక రావటానికి ప్రధాన కారకులు యూదులు. వారు ఇస్లాంకు, ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రపన్నారు. వారు వంచనా శిల్పనిష్ణాతుడైన, యమన్ దేశస్థుడైన అబ్దుల్లాహ్ బిన్ సబా అనే యూద వ్యక్తిని దీని కొరకు సిద్ధం చేశారు. వాడు ఇస్లాం స్వీకరిస్తున్నట్లు నాటకమాడి తన చుట్టూ ఓ సుందర వలయాన్ని అల్లుకున్నాడు. తరువాత అతను తృతీయ ఖలీఫా అయిన హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه)కు వ్యతిరేకంగా దుర్విమర్శలు చేయటం మొదలెట్టాడు. చివరకు ఆయనపై విషం కక్కాడు. ఆయనపై అపనిందలు కూడా మోపాడు. తత్ఫలితంగా సంకుచిత స్వభావులు, బలహీన విశ్వాసం గలవారు కొందరు అతని మాటల్లో పడి, అసమ్మతి వాదులుగా అతని చుట్టూ చేరారు. వారి కుట్ర మూలంగా హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه) నిర్దాక్షిణ్యంగా హత్యచేయబడ్డారు. ఆయన (رضي الله عنه) అమరగతినొందిన తరువాత ముస్లిములలో విభేదాలు పొడసూపాయి. దానికి తోడు యూదులు చాపక్రింద నీరులా ప్రవహించి ప్రజలను రెచ్చగొట్టడంతో ప్రవక్త సహచరుల మధ్య విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. వారు తమ తమ ఇజ్తెహాద్ ప్రకారం (అంటే వారిలో ప్రతి ఒక్కరూ తాము ఎన్నుకునే విధానమే సరైనదని భావించటం వల్ల) కలహాలకు, యుద్ధాలకు తెరలేచింది.

'అఖీదయె తహావీయ' వ్యాఖ్యాత ఇలా అంటున్నారు : "రఫ్జ్ (షియాతత్వం) అనే ఉపద్రవాన్ని ఓ కపట విశ్వాసి సృష్టించాడు. ఇస్లాం ధర్మాన్ని రూపుమాపి, ఇస్లాం ప్రవక్త (صلى الله عليه وسلم) వ్యక్తిత్వాన్ని కళంకితం చేయాలన్నది వాడి ఉద్దేశ్యం. అందుకే అబ్దుల్లాహ్ బిన్ సబా ఇస్లాం స్వీకరించినట్లు ప్రకటించగానే తన వంచనాపూరిత, మోసపూరిత చేష్టల ద్వారా ఇస్లాం ధర్మానికి తూట్లు పొడవటం మొదలెట్టాడు. క్రైస్తవ మతం పట్ల బోల్స్ వ్యవహరించినట్లే ఇతనూ వ్యవహరించాడు. అంటే తనను ఒక మహా సాత్వికునిగా, దుష్ట శిక్షకు శిష్టరక్షణకు నడుం బిగించిన వానిగా చాటుకుని తనచుట్టూ ఓ సుందరవలయాన్ని అల్లుకున్నాడు. ఆ తరువాత హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه)కు వ్యతిరేకంగా అసంతృప్తవాదాన్ని వ్యాపింపజేసి, ఆయన్ని హతమార్చే ప్రయత్నం చేశాడు. దరిమిలా



'కూఫా' వచ్చి, హజ్రత్ అలీ (رضي الله عنه)కి వీరాభిమానిగా ప్రకటించుకుని, ఆయనను పొగడటంలో అతిశయిల్లి రాగానపడ్డాడు. ఆ విధంగా ఆయన (رضي الله عنه) అభిమానం చూరగొని, తన తుచ్ఛమయిన ఉద్దేశ్యాన్ని నెరవేర్చుకుందామనుకున్నాడు. అతని కుత్సితబుద్ధి గురించి తెలియగానే హజ్రత్ అలీ (رضي الله عنه), అతన్ని హతమార్చమని ఆదేశించారు. దాంతో వాడు 'ఖర్ఖైస్'కు పలాయనం చిత్తగించాడు. అతని పూర్తి వృత్తాంతం చరిత్రపుటల్లో ఉంది."

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు : హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه) అమరగతి నొందిన తరువాత ప్రజల గుండెలు శోకంతో అవిసిపోయాయి. వారి హృదయాలు భగ్న హృదయాలైపోయాయి. ముస్లింలపై దుఃఖ పర్వతం విరుచుకుపడింది. దుష్టశక్తులు చెలరేగిపోయాయి. సజ్జనుల ఆత్మ విశ్వాసం సన్నిగిల్లిపోయింది. అప్పటి వరకూ అణగిమణగి ఉండేవారు ఉపద్రవాన్ని వ్యాపింపజేయ టంలో కృతకృత్యులైపోయారు. సంస్కరణా సరణిని అవలంబించదలచిన వారు అశక్తులై పోయారు. అందువల్ల వారంతా ఖిలాఫత్‌కు అందరికన్నా ఎక్కువ అర్హులైన హజ్రత్ అలీ బిన్ అబీతాలిబ్ (رضي الله عنه) చేతులపై ప్రతిజ్ఞ (బైఅత్) చేశారు. కాని అప్పటికే ఉపద్రవాగ్ని రాజుకుని ఉండటం వల్ల, ప్రజల హృదయాలు భగ్నమై ఉండటం వల్ల సమాజంలో సమైక్యత, సంగరితత్వం సాధ్యం కాలేకపోయింది. ముస్లింలలో సామూహికత వ్రేళ్లూను కోలేక పోయింది. ఆనాటి ఖలీఫాగానీ, సమాజంలో మానవ నవనీతంగా పరిగణించబడే మంచివారుగాని ఎంతగా అభిలషించినప్పటికీ అనుకున్న మంచిని సాధించలేకపోయారు. విచ్ఛిన్నకరమైన ఆ వాతావరణంలో మరికొందరు స్వార్థపరులు కూడా జొరబడ్డారు. ఆ తరువాత జరగవలసినదంతా జరిగిపోయింది." (మజ్మూఅ అల్ ఫతావా : 25/304, 305)

ఇకపోతే హజ్రత్ అలీ, ముఆవియా (رضي الله عنهما)ల యుద్ధంలో పాల్గొన్న ప్రవక్త ప్రియ సహచరుల సంజాయిషీ (కారణం)ని వివరిస్తూ షేఖుల్ ఇస్లాం ఇలా అభిప్రాయపడ్డారు:

ముఆవియా (رضي الله عنه) అలీ (రజి)తో యుద్ధానికి సంసిద్ధమైనపుడు ఖిలాఫత్ తనకే చెందాలని ఆయన కోరలేదు. ఆయనకు ఖిలాఫత్ కట్టబెట్టే విషయమై బైఅత్ (ప్రతిజ్ఞ) కూడా చేయించలేదు. తానొక ఖలీఫా అనే భావనతో ఆయన యుద్ధానికి రాలేదు. ఈ విషయం గురించి ముఆవియా (رضي الله عنه)ను ఎవరు ప్రశ్నించినా వారి ముందు ఆయన ఇదంతా చెప్పేవారు. ఆయన అనుయాయులు కూడా అంతే. వారు అలీ (رضي الله عنه)తోనూ, అలీ సహచరులతోనూ యుద్ధానికి ముందంజ వేయలేదు. అదే సమయంలో హజ్రత్ అలీ (رضي الله عنه), మరియు ఆయన సహచరుల ఆలోచనలు మరోవిధంగా ఉన్నాయి – తానొక ఖలీఫా కావటం చేత ముఆవియ మరియు ముఆవియా సహచరులు వచ్చి తన చేతుల మీద ప్రమాణ స్వీకారం చేయాలన్నది అలీ (رضي الله عنه) అభిలాష. ఎందుకంటే ముస్లింలకు ఖలీఫాగా ఒకే వ్యక్తి ఉండాలి. కాని వారు తనకు విధేయత చూపటం లేదు. తన చేతిపై 'ప్రమాణం' చేయటం లేదు సరికదా, తమను స్వతంత్రులుగా ఊహించుకుంటున్నారు. తమ వద్ద శక్తి ఉంది. అధికార బలం ఉంది. అయినప్పటికీ వారు మాట వినటం లేదు. కాబట్టి వారితో యుద్ధం చేసి, వారిని దారికి రప్పించాలి. తద్వారా వారు

ఖలీఫాకు విధేయులవుతారు. ఆ విధంగా ముస్లింల సామూహిక వ్యవస్థ పటిష్టంగా ఉండగలుగుతుంది – ఇదీ హజ్రత్ అలీ (رضي الله عنه) మరియు ఆయన సహచరుల ఆలోచన.

కాగా; హజ్రత్ ముఆవియా (رضي الله عنه) మరియు ఆయన సహచరుల ఆలోచనా తీరు తద్భిన్నంగా ఉంది : తాము అలీ (رضي الله عنه) చేతులపై 'ప్రమాణం' చేయాల్సిన అవసరం లేదు. ఈ కారణంగా ఒకవేళ తమతో యుద్ధం చేయబడినా తాము బాధిత ప్రజల కోవకే చెందుతాము. ఎందుకంటే తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه) దారుణంగా హత్య చేయబడ్డారు. ఉస్మాన్ (رضي الله عنه)ను హత్య చేయటంలో కీలకపాత్ర పోషించినవారు ప్రస్తుతం హజ్రత్ అలీ (رضي الله عنه) సైన్యంలో ఉన్నారు. సైనిక విభాగంలో వారి ప్రాబల్యం కూడా ఎక్కువగానే ఉంది. మనం గనక ఈ సమయంలో నిర్లిప్తంగా ఉండిపోతే వారు మరింతగా విజృంభించి మనపై జులుంకు ఒడిగట్టవచ్చు. అదే గనక జరిగితే ఖలీఫా హజ్రత్ అలీ (رضي الله عنه) వారిని నిలువరించలేరు. హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه)ను ముట్టడించినపుడు అలీ (رضي الله عنه) ఎలా నిస్సహాయులుగా ఉండిపోయారో అలాగే ఉండిపోవచ్చు. కాబట్టి మనకు న్యాయం చేసే ప్రతిభావంతుడైన ఖలీఫా చేతుల మీద మాత్రమే మనం బైఅత్ (ప్రతిజ్ఞ) చేయాలి."

**సహాబా (رضي الله عنهم)మధ్య పొడసూపిన విభేదాలు, అంతఃకలహాల ఫలితంగా జరిగిన యుద్ధాలు – ఈ విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వైఖరి రెండు విషయాలపై ఆధారపడి ఉంది.**

**ఒకటి :** ప్రవక్త (صلى الله عليه وسلم)ప్రియసహచరుల(رضي الله عنهم) మధ్య తలెత్తిన వివాదాలపై, అవాంఛనీయ ఘటనలపై అహ్లెసున్నత్ వల్ జమాఅత్‌కి చెందిన వారు నోరెత్తకుండా మౌనం వహించటమే శ్రేయస్కరమని భావిస్తారు. ఈ రగడపై వారు తర్జనభర్జన చేయటంగానీ, తమవైన అభిప్రాయాలు వ్యక్తపరచటం గానీ చేయరు. పైగా వారిలా వేడుకుంటూ ఉంటారు:

﴿رَبَّنَا اغْفِرْ لَنَا وَلِإِخْوَانِنَا الَّذِينَ سَبَقُونَا بِالْإِيمَانِ وَلَا تَجْعَلْ فِي قُلُوبِنَا غِلًّا لِّلَّذِينَ آمَنُوا رَبَّنَا إِنَّكَ رَءُوفٌ رَّحِيمٌ﴾ (الحشر:١٠)

**"మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి ద్వేషభావాన్నీ కలిగించకు. మా ప్రభూ! నిశ్చయంగా నీవు మృదుస్వభావుడవు. కనికరించేవాడవు." (అల్ హష్ర్ : 10)**

**రెండు :** సహాబా (ప్రవక్త సహచరులు – رضي الله عنهم) గురించి ప్రాచుర్యంలో ఉన్న కథనాలకు సమాధానాలివ్వటం. దీనికి సంబంధించిన కొన్ని పద్ధతులు ఇవి :



## మొదటి పద్ధతి :

అలాంటి కథనాల (ఆసార్)లో కొన్ని పచ్చి అబద్ధాలు. ప్రవక్త సహచరులకు అపఖ్యాతి అంటగట్టడానికి ఇస్లాం విరోధులచే సృష్టించబడిన కట్టుకథలవి.

## రెండవ పద్ధతి :

సహాబాకు సంబంధించిన మరికొన్ని కథనాలున్నాయి. వాటిలో హెచ్చుతగ్గులు, మార్పులు చేర్పులు చేయబడ్డాయి. ఆ విధంగా వాటి రూపురేఖలనే మార్చివేయటం జరిగింది. అందులో అబద్ధం పాళ్ళు అధికం. కాబట్టి అలాంటి వాటిని కూడా పట్టించుకోకుండా ఉండటమే శ్రేయస్కరం.

## మూడవ పద్ధతి :

ఆ కథనాలలో ప్రామాణికం అనదగినవి, అలాంటివి చాలా తక్కువే. ఈ విషయంలో మటుకు ప్రవక్త సహచరులు అశక్తులు, క్షంతవ్యులు. ఎందుకంటే వారు ఆ విషయాలలో తమ 'ఇజ్తెహాద్' ప్రకారం పనిచేశారు. అందులో వారు సత్యం వరకూ చేరుకున్నారు లేదా వారివల్ల పొరపాటు కూడా జరిగి ఉండవచ్చు. ఎందుకంటే వారు 'ముజ్తహిద్‌లు' (సమకాలీన సవాళ్ళను షరీఅత్ బద్ధంగా అన్వయించటానికి శాయశక్తులా కృషిచేసిన విజ్ఞులు). ఈ అన్వయింపు ప్రయత్నంలో వారు సరైన ఆజ్ఞ వరకూ చేరగలిగితే వారికి రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది. ఒకవేళ వారు సరైన నిర్ణయానికి చేరుకోలేకపోయినప్పటికీ – వారివల్ల పొరపాటు జరిగినప్పటికీ – చిత్తశుద్ధితో కూడిన వారి కృషికి గాను ఒకింత పుణ్యఫలం లభిస్తుంది. మరోవైపు వారి తప్పు కూడా మన్నించబడుతుంది. ఎందుకంటే హదీసులో ఇలా అనబడింది :

"إِذَا اجْتَهَدَ الْحَاكِمُ فَأَصَابَ فَلَهُ أَجْرَانِ وَإِنْ اجْتَهَدَ فَأَخْطَأَ فَلَهُ أَجْرٌ وَاحِدٌ" (بخاری ومسلم)

**"న్యాయ నిర్ణయం గైకొనే వ్యక్తి 'ఇజ్తెహాద్' చేసినపుడు అతను సరైన నిర్ణయానికి చేరుకోగలిగితే అతనికి రెండింతల ప్రతిఫలం ప్రాప్తమవుతుంది. ఒకవేళ అతని వల్ల పొరపాటు జరిగినట్లయితే అతనికి ఒకింత ప్రతిఫలం లభిస్తుంది." (బుఖారీ, ముస్లిం)**

## నాల్గవ పద్ధతి :

ప్రవక్త సహచరులు (సహాబా– رضي الله عنهم) కూడా మానవమాత్రులే. వారివల్ల కూడా తప్పులు జరగటం సహజం. వ్యక్తిగతంగా చూస్తే వారు దోషరహితులు కారు. అయితే వారివల్ల జరిగే పొరపాట్లను పరిహరించే మరెన్నో పనులు, అంశాలున్నాయి. అవి వారి పాపాలకు పరిహారంగా ఉపయోగపడతాయి. అలాంటి వాటిలో కొన్ని ఇవి –

1. బహుశా వారు పశ్చాత్తాపపడ్డారేమో! తప్పులు ఎన్ని జరిగి ఉన్నాసరే, పశ్చాత్తాపం (తౌబా) వాటిని రూపుమాపుతుంది.

2. ఒకవేళ వారివల్ల అలాంటిదేదైనా జరిగి ఉన్నా, మరెన్నో విషయాలలో వారు ముందంజవేసి ఉన్నారు. వారివల్ల జరిగిన తప్పుల మన్నింపునకు అవి సాధనం కావచ్చు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّ الْحَسَنَاتِ يُذْهِبْنَ السَّيِّئَاتِ﴾ (هود:١١٤)

**“నిశ్చయంగా పుణ్యకార్యాలు పాపకార్యాలను దూరం చేస్తాయి.”**
**(హూద్ : 114)**

3. వారి పుణ్యకార్యాలు వేరితరుల కంటే ఎన్నో రెట్లు పెంచబడవచ్చు. గొప్పతనం విషయంలో ఇతర వ్యక్తులు వారితో సరితూగలేరు. వారు మంచి కాలానికి చెందినవారని ప్రవక్త (ﷺ) వారి ప్రవచనం ద్వారానే రూఢీ అయింది. వారిలో ఎవరయినా ఒక ‘ముద్ద్’కు సమానంగా దానం చేస్తే అది ఇతరులు ఉహుద్ పర్వతానికి సమానంగా దానం చేసిన బంగారం కన్నా గొప్పది. అల్లాహ్ వారితో ప్రసన్నుడవుగాక! వారిని సంతోషంగా ఉంచుగాక!

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (రహ్మ) ఇలా అంటున్నారు : “మొత్తం అహ్లె సున్నత్ వల్ జమాఅత్, ధర్మవేత్తల నమ్మకం (అఖీదా) ఏమిటంటే సహాబాలలో ఏ ఒక్కరూ దోష రహితులు, పవిత్రులు కారు. అలాగే ప్రవక్త బంధువులుగానీ, సహాబాలలో తొలికాలానికి చెందినవారు గానీ, ఇతరులు గానీ – వారెవరయినా వారివల్ల తప్పు జరగటం సహజం, సంభవం కూడా. అయితే అల్లాహ్ పశ్చాత్తాపం (తౌబా) ద్వారా వారి పాపాలను క్షమిస్తాడు. వారి అంతస్తులను ఉన్నతం చేస్తాడు. అలాగే పాపాలను రూపుమాపే సత్కార్యాల ద్వారా లేదా ఇతరత్రా కారణాల దృష్ట్యా వారిని క్షమిస్తాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَالَّذِي جَاءَ بِالصِّدْقِ وَصَدَّقَ بِهِ أُولَٰئِكَ هُمُ الْمُتَّقُونَ ☆ لَهُم مَّا يَشَاءُونَ عِندَ رَبِّهِمْ ذَٰلِكَ جَزَاءُ الْمُحْسِنِينَ ☆ لِيُكَفِّرَ اللَّهُ عَنْهُمْ أَسْوَأَ الَّذِي عَمِلُوا وَيَجْزِيَهُمْ أَجْرَهُم بِأَحْسَنِ الَّذِي كَانُوا يَعْمَلُونَ﴾ (الزمر:٣٣،٣٥)

**ఎవరయితే సత్యధర్మాన్ని తీసుకువచ్చారో, మరెవరయితే దానిని సత్యమని ధ్రువీకరించారో అటువంటివారే భయభక్తులు గలవారు.**



**వారికోసం వారి ప్రభువు దగ్గర వారు కోరినదల్లా ఉంది. సదాచార సంపన్నులకు లభించే ప్రతిఫలం ఇదే. అల్లాహ్ వారి దురాచరణలను వారి నుండి దూరం చేయటానికి, వారు చేసిన సదాచరణలకు గాను ఉత్తమ పుణ్యఫలం ఇవ్వటానికి (ఈ వ్యవస్థను నెలకొల్పుతాడు). (అజ్ జుమర్ : 33 – 35)**

ఇంకా ఈ విధంగా సెలవీయబడింది :

﴿حَتَّىٰ إِذَا بَلَغَ أَشُدَّهُ وَبَلَغَ أَرْبَعِينَ سَنَةً قَالَ رَبِّ أَوْزِعْنِي أَنْ أَشْكُرَ نِعْمَتَكَ الَّتِي أَنْعَمْتَ عَلَيَّ وَعَلَىٰ وَالِدَيَّ وَأَنْ أَعْمَلَ صَالِحًا تَرْضَاهُ وَأَصْلِحْ لِي فِي ذُرِّيَّتِي إِنِّي تُبْتُ إِلَيْكَ وَإِنِّي مِنَ الْمُسْلِمِينَ ☆ أُولَٰئِكَ الَّذِينَ نَتَقَبَّلُ عَنْهُمْ أَحْسَنَ مَا عَمِلُوا وَنَتَجَاوَزُ عَن سَيِّئَاتِهِمْ فِي أَصْحَابِ الْجَنَّةِ﴾ (الاحقاف:١٥،١٦)

**తుదకు అతను పూర్తి పరిపక్వతకు, అంటే నలభై ఏళ్ళ ప్రాయానికి చేరుకున్నప్పుడు ఇలా విన్నవించుకున్నాడు : “నా ప్రభూ! నీవు నా తల్లిదండ్రులపై కురిపించిన అనుగ్రహ భాగ్యాలకు గాను కృతజ్ఞతలు తెలుపుకునే, నీ ప్రసన్నతను చూరగొనే విధంగా సత్కార్యాలు చేసే సద్బుద్ధిని నాకు ప్రసాదించు. ఇంకా నా సంతానాన్ని కూడా సజ్జనులుగా తీర్చిదిద్దు. నేను నీ వైపునకే మరలుతున్నాను. నేను నీ విధేయులలో ఒకణ్ణి.” ఇలాంటి వారి సత్కార్యాలనే మేము స్వీకరిస్తాము. వారి తప్పులను క్షమిస్తాము. వారికి చేయబడిన సత్య వాగ్దానం ప్రకారం వారు స్వర్గవాసులలో ఉంటారు. (అల్ అహ్ఖాఫ్ : 15,16)**

(మజ్మూఅ ఫతావా : 35/69)

ప్రవక్త సహచరుల మధ్య తలెత్తిన విభేదాలను, పోరాటాలను ఇస్లాం శత్రువులు తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటూ సహాబా వ్యక్తిత్వాలపై బురదజల్లేందుకు ప్రయత్నించారు. వారి గౌరవ మర్యాదలను మంట గలిపేందుకు అవకాశంగా తీసుకున్నారు. అదే రకమయిన నీచ స్వభావంతో ఈనాటి కొందరు రచయితలు, సోకాల్డ్ మేధావులు కూడా తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. వీరు అనాలోచితంగా సహాబాపై విమర్శలు గుప్పిస్తుంటారు. ఆ విధంగా వారు తమను తాము సహాబా వైఖరిపై తీర్పు చెప్పే న్యాయమూర్తులుగా ఊహించుకుంటున్నారు. తగు ఆధారాలు, నిదర్శనాలు లేకుండానే – కేవలం తమ మనోవాంఛలకు లోబడి – స్వార్థపరుల, కపట విమర్శకుల వ్యాఖ్య

లను ఉదాహరిస్తూ కొంతమంది సహాబీలను సత్యవాదులుగా, మరికొంతమంది సహాబీలను దోషులుగా నిర్ధారిస్తున్నారు. అంతేకాదు, ఇస్లామీయ సంస్కృతీ నాగరికతల పట్ల తగు అవగాహన లేని కొంతమంది ముస్లిం యువకులలో – ఇస్లాం యొక్క గొప్ప చరిత్రపట్ల, తొలికాలపు మహనీయుల పట్ల లేనిపోని దురనుమానాలను నూరిపోస్తున్నారు. ఆ విధంగా వారిలో ఇస్లాం పట్ల ఏవగింపును కలిగించి, ముస్లిం సముదాయంలో చీలికను తీసుకురావాలని, తొలికాలపు సజ్జనుల పట్ల చివరి కాలపు ప్రజలలో ద్వేషాన్ని, వైషమ్యాన్ని రగుల్గొల్పాలని చూస్తున్నారు. దీనికి బదులు వారు తొలికాలపు సత్పురుషుల అడుగుజాడలలో నడచి, వారి కొరకు దుఆ చేసినట్లయితే ఎంత బాగుండేది! అలాంటి సద్భావన కలిగి ఉండే వారిని దేవుడు సయితం శ్లాఘిస్తాడు. ఉదాహరణకు –

﴿وَالَّذِينَ جَاؤُوا مِن بَعْدِهِمْ يَقُولُونَ رَبَّنَا اغْفِرْ لَنَا وَلِإِخْوَانِنَا الَّذِينَ سَبَقُونَا بِالْإِيمَانِ وَلَا تَجْعَلْ فِي قُلُوبِنَا غِلًّا لِّلَّذِينَ آمَنُوا رَبَّنَا إِنَّكَ رَؤُوفٌ رَّحِيمٌ﴾ (الحشر:١٠)

**వారి తరువాత వచ్చిన వారు (తమ పూర్వీకులను గురించి) ఇలా వేడుకుంటారు : "మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి ద్వేషభావాన్నీ కలిగించకు. మా ప్రభూ! నిశ్చయంగా నీవు మృదుస్వభావం కలిగినవాడవు. కనికరించేవాడవు." (అల్ హష్ర్ : 10)**



**ఆరవ ప్రకరణం**

# మహాప్రవక్త (ﷺ) సహచరుల(رضي الله عنهم)ను, మార్గదర్శక నాయకులను తూలనాడరాదు

**(1) సహాబాలను తూలనాడటం పట్ల వారింపు :**

అహ్లె సున్నత్ వల్ జమాఅత్ సంవిధానంలో ఉన్న నిబంధనలలో ఒకటేమిటంటే మహాప్రవక్త ప్రియ సహచరుల (رضي الله عنهم) విషయంలో వారి ఆంతర్యాలు నిర్మలంగా ఉండాలి. వారి గురించి నోరు జారకూడదు. అల్లాహ్ తన గ్రంథంలో తెలియజేసినట్లుగా ఉండాలి వారి వైఖరి.

﴿وَالَّذِينَ جَاؤُوا مِن بَعْدِهِمْ يَقُولُونَ رَبَّنَا اغْفِرْ لَنَا وَلِإِخْوَانِنَا الَّذِينَ سَبَقُونَا بِالْإِيمَانِ وَلَا تَجْعَلْ فِي قُلُوبِنَا غِلًّا لِّلَّذِينَ آمَنُوا رَبَّنَا إِنَّكَ رَؤُوفٌ رَّحِيمٌ﴾ (الحشر:١٠)

**వారి తరువాత వచ్చిన వారు (వారి గురించి) ఇలా వేడుకుంటారు: "మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి ద్వేషభావాన్నీ కలిగించకు. మా ప్రభూ! నిశ్చయంగా నీవు మృదు స్వభావం కలవాడవు. కనికరించేవాడవు." (అల్ హష్ర్ : 10)**

ఇంకా వారు – దైవప్రవక్త (ﷺ) చేసిన ఈ హితవును ఖచ్చితంగా పాటిస్తారు–

"لَا تَسُبُّوا أَصْحَابِي فَوَالَّذِي نَفْسِي بِيَدِهِ لَوْ أَنْفَقَ أَحَدُكُمْ مِثْلَ أُحُدٍ ذَهَبًا مَا بَلَغَ مُدَّ أَحَدِهِمْ وَلَا نَصِيفَهُ" (بخاری و مسلم)

**"నా సహచరులను దూషించకండి. ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆ శక్తిమంతుని సాక్షిగా! మీలో ఏ వ్యక్తి అయినా ఉహుద్ పర్వతానికి సమానంగా బంగారం ఖర్చుచేసినా, వారిలో (అంటే నా ప్రత్యక్ష సహచరులలో)ని వారు దానం చేసిన ఒక 'ముద్ద్'కు, ఆఖరికి 'ముద్ద్'లో సగభాగానికి కూడా సమానం కాజాలదు." (బుఖారీ, ముస్లిం)**

అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వారు సహాబాలను దూషించే రాఫ్జీల (షియావారి)తో, ఖవారిజ్ వర్గీయులతో తెగత్రెంపులు చేసుకుంటారు. వారితో ఎలాంటి స్నేహం,

సుహృద్భావం కలిగి ఉండరు. తరచూ సహాబాలను కాఫిర్‌లు (అవిశ్వాసులు) గా ఖరారు చేసే వీరి ధోరణిని ఖండిస్తారు. వీరిలోని ఏ మంచితనాన్నీ అంగీకరించరు.

ప్రవక్త సహచరుల ఔన్నత్యం గురించి ఖుర్‌ఆన్ హదీసులలో చెప్పబడిన దానిని అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వారు శిరసావహిస్తారు. సహాబా ముస్లిం ఉమ్మత్‌లో కెల్లా అత్యుత్తములని విశ్వసిస్తారు. ఉదాహరణకు మహాప్రవక్త (ﷺ) చెప్పినట్లుగా –

"خَيرُكُم قَرنِي...."(بخاری ومسلم)

**"మీ అందరిలోకెల్లా ఉత్తములు నా కాలానికి చెందినవారు." (బుఖారీ, ముస్లిం)**

తన ఉమ్మత్ (అనుచర సమాజం) 73 వర్గాలుగా చీలిపోతుందని, వారిలో ఒకే ఒక వర్గం తప్ప మిగిలిన వారంతా నరకానికి పోతారని దైవప్రవక్త (ﷺ) చెప్పినపుడు, ఆ ఒక్క వర్గం ఏదంటూ ప్రియ సహచరులు (رضي الله عنهم) అడిగారు. సమాధానంగా దైవప్రవక్త (ﷺ) ఇలా అన్నారు :

"هُمُ مَنْ كَانَ عَلىٰ مِثْلِ مَا أَنَا عَلَيْهِ الْيَوْمَ وَأَصْحَابِي"(ترمذی:۲٦٤١حسن)

**"ఈ రోజు నేను, నా సహచరులు ఏ పద్ధతిపై ఉన్నామో ఆ పద్ధతిపై స్థిరంగా ఉండేవారు." (ముస్నదె అహ్మద్, తిర్మిజి 2641 హసన్)**

ఇమామ్ ముస్లిం గురువుల్లో ప్రముఖులైన ఇమామ్ అబూజుర్‌అ ఇలా అంటున్నారు: "ఏ వ్యక్తి అయినా మహాప్రవక్త ప్రియసహచరులలో ఎవరినయినా తూలనాడుతున్నట్లు మీరు గమనిస్తే అతణ్ణి ధర్మవిహీనునిగా పరిగణించండి. ఎందుకంటే ఖుర్‌ఆన్ సత్యం. దైవప్రవక్త (ﷺ) సత్యం. ఆయన (ﷺ) తెచ్చిన షరీయత్ సత్యబద్ధం. కాగా; వీటన్నింటినీ మన వరకూ చేర్చినవారు సహాబీలే (ప్రియ సహచరులే). కాబట్టి వారిని తూలనాడినవాడు ఖుర్‌ఆన్ హదీసులనే అసత్యంగా ఖరారు చేయదలుస్తున్నాడని అనుకోవాలి. కనుక అలాంటి వ్యక్తి స్వయంగా నిందార్హుడు. అతనిపై ధర్మవిహీనుడు, మార్గవిహీనుడన్న అభియోగం మోపటం చాలా వరకు సమంజసం, సత్యం."

అల్లామా ఇబ్నె హమదాన్ తన గ్రంథం 'నిహాయతున్ ముబ్తదీన్'లో ఇలా అంటున్నారు : "ఎవరయితే ప్రవక్త సహచరులను దూషించటం ధర్మసమ్మతం అని భావిస్తూ మరీ దూషిస్తున్నాడో అతను ఖచ్చితంగా కాఫిర్ (అవిశ్వాసి). మరెవరయితే ధర్మసమ్మతం కాదని భావిస్తూ కూడా దూషిస్తాడో అతడు పాపాత్ముడు (ఫాసిఖ్)." ఆయన గారి మరో పలుకు ఇలా ఉంది : "ఎవరయితే ప్రవక్త ప్రియ సహచరులను దూషిస్తాడో, అతను నిశ్చయంగా కాఫిరే (దాన్ని అతను ధర్మసమ్మతమని భావించినా, భావించక పోయినా). అదేవిధంగా – ఎవరయితే ప్రవక్త సహచరుల (رضي الله عنهم)ను అవిధేయులుగా ఖరారు చేస్తాడో లేదా వారి ధర్మావలంబనలో లోపం ఎత్తిచూపిస్తాడో లేదా వారిని కాఫిర్లుగా



ఖరారు చేస్తాడో, అతను ముమ్మాటికీ కాఫిర్ (అవిశ్వాసి). (షరహ్ అఖీదతుస్సిఫారీని – 2/388, 389)

**(2) ముస్లిం సమాజంలోని మార్గదర్శకులను దూషించటం పట్ల వారింపు :**

మహిమోన్నతల దృష్ట్యాగానీ, స్థాయి రీత్యాగానీ సహాబా తర్వాత స్థానం, ఉమ్మత్‌కు చెందిన మార్గదర్శక నాయకులది. వారే తాబయీన్, తబయె తాబయీన్, ఆ తర్వాత తరానికి చెందిన ఉలమా. వారంతా సహాబాను శాయశక్తులా అనుసరించారు. అల్లాహ్ సెలవిచ్చినట్లుగా

﴿وَالسَّابِقُونَ الْأَوَّلُونَ مِنَ الْمُهَاجِرِينَ وَالْأَنصَارِ وَالَّذِينَ اتَّبَعُوهُم بِإِحْسَانٍ رَّضِيَ اللَّهُ عَنْهُ﴾ (التوبة:١٠٠)

**ముహాజిర్లలో, అన్సార్లలో ప్రప్రథమంగా ముందంజవేసిన వారితోనూ, తరువాత చిత్తశుద్ధితో వారిని అనుసరించిన వారితోనూ అల్లాహ్ ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల సంతుష్టులయ్యారు.**

**(అత్ తౌబా : 100)**

కనుక వారిని దూషించటం, వారిలోని లోపాలను ఎత్తి చూపటం, వారిపై విమర్శనాస్త్రాలు సంధించటం ఎంతమాత్రం సమ్మతం కాదు. ఎందుకంటే వారంతా మార్గదర్శకులు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَن يُشَاقِقِ الرَّسُولَ مِن بَعْدِ مَا تَبَيَّنَ لَهُ الْهُدَىٰ وَيَتَّبِعْ غَيْرَ سَبِيلِ الْمُؤْمِنِينَ نُوَلِّهِ مَا تَوَلَّىٰ وَنُصْلِهِ جَهَنَّمَ وَسَاءَتْ مَصِيرًا﴾ (النساء:١١٥)

**ఎవరయినా సన్మార్గం ప్రస్ఫుటం అయిన మీదట కూడా ప్రవక్త (స)కు వ్యతిరేకంగా పోతే, విశ్వాసులందరి మార్గాన్ని వీడి, ఇతర మార్గాన్ని అనుసరిస్తే, మేమతన్ని అతను మరలదలచుకున్న వైపునకే మరల్చుతాము. కడకు అతన్ని నరకంలో పడవేస్తాము. అది అత్యంత చెడ్డ గమ్యస్థానం. (అన్ నిసా : 115)**

'కితాబుత్తహావియ' వ్యాఖ్యాత (ఇమామ్ ఇబ్నె అబీ అజల్ హనఫీ) ఇలా అన్నారు: "అల్లాహ్‌తో, ఆయన ప్రవక్త (ﷺ)తో స్నేహపూర్వక సంబంధాల తర్వాత తోటి విశ్వాసులతో కూడా స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవటం ప్రతి ముస్లింకూ తప్పనిసరి. ఈ విషయంలో ఖుర్‌ఆన్ సర్వ సాధారణమయిన ఆజ్ఞ ఉండనే ఉంది. అయితే మరీ ముఖ్యంగా ప్రవక్తల వారసులతో మనకు స్నేహబంధం ఉండాలి. అల్లాహ్ వారిని

ధ్రువతారల మాదిరిగా చేశాడు. నేలలోని, సముద్రాలలోని చీకట్లలో వాటి ద్వారా మార్గం కనుగొనబడుతుంది. వారి మార్గదర్శకత్వంపై, వారి ధర్మావగాహనపై ముస్లింలందరికీ గురి ఉంది."

ఎందుకంటే వీరు దైవప్రవక్త (ﷺ) అనుచర సమాజంలో ఆయన (ﷺ) శిష్యుల, వారు వదలివెళ్ళిన మృత సంప్రదాయాలను పునరుజ్జీవింప జేసేవారు. వారి మూలంగానే దైవగ్రంథం నెలకొని ఉంది. దాని ఊపిరి మూలంగా వారు కూడా నిలబడి ఉన్నారు. వారి గురించి దైవగ్రంథంలో స్పష్టమయిన వివరణ వచ్చింది. వారు కూడా దానికి ప్రతినిధుల వంటివారు. దైవప్రవక్త (ﷺ)ను అనుసరించటం అనివార్యం (వాజిబ్) అన్న విషయంలో వారందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది. కాని ఒకవేళ వారిలో ఎవరి ఉవాచ అయినా ప్రామాణిక హదీసుకు వ్యతిరేకంగా మన ముందుకువస్తే, ఆ హదీసును పరిత్యజించటంలో ఆయన వద్ద తప్పకుండా ఏదో కారణం ఉండి ఉంటుంది అని మనం భావించాలి.

**సాధారణంగా ఆ కారణం మూడు విధాలుగా ఉంటుంది.**

1. ప్రవక్త (ﷺ) ప్రవచనం అయి ఉండవచ్చన్న విషయంపై అతనికి నమ్మకం కుదరక పోవచ్చు.
2. ఆయన (ﷺ) ఆ ప్రవచనం ద్వారా చెప్పదలచిన విషయంపై ఇదమిత్థంగా ఒక నిర్ధారణకు రాకపోయి ఉండవచ్చు.
3. అది రద్దు అయిపోయిన ఆజ్ఞ కావచ్చు అన్నది అతని నమ్మకం అయి ఉండవచ్చు.

మొత్తానికి మనందరి మీద వారికి ఆధిక్యత ఉంది. మనకు వారు ఉపకారం చేసినవారు. వారు మనకన్నా ముందే విశ్వసించినవారు. దైవప్రవక్త (ﷺ) అందజేసిన ధర్మాన్ని వారు మన వరకూ చేర్చారు. మనకు అర్థం కాకుండా నిగూఢంగా ఉండిపోయే ఎన్నో విషయాలను వారు మనకు విడమరచి చెప్పారు. అల్లాహ్ వారితో ప్రసన్నుడవుగాక! వారిని సంతుష్టపరచుగాక!

﴿ رَبَّنَا اغْفِرْ لَنَا وَلِإِخْوَانِنَا الَّذِينَ سَبَقُونَا بِالْإِيمَانِ وَلَا تَجْعَلْ فِي قُلُوبِنَا غِلًّا لِّلَّذِينَ آمَنُوا رَبَّنَا إِنَّكَ رَءُوفٌ رَّحِيمٌ ﴾ (الحشر:١٠)

**"మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి కల్మషాన్నీ ఉంచకు. నిశ్చయంగా నీవు మృదు స్వభావం కలవాడవు. కనికరించేవాడవు." (అల్ హష్ర్ : 10)**



కొంతమంది విద్వాంసుల (ఉలమా)చే ధర్మసూత్రాల అన్వయింపు (ఇజ్తెహాదీ) ప్రక్రియలో దొర్లిన తప్పుల మూలంగా వారి స్థాయిని దిగజార్చే ప్రయత్నం చేయటం బిద్అతీల విధానం. ఇలాంటి వాటి కోసం ఇస్లాం విరోధులు కాచుకుని ఉంటారు. తద్వారా ఇస్లాం గురించి లేనిపోని సందేహాలు సృష్టించటానికి, ముస్లిముల మధ్య వైరభావం పుట్టించటానికి శాయశక్తులా యత్నిస్తారు. భావి తరాలవారు తమ పూర్వీకుల (సలఫ్) పట్ల విముఖతను, విసుగును వ్యక్తం చేసేలా కుట్ర పన్నుతారు. విద్వాంసులకు – నవ యువకులకు మధ్య విభేదాలను సృష్టిస్తారు. వారి మధ్య పూడుకోని అంతరాల అగాధాలను కల్పిస్తారు. నేడు సర్వత్రా జరిగేది కూడా ఇదే. కాబట్టి విద్యార్థి దశలో ఉన్న నవయువకులు ఈ స్వార్థపరుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే వారు ధర్మవేత్తల (ఫుకహా) యొక్క, ఇస్లామీయ ధర్మశాస్త్రం (ఫికహ్) యొక్క స్థాయిని దిగజారుస్తారు. దానిని చదవటం, చదివించటం పట్ల, దానిలో ఉన్న శ్రేయోదాయకమయిన విషయాలను, సత్యాన్ని సంగ్రహించటం పట్ల తమ అనాసక్తతను, విసుగును ప్రదర్శిస్తూ ఉంటారు. మొత్తానికి వారు తమ ఫికహ్ (ధర్మశాస్త్రం)ను గర్వకారణంగా భావించాలి. తమ విద్వాంసులను గౌరవించాలి. మార్గవిహీనుల, స్వార్థపరుల దుష్ప్రచార జాలంలో మాత్రం చిక్కుకోరాదు.

**ఆరవ అధ్యాయం**

# బిద్అతులు (నవీన పోకడలు)

ఈ అధ్యాయంలో క్రింద పేర్కొనబడిన ప్రకరణములు ఉన్నాయి –

**మొదటి ప్రకరణం** : బిద్అత్ నిర్వచనం – దాని రకాలు, ఆదేశాలు.

**రెండవ ప్రకరణం** : ముస్లింలలో బిద్అతులు పొడసూపిన వైనం – కారణాలు.

**మూడవ ప్రకరణం** :బిద్అతీల గురించి ఇస్లామీయ సమాజం వైఖరి – వాటిని ఖండించటంలో 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' విధానం.

**నాల్గవ ప్రకరణం** : వర్తమాన కాలంలోని బిద్అతుల కొన్ని మచ్చుతునకలు.

1. మీలాదున్నబీ ఉత్సవం
2. కొన్ని నిర్ణీత స్థలాల నుండి, చిహ్నాల నుండి, మృతుల నుండీ శుభం పొందటం.
3. ఆరాధనలు, దైవసామీప్యానికి సంబంధించిన బిద్అతులు.



**మొదటి ప్రకరణం**

## బిద్అత్ నిర్వచనం : దాని రకాలు, ఆదేశాలు

**(1) నిఘంటువు ప్రకారం బిద్అత్ అంటే :**

'బిద్అత్' అనేది 'బద్అ' అనే పదం నుండి సంగ్రహించబడినది. దీని అర్థం గతకాలపు ఉపమానం ఏదీ లేకుండానే ఏదేని ఒక వస్తువును అపూర్వంగా, ప్రప్రథమంగా ఆవిష్కరించటం. ఉదాహరణకు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿بَدِيعُ السَّمَاوَاتِ وَالْأَرْضِ﴾ (البقرة:١١٧)

**భూమ్యాకాశాలను మొట్టమొదట సృష్టించినవాడు ఆయనే (అల్లాహ్‌యే). (అల్ బఖర : 117)**

అంటే, పూర్వపు ఉపమానమేదీ లేకుండానే భూమ్యాకాశాలకు ఉనికిని ప్రసాదించినవాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿قُلْ مَا كُنتُ بِدْعاً مِّنَ الرُّسُلِ﴾ (الأحقاف:٩)

**(ఓ ప్రవక్తా!) వారితో అను : "నేను కొత్తగా వచ్చిన ప్రవక్తనేమీ కాను." (అల్ అహ్ఖాఫ్ : 9)**

అంటే; దేవుని తరఫున ప్రజలకు దైవ సందేశం అందజేసే మొట్టమొదటి వ్యక్తిని కాను. నాకు ముందు ఎందరో ప్రవక్తలు వచ్చారు.

'ఇబ్తెదఅ ఫులానున్ బిద్అతన్' అని అరబీలో అంటారు. అంటే అతను అంతకుముందు లేని ఒక కొత్త పద్ధతిని సృష్టించాడు అని అర్థం.

ఆరంభం లేక ఆవిష్కారం రెండు విధాలుగా ఉంటుంది :

1. అలవాట్లలో ఆవిష్కారం : ఉదాహరణకు – దైనందిన జీవితం కొరకు అవసరమయిన వాటిని కొత్తగా కనుగొనటం లేదా ఆవిష్కరించటం. ఇది ధర్మసమ్మతమే (హలాల్). ఎందుకంటే ఇది అలవాట్లకు సంబంధించినది.
2. ధర్మం (దీన్)లో కొంగ్రొత్త ఆవిష్కరణ : అంటే ధర్మంలో నూతన విధానాలను, పనులను సృష్టించటం. ఇది నిషిద్ధం (హరామ్). ఎందుకంటే ధర్మావలంబన విషయంలో ఖుర్ఆన్ హదీసుల ద్వారా రూఢీఅయిన విషయాల వరకే సరిపెట్టుకోవాలి. అందులో ఎలాంటి హెచ్చుతగ్గులు చేయకూడదు. హెచ్చుతగ్గులు చేయటం ధర్మసమ్మతం కాదు. ఆయన (ﷺ) ఇలా సెలవిచ్చారు :

"مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا هَذَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ" (بخاری ومسلم)

**"ఎవరయినా మా ఈ (షరీఅత్) విషయంలో లేని వస్తువును సృష్టిస్తే అది త్రోసిపుచ్చబడుతుంది (స్వీకారయోగ్యం కాజాలదు)." (బుఖారీ, ముస్లిం)**

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది :

"مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ"( صحيح مسلم )

**"ఎవడయినా మా షరీయతుకు అనుగుణంగా లేని ఆచరణ ఏదయినా చేస్తే అది త్రోసిపుచ్చదగినది." (సహీహ్ ముస్లిం)**

**2. ధర్మం (దీన్)లో బిద్అత్‌ల రకాలు : ధర్మంలో బిద్అత్‌లు రెండు రకాలు :**

**మొదటి రకం :** వాక్పరమైన, విశ్వాసపరమైన బిద్అత్ – అంటే ఈ బిద్అత్ సంబంధం వ్యక్తుల, వర్గాల మాటలతో, విశ్వాసాలతో ఉంటుంది. ఉదాహరణకు : జహ్మియ, మూతజిలా, రాఫ్జ తదితర మార్గవిహీన వర్గాల పలుకులు, వారి సిద్ధాంతాలు.

**రెండవ రకం :** ఆరాధనలలో బిద్అత్ – అంటే ఆరాధనలో కొత్త విషయాలు కల్పించటం. ఉదాహరణకు : ఏదైనా సమ్మతం కాని పద్ధతిలో దైవారాధన చేయటం. ఆరాధనలకు సంబంధించిన బిద్అతులు కూడా అనేక రకాలు.

**మొదటి రకం :** ఇబాదత్ (ఆరాధన) గా చెల్లుబాటు అవుతున్న బిద్అత్. ఉదాహరణకు : షరీయత్‌లో ఏ ప్రాతిపదిక కూడా లేని ఆరాధనను ఎవరయినా సృష్టించుకుని, దానిని సమాజంలో ప్రవేశపెట్టడం. అంటే లేని నమాజ్, లేని ఉపవాసం, లేని పండుగలను కల్పించుకోవటం. ఉదాహరణకు : మీలాదున్నబీ ఉత్సవం.

**రెండవ రకం :** చేయవలసి ఉన్న ఆరాధన (ఇబాదత్)కు అదనంగా ఏదన్నా చేర్చటం. ఉదాహరణకు : జుహ్ర్ లేక అస్ర్‌లో నాలుగు రకాతుల ఫర్జ్ నమాజు చేయవలసి ఉండగా ఐదవ రకఅత్‌ను అదనంగా చేర్చటం.

**మూడవ రకం :** ఆరాధనను చేయవలసిన రీతిలో చేయకుండా సంప్రదాయేతర పద్ధతిలో చేయటం. ఉదాహరణకు : వ్యక్తిగతంగా చేసుకోవలసిన దుఆలను, దైవధ్యానము (జిక్ర్)ను సామూహికంగా చేయటం, దాని కోసం ప్రత్యేక సదనాలను ఏర్పాటు చేసుకోవటం. ఆరాధనలు చేసేందుకు దైవప్రవక్త (ﷺ) అవలంబించిన సులభమయిన విధానాన్ని కాదని, కష్టతరమయిన పద్ధతులను పాటించటం.

**నాల్గవ రకం :** ధర్మసమ్మతమయిన ఏదేని ఆరాధనను ఫలానా తేదీ లేక ఫలానా సమయం కొరకు కేటాయించుకోవటం కూడా బిద్అతే. ఎందుకంటే ఆ ఆరాధనను షరీయత్ ఆ మేరకు నిర్ధారించి ఉండదు. ఉదాహరణకు : షాబాన్ నెల 15వ తేదీ పగలు ఉపవాసం ఉండాలనీ, రాత్రిపూట జాగారం చేయాలని నిశ్చయించుకోవటం. ఉపవాసం ఉండటం, రాత్రి జాగారం చేయటం సమ్మతమే. కాని వాటిని ఒకానొక రాత్రి కోసమో, పగలు కోసమో ప్రత్యేకించుకునేందుకు ఆధారం ఏదీ లేదు.

**3. ధర్మంలో బిద్అత్‌ల రకాలు, వాటి ఆదేశం**

ధర్మం (దీన్)లో ప్రతి బిద్అత్ నిషిద్ధమే, మార్గవిహీనతే. ఎందుకంటే దీని గురించి మహాప్రవక్త (ﷺ) ఇలా ప్రబోధించారు :



"وَإِيَّاكُمْ وَمُحْدَثَاتِ الْأُمُورِ، فَإِنَّ كُلَّ مُحْدَثَةٍ بِدْعَةٍ ضَلَالَةٌ"(ابوداود:۴۶۰۷، صحيح)

**"ధర్మంలో కొత్తగా ఆవిష్కరించబడిన విషయాలకు దూరంగా ఉండండి. ఎందుకంటే ప్రతి కొత్త పోకడ ఒక బిద్అత్. ప్రతి బిద్అత్ మార్గవిహీనతకు నిదర్శనం." (అబూదావూద్-4607 సహీహ్ అహ్మద్, తిర్మిజి-2676 సహీహ్)**

ఇంకా ఆయన (ﷺ) ఇలా వక్కాణించారు :

"مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا هَذَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ"(بخاري ومسلم)

**"ఎవరయినా మా ఈ విషయం (ధర్మం)లో లేని విషయాన్ని గనక ఆవిష్కరిస్తే, అది త్రోసిపుచ్చబడుతుంది." (బుఖారీ, ముస్లిం)**

వేరొక ఉల్లేఖనంలోని పదాలు ఇవి :

"مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ"( صحيح مسلم )

**"ఎవరయినా మేము ఆజ్ఞాపించని దానిని ఆచరణలో పెడితే అది త్రోసిపుచ్చబడుతుంది." (ముస్లిం)**

ఈ రెండు హదీసుల ద్వారా రూఢీ అయ్యేదేమిటంటే ధర్మం (దీన్)లో ప్రతి నవీన పోకడ 'బిద్అత్'గా పరిగణించబడుతుంది. ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతకు దారి తీస్తుంది. అటువంటి ఆచరణ త్రిప్పి కొట్టబడుతుంది. దీన్నిబట్టి బోధపడిందేమిటంటే ఆరాధనల లోనూ, విశ్వాసాలలోనూ అన్ని రకాల బిద్అతులు నిషిద్ధం. కాని బిద్అత్ యొక్క రూపును, స్వభావాన్ని బట్టి నిషేధాజ్ఞ కూడా విభిన్నంగా ఉంటుంది.

కొన్ని రకాల బిద్అతులు కుఫ్ర్ (అవిశ్వాసం) గా కూడా పరిగణించబడతాయి. ఉదాహరణకు : సమాధులలో ఉన్నవారి సామీప్యం పొందటానికి సమాధుల చుట్టూ ప్రదక్షిణ చేయటం, జంతుబలి ఇవ్వటం, మొక్కుబడులు చెల్లించటం, మొక్కుకోవటం, విజ్ఞప్తులు చేసుకోవటం మొదలగువన్నీ చాలా తీవ్రమైన బిద్అత్‌ల కోవకు చెందుతాయి.

కొన్ని రకాల బిద్అతులు షిర్క్ (బహుదైవారాధన)కు సాధనంగా దోహదపడతాయి. ఉదాహరణకు : సమాధులపై కట్టడాలు నిర్మించటం, అక్కడ నమాజ్ చేయటం, దుఆ చేయటం.

కొన్ని బిద్అతులు భ్రష్టు పట్టిన విశ్వాసాలకు ప్రతీకగా ఉంటాయి. ఉదాహరణకు: షరీయత్ ఆధారాలకు విరుద్ధంగా ఉన్న ఖవారిజ్, ఖద్రియ, మర్జియ వర్గాల పలుకులు, సిద్ధాంతాలు.

కొన్ని రకాల బిద్అతులు పాపంగా, అవిధేయతగా భావించబడతాయి. ఉదాహ

రణకు : భవబంధాల పరిత్యాగం (సన్యాసులుగా, సాధువులుగా, బైరాగుల మాదిరిగా జీవించటం), ఎండలో నిలబడి ఉపవాస దీక్షబూనటం, లైంగిక వాంఛలను అంతమొందించే ఉద్దేశంతో శస్త్ర చికిత్స చేసుకోవటం ఇత్యాదివి. (అల్ ఏతెసాముల్ షాతిబీ–2/37)

**హెచ్చరిక :**

ఎవరయినా బిద్అతులను మంచి బిద్అత్ (బిద్అతె హసన), చెడు బిద్అత్ (బిద్అతె సయ్యిఅ) అని విభజించుకుంటే ఈ విభజన కూడా ముమ్మాటికీ తప్పే. ఇది «فَإِنَّ كُلَّ بِدْعَةٍ ضَلَالَةٌ» "నిశ్చయంగా ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతే" అన్న మహాప్రవక్త (ﷺ) వారి ప్రవచనానికి విరుద్ధం. ఎందుకంటే మహాప్రవక్త (ﷺ) బిద్అతు లన్నింటినీ మార్గభ్రష్టత్వం పరిధిలోకే తీసుకున్నారు. అలాంటప్పుడు ఎవరయినా ప్రతి బిద్అత్ మార్గభ్రష్టత్వం కాదని, కొన్ని బిద్అతులు మంచివి కూడా అయి ఉంటాయని అంటే ఏమనుకోవాలి?

హాఫిజ్ ఇబ్నె రజబ్ (رحمه الله) తన పుస్తకం "షరహుల్ అర్బయీన్"లో ఇలా వ్రాశారు:

"నిశ్చయంగా ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతే" అన్న మహాప్రవక్త (ﷺ) మాట అత్యంత సమగ్రమైన మాట. ఏ బిద్అత్ కూడా దాని పరిధికి అవతల లేదు. ఇది ధార్మిక సూత్రాలలో అత్యంత ముఖ్యమైన సూత్రం. ఇది ప్రవక్త (ﷺ) గారి ఈ ఉపదేశాన్ని పోలినది :

"مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا هَذَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ" (بخاری ومسلم)

**"ఎవరయినా మా ఈ విషయం (ధర్మం)లో లేని వస్తువు దేనినయినా సృష్టిస్తే, అది తిప్పికొట్టబడుతుంది." (బుఖారీ, ముస్లిం)**

కాబట్టి ఎవరయినా సరే ఏదైనా వినూత్న వస్తువును కల్పించి, దానిని ఇస్లాం ధర్మం వైపు ఆపాదిస్తే అది స్వీకారయోగ్యం కాజాలదు. ఎందుకంటే ధర్మంలో దానికెలాంటి మూలంగానీ, ప్రాతిపదికగానీ లేదు. కనుక అది ఖచ్చితంగా అపమార్గమే. దానితో ధర్మానికి (దీన్‌కు) ఎలాంటి సంబంధం లేదు – అది విశ్వాసపరమయిన అంశాలకు చెందినదైనా సరే, మనో వాక్కాయ కర్మలకు చెందినదైనా సరే! (జామెవుల్ ఉలూమ్ వల్ హుక్మ్ – పేజీ : 233)

'బిద్అతె హసన' అనే విభజన చేసిన వారు, తరావీహ్ నమాజ్‌కు సంబంధించి హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (رضي الله عنه) గారి పలుకును ఉదాహరిస్తారు. ఆయన (رضي الله عنه) ఇలా అన్నారు : "نِعْمَةِ الْبِدْعَةُ هَذِهِ" "ఇది ఎంత చక్కని బిద్అత్!"

'బిద్అతె హసన'ను వెనకేసుకువచ్చేవారు ఇలా అంటుంటారు : "కొన్ని కొత్త వస్తువులు ఆవిష్కరించబడినప్పటికీ తొలి కాలపు సజ్జనులు (రహ్మతుల్లా అలైహిమ్) నిరాకరించలేదు. ఉదాహరణకు : దివ్య ఖుర్‌ఆన్‌ను ఒక గ్రంథంగా కూర్పుచేయటం, హదీసులను లిఖించటం, హదీసుల క్రోడీకరణ.

వారి ఈ ఆక్షేపణకు సమాధానం ఏమిటంటే, షరీఅత్‌తో ఈ విషయాలకు



ప్రాతిపదిక (మూలం) ఉంది. కాబట్టి ఇవి కొంగ్రొత్త విషయాలేమీ కావు. ఇక ఉమర్ (رضي الله عنه) పలుకులంటారా, అది నిఘంటువు పరమైన బిద్అతే గాని, షరీయత్ పరమైనది కాదు.

కాబట్టి షరీయత్‌లో ఏ విషయానికి 'మూలం' ఉంటుందో, దానికి సంబంధించి బిద్అత్ అని అంటే అది నిఘంటుపరమైన బిద్అత్ అని అర్థం చేసుకోవాలి. దానిని షరీయత్ భావార్థంలో గ్రహించకూడదు. ఎందుకంటే షరీయత్ పరమైన 'ఆధారం' ఏదీ లేని దానినే షరీయత్‌లో 'బిద్అత్' అనంటారు. దివ్య ఖుర్‌ఆన్‌ను ఒక గ్రంథం రూపంలో సేకరించే పనికి షరీఅత్‌లో ఆధారం ఉంది. ఎందుకంటే మహాప్రవక్త (ﷺ) దివ్య ఖుర్‌ఆన్‌ను లిఖించమని ఆజ్ఞాపించి ఉన్నారు. అయితే అది వేర్వేరు పత్రాలలో వ్రాయబడి ఉండటం వల్ల ప్రవక్త ప్రియసహచరులు (رضي الله عنه) దానిని సురక్షితం చేసే సదుద్దేశంతో ఒకే గ్రంథంగా కూర్పు చేశారు.

ఇకపోతే తరావీహ్ నమాజ్ గురించి; దైవప్రవక్త (ﷺ) స్వయంగా కొన్ని రాత్రులు సామూహికంగా తరావీహ్ నమాజ్ చేయించారు. తరువాత తరావీహ్ నమాజ్ నిమిత్తం (మస్జిద్‌లోనికి) రాలేదు. బహుశా ఈ నమాజ్ తన అనుచరులపై 'విధిగా చేయబడుతుందేమోనన్న అనుమానం కొద్దీ ఆయన (ﷺ) రాలేదన్నమాట! అయితే ప్రవక్త సహచరులు (رضي الله عنهم) మాత్రం ప్రవక్త (ﷺ) గారి కాలంలోనూ ఆయన (ﷺ) తదనంతరం కూడా ఈ తరావీహ్ నమాజ్‌ను వ్యక్తిగతంగా చేసుకునేవారు. చివరకు ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (رضي الله عنه) తన పరిపాలనా కాలంలో వారందరినీ ఒకే ఇమామ్ వెనుక నిలబెట్టి – మహాప్రవక్త (ﷺ) వెనుక నిలబడి తాము ఆ నమాజ్ చేసినట్లుగానే – చేయించారు. కనుక ఇది దీన్‌లో బిద్అత్‌గా భావించబడదు.

అలాగే హదీసుల క్రోడీకరణకు సంబంధించిన ఆధారం (మూలం) కూడా షరీయత్‌లో ఉంది. దైవప్రవక్త (ﷺ) స్వయంగా తన సహచరుల్లో కొంతమంది కోరిక మేరకు కొన్ని హదీసులను లిఖించుకోమని ఆదేశించారు. అందువల్ల అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (رضي الله عنه) దైవప్రవక్త (ﷺ) హయాంలో హదీసులను లిఖించేవారు. కాకపోతే ఆయన (ﷺ) జీవిత కాలంలో హదీసులను గ్రంథస్థం చేయరాదన్న సర్వసాధారణమైన ఆజ్ఞ ఉండేది నిజమే. ఎందుకంటే ఈ లేఖన ప్రక్రియలో సహచరులు ఖుర్‌ఆన్‌తో పాటు హదీసులను ఎక్కడ కలగాపులగం చేస్తారోనన్న భయం ఉండేది. అయితే ఆయన (ﷺ) పరమపదించాక ఈ భయం తొలగిపోయింది. ఎందుకంటే ప్రవక్త (ﷺ) తనువు చాలించక ముందే దివ్య ఖుర్‌ఆన్ అవతరణ సంపూర్ణమయింది. అందుచేత ప్రవక్త ప్రియ సహచరులు (رضي الله عنه) ఏకాగ్రచిత్తంతో హదీసులను క్రోడీకరించే పనిలో నిమగ్నులైపోయారు.

కనుక తమ ప్రభువు పంపిన గ్రంథాన్ని, తమ ప్రవక్త (ﷺ) సున్నత్‌ను (హదీసులను) వృధాకాకుండా, అవి వినాశకారుల పరం కాకుండా సురక్షితం చేసిన వారికి అల్లాహ్ అత్యుత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక!

## రెండవ ప్రకరణం

# ముస్లింలలో పొడసూపిన బిద్‌అతులు : కారణాలు, ప్రేరకాలు

### 1. ముస్లింల జీవితాలలో పొడసూపిన బిద్‌అతులు ;

దీని క్రింద రెండు ప్రధానాంశాలున్నాయి.

**మొదటిది : బిద్‌అతులు పుట్టిన సమయం**

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) 'మజ్మూఅ అల్ ఫతావా' (10/354)లో ఇలా అంటున్నారు :

శాస్త్రాలు, ఆరాధనలకు సంబంధించి కొంగ్రొత్త పోకడలు (బిద్‌అతులు) ధర్మ ఖలీఫాల చివరి కాలంలో తలెత్తాయని తెలుసుకోండి. మహాప్రవక్త (ﷺ) సయితం దీని గురించి తెలియజేసి ఉన్నారు. ఆయన (ﷺ) ఇలా అన్నారు :

"مَنْ يَعِشْ مِنْكُمْ فَسَيَرَى اخْتِلَافًا كَثِيرًا، فَعَلَيْكُمْ بِسُنَّتِي وَ سُنَّةِ الْخُلَفَاءِ الرَّاشِدِينَ الْمَهْدِيِّينَ" (ابوداود:٤٦٠٧صحيح، ترمذی:٢٦٧٦صحيح)

**"మీలో జీవించి ఉన్నవానికి ఎన్నో విభేదాలు కానవస్తాయి. కనుక మీరు నా విధానాన్ని (సున్నత్‌ను), నా తర్వాత సన్మార్గగాములైన మార్గదర్శక ఖలీఫాల విధానాన్ని ఖచ్చితంగా అనుసరించండి." (అబూదావూద్-4607, తిర్మిజీ-2676 హసన్)**

అన్నిటికన్నా ముందు విధివ్రాతను (అదృష్టాన్ని) నిరాకరించేవారు పుట్టుకొచ్చారు. తరువాత విశ్వాసం (ఈమాన్) నుండి ఆచరణ (అమల్)ను వేరుపరచే ఇర్జాఅ, తష్‌యీ, ఖవారిజ్‌ల బిద్‌అతులు పొడసూపాయి. ఆ తరువాత ఉస్మాన్ (رضي الله عنه) అమరగతి నొందినమీదట చీలిక వచ్చినపుడు హురూరియాల కొత్త పోకడలు తలెత్తాయి. దరిమిలా సహాబా చివరి కాలంలో– అబ్దుల్లా బిన్ ఉమర్, అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్, జాబిర్ ప్రభృతుల చివరి కాలంలో 'ఖద్‌రియ' వర్గం పుట్టుకొచ్చింది. దానికి సమీప కాలంలోనే 'మర్జియ' ముఠా పుట్టింది. జహ్‌మియ వర్గీయులు మాత్రం ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (رحمه الله) మరణించిన తరువాత తాబయీన్ల చివరి కాలంలో తలెత్తారు. ఈ వర్గీయుల గురించి ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ప్రజలను హెచ్చరించారని కూడా అనబడుతోంది. జహమ్ బిన్ సఫ్వాన్ ఖురాసాన్‌లో జన్మించాడు. అది హెషామ్ బిన్ అబ్దుల్ మలిక్ ఖిలాఫత్ కాలం.

ఈ బిద్‌అతులు హిజ్రీ 2వ శతాబ్దిలో ప్రస్ఫుటం అయినాయి. అప్పటికి కొంతమంది సహాబా కూడా జీవించి ఉన్నారు. వారంతా ఈ బిద్‌అతులను ఖండించేవారు. ఆ తరువాత



'ఏతెజాల్' బిద్‌అతులు తలెత్తాయి. ముస్లింలలో ఉపద్రవాలు పుట్టుకొచ్చాయి. వివిధ అంశాలపై వారు విభేదించుకోసాగారు. బిద్‌అతుల మోజులో కొంతమంది మనోవాంఛల వెనుక పరుగెత్తటం మొదలెట్టారు. 'తసవ్వుఫ్' అనే బిద్‌అత్, సమాధులపై నిర్మాణాలు చేసే బిద్‌అత్ ముఫ్‌జల కాలం తర్వాత పుట్టుకొచ్చింది. ఈ విధంగా కాలక్రమేణా రంగురంగుల కొత్త పోకడలు పొడసూపాయి.

### రెండవది : బిద్‌అతుల జన్మస్థలం

ఇస్లాంలో బిద్‌అతుల (నవీన పోకడల) పుట్టుకకు సంబంధించి ఆయా రాజ్యాల పరిస్థితి విభిన్నంగా ఉంది. షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు : ప్రవక్త సహచరులు (رضي الله عنهم) విశ్రమిస్తున్న ప్రదేశాలు, విజ్ఞానం, విశ్వాస కాంతులు విరజిమ్మిన కేంద్రాలు ఐదు – మక్కా, మదీనా, కూఫా, బస్రా, సిరియా. ఈ ఐదు నగరాల నుండే ఖుర్‌ఆన్, హదీసు, ఫికహ్, ఆరాధనలు, తత్సంబంధితమయిన ఇస్లామీయ వ్యవహారాలు ఉచ్ఛస్థితికి చేరాయి. కాగా; ఒక్క మదీనా నగరం మినహా మిగిలిన ఈ నాలుగు నగరాల నుండి సూత్రప్రాయమైన (విశ్వాసపరమయిన) బిద్‌అతులు పొడసూపాయి.

కూఫా నగరంలో షియయియత్, ఇర్‌జాఅ ధోరణులు ప్రబలినాయి. దరిమిలా అవి ఇతర ప్రాంతాలకు సోకాయి. బస్రాలో ఖద్రియత్, ఏతెజాల్ తదితర భ్రష్టుపట్టిన ఆరాధనా పోకడలు పుట్టి, ఇతర పట్టణాలకు ప్రాకాయి. సిరియా నగరం నాసిబియత్, ఖద్రియత్ తత్వానికి కేంద్రస్థానంగా ఉండేది. జహ్‌మియత్ మాత్రం ఖురాసాన్ క్షేత్రంలోని నవాహిలో పొడసూపింది. ఇది అత్యంత జుగుప్సాకరమయిన పోకడ.

ఈ కొంగ్రొత్త పోకడలు (బిద్‌అతులు) మదీనా నగరానికి దూరంగానే ఉండేవి. హజ్రత్ ఉస్మాన్ (رضي الله عنه) దారుణంగా హత్య గావించబడిన తరువాత, మదీనా నగరంలోని ముస్లింల విభేదాలు తారస్థాయికి చేరిన సంగతి వాస్తవమేగాని, బిద్‌అతుల నుండి మాత్రం మదీనా పురి సురక్షితంగా ఉండింది. బిద్‌అతులను తమ ఆంతర్యాలలో దాచిపెట్టుకున్నవారు అక్కడా లేకపోలేదు. అయితే అలాంటివారు ప్రజాబాహుళ్యం దృష్టిలో నిందార్హులుగా ఉండేవారు. అక్కడ ఖద్‌రియాల ఒక చిన్న ముఠా ఉండేది. కాని అది అణగిమణగి ఉండేది. అయితే కూఫాలో మాత్రం తష్‌యీ, ఇర్జా ముఠాల వారు చెలరేగిపోయేవారు. బస్రాలో ఏతెజాల్ ముఠాకు పట్టపగ్గాలుండేవి కావు. సిరియాలో నాజియత్ పోకడ పెల్లుబికింది. వారు ప్రవక్త కుటుంబీకుల (అహ్లె బైత్) పట్ల వైరభావం కలిగి ఉండేవారు. మహనీయ ముహమ్మద్ (ﷺ) వారి ఒక ప్రవచనం ప్రకారం దజ్జాల్ అనేవాడు మదీనా నగరంలో ప్రవేశించలేడు. ఇమామ్ మాలిక్ శిష్యుల కాలం వరకూ (హిజ్రీ 4వ శతాబ్ది వరకూ) మదీనాలో జ్ఞాన సుధా ఝురులు ప్రవహించాయి. విశ్వాస (ఈమాన్) సుగంధం గుబాళించింది. (మజ్మూఅ అల్ ఫతావా – 20/300-303)

ఇస్లాం యొక్క తొలి మూడు అత్యుత్తమ శతాబ్దులలో మదీనా మునవ్వరాలో ఏ రకమయిన బిద్‌అత్ కూడా వ్రేళ్లూనుకోలేకపోయింది. ధర్మ సూత్రాలకు సంబంధించిన బిద్‌అత్ కూడా అక్కడ జన్మించలేదు.

## (2) కొత్తపోకడల పుట్టుకకు ప్రధాన కారణాలు :

మార్గవిహీనత, మార్గభ్రష్టతల నుండి సురక్షితంగా ఉండే మార్గం ఒక్కటే – దైవగ్రంథాన్ని, దైవప్రవక్త (ﷺ) విధానాన్ని ఆశ్రయించటం. అల్లాహ్ సెలవిచ్చాడు :

﴿وَأَنَّ هَـذَا صِرَاطِي مُسْتَقِيماً فَاتَّبِعُوهُ وَلاَ تَتَّبِعُواْ السُّبُلَ فَتَفَرَّقَ بِكُمْ عَن سَبِيلِهِ﴾(الانعام:۱۵۳)

**"ఇదే నా రుజుమార్గం. కనుక మీరు దీనినే అనుసరించండి. ఇతరత్రా మార్గాలను అనుసరించకండి. అవి మిమ్మల్ని అల్లాహ్ మార్గం నుండి వేరుపరుస్తాయి." (అల్ అన్ ఆమ్ : 153)**

ఈ విషయాన్ని దైవప్రవక్త (ﷺ) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (رضي الله عنه) హదీసులో విడమరచి చెప్పారు. ఆయన (رضي الله عنه) ఇలా తెలిపారు :

"خَطَّ لَنَا رَسُوْلُ اللّٰهِ ﷺ خطاً فقَالَ: هٰذَا سَبِيْلُ اللّٰهِ ثُمَّ خَطَّ خُطُوْطًا عَنْ يَمِيْنِهٖ وَعَنْ شِمَالِهٖ ثُمَّ قَالَ :وَهٰذِهٖ سُبُلٌ عَلٰى كُلِّ سَبِيْلٍ مِّنْهَا شَيْطَانٌ يَدْعُوْ اِلَيْهِ))(احمد:۳۹۲۸،ابن حبان)

**దైవప్రవక్త (ﷺ) నేలపై ఒక గీతగీసి "ఇది అల్లాహ్ మార్గం" అని చెప్పారు. ఆ తరువాత దానికి కుడి ప్రక్కనా, ఎడమ ప్రక్కనా కొన్ని గీతలు గీసి "ఇవి (వంకర టింకర) దారులు. వీటిపై షైతాన్ పొంచి ఉన్నాడు. వాడు ఈ దారులపైకి మనుషుల్ని పిలుస్తూ ఉన్నాడ"ని సావధానపర్చారు.**

ఆ తరువాత ఆయన (ﷺ) ఈ సూక్తిని పఠించారు :

﴿وَأَنَّ هَـذَا صِرَاطِي مُسْتَقِيماً فَاتَّبِعُوهُ وَلاَ تَتَّبِعُواْ السُّبُلَ فَتَفَرَّقَ بِكُمْ عَن سَبِيلِهِ ذَلِكُمْ وَصَّاكُم بِهِ لَعَلَّكُمْ تَتَّقُونَ﴾(الانعام:۱۵۳)

**"ఇదే నా రుజుమార్గం. కనుక మీరు దీనినే అనుసరించండి. ఇతరత్రా మార్గాలను అనుసరించకండి. అవి మిమ్మల్ని అల్లాహ్ మార్గం నుండి వేరుపరుస్తాయి. మీరు భయభక్తుల వైఖరిని అవలంబించేటందుకు గాను అల్లాహ్ మీకు ఈ విధంగా తాకీదు చేస్తున్నాడు." (అల్ అన్ ఆమ్ : 153)**

(ఈ హదీసును అహ్మద్–3928, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ తదితరులు ఉల్లేఖించారు).

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే దేమిటంటే ఖుర్ఆన్ హదీసుల పట్ల విముఖత చూపేవారి కోసం కొత్త కొత్త అపమార్గాలు, కొత్త కొత్త బిద్అత్‌లు వేచి ఉంటాయి. అందమయిన మాటలతో, ఆకర్షణీయమైన చేష్టలతో అవి తమ వైపునకు లాక్కుంటాయి.



## బిద్అతుల పుట్టుపూర్వోత్తరాలు : కారణాలు

- ధర్మాదేశాల పరిజ్ఞానం లేకపోవటం.
- మనోవాంఛల వెనుక పోవటం.
- ఏదైనా ఒక ప్రత్యేక దృక్పథం లేదా కొందరు ప్రత్యేక వ్యక్తుల పట్ల దురభిమానం కలిగి ఉండటం.
- అవిశ్వాసుల అడుగులకు మడుగులొత్తటం.

ఈ కారణాలను మరి కాస్త వివరంగా తెలుసుకుందాం.

### (అ) ధర్మాదేశాల పట్ల తగు పరిజ్ఞానం కొరవడటం :

కాలక్రమేణా ప్రజలు దైవదౌత్య కాలం నాటి విశేష చిహ్నాలకు, ప్రభావాలకు దూరమవసాగారు. ధర్మజ్ఞానం తగ్గింది. ధర్మావగాహన లోపించసాగింది. అజ్ఞానం ప్రబలింది. మహాప్రవక్త (ﷺ) తన ఈ ప్రవచనం ద్వారా ఈ విషయం ముందే చెప్పారు :

"مَنْ يعِش مِنْكُمْ فَسَيَرٰى اخْتِلَافًا كَثِيْرًا"(ابوداؤد:۴۶۰۷ صحیح،ترمذی:۲۶۷۶ صحیح)

**"మీలో జీవించి ఉన్న వ్యక్తి ఎన్నో భేదాభిప్రాయాలను గమనిస్తాడు." (అబూదావూద్–4607, తిర్మిజీ–2676, తిర్మిజీ దీనిని ప్రామాణిక హదీసుగా పేర్కొన్నారు).**

ఇంకా ఈ విధంగా చెప్పారు :

"اِنَّ اللّٰهَ لَا يَقْبِضُ الْعِلْمَ انْتِزَاعًا يَنْتَزِعُهٗ مِنَ الْعِبَادِ لٰكِنْ يَقْبِضُ الْعِلْمَ بِقَبْضِ الْعُلَمَاءِ حَتّٰى اِذَا لَمْ يُبْقِ عَالِمًا اِتَّخَذَ النَّاسُ رُؤُوْسًا جُهَّالًا فَسُئِلُوْا فَأَفْتَوْا بِغَيْرِ عِلْمٍ فَضَلُّوْا وَأَضَلُّوْا"(بخاری مسلم)

**"అల్లాహ్ జ్ఞానము (ఇల్మ్)ను ఒక్కసారిగా మనుషుల నుండి లాక్కుని సమాప్తం చేయడు. ఆయన జ్ఞానుల (ఉలమా)కు మరణ మొసగటం ద్వారా దానిని క్షీణింపజేస్తాడు. ఆఖరికి ఏ ఒక్క జ్ఞానినీ సజీవంగా వదలక పోయేసరికి ప్రజలు అజ్ఞానులను తమ నాయకులుగా చేసుకుంటారు. తరువాత ప్రజలు ధర్మాదేశాల గురించి వారిని ప్రశ్నిస్తారు. వారేమో జ్ఞానంతో నిమిత్తం లేకుండానే తీర్పు (ఫత్వా) ఇస్తారు. ఆ విధంగా వారు స్వయంగా దారి తప్పినది గాక ఇతరులను కూడా దారి తప్పిస్తారు." (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)**

(జామె బయానుల్ ఇల్మ్ వ ఫజ్లిహీ లి ఇబ్నె అబ్దుల్ బర్ – 1/180)

దీనిద్వారా స్పష్టమయిందేమిటంటే; జ్ఞానం (ఇల్మ్) ద్వారా, జ్ఞానుల (ఉలమా) ద్వారా మాత్రమే ఈ కొత్త పుంతలను ఎదుర్కోవటం సాధ్యం. జ్ఞానం, జ్ఞానులు రంగంలో కరువైపోయిననాడు కొత్త పుంతలు తొక్కేవారు స్వైరవిహారం చేస్తారు. అడ్డూ ఆపూ లేకుండా బిద్అతులను వ్యాపింపజేస్తారు.

## (అ) మనోవాంఛలను అనుసరించటం :

ఖుర్ఆన్ హదీసులను విడనాడిన వాడు అవశ్యంగా తన మనోవాంఛల వెనుక పరుగులు తీస్తాడు. ఈ యదార్థాన్ని తెలుపుతూ పరమ ప్రభువు ఇలా సెలవిచ్చాడు :

﴿فَإِن لَّمْ يَسْتَجِيبُوا لَكَ فَاعْلَمْ أَنَّمَا يَتَّبِعُونَ أَهْوَاءَهُمْ وَمَنْ أَضَلُّ مِمَّنِ اتَّبَعَ هَوَاهُ بِغَيْرِ هُدًى مِّنَ اللَّهِ﴾ (القصص:٥٠)

**మరి వారు గనక నీ సవాలును స్వీకరించకపోతే, వారు తమ మనోవాంఛలను అనుసరించే జనులని తెలుసుకో. అల్లాహ్ మార్గదర్శకత్వాన్ని కాకుండా తన మనోవాంఛల వెనుక నడిచే వానికన్నా ఎక్కువ మార్గభ్రష్టుడెవడుంటాడు?" (అల్ ఖసస్ : 50)**

ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు:

﴿أَفَرَأَيْتَ مَنِ اتَّخَذَ إِلَٰهَهُ هَوَاهُ وَأَضَلَّهُ اللَّهُ عَلَىٰ عِلْمٍ وَخَتَمَ عَلَىٰ سَمْعِهِ وَقَلْبِهِ وَجَعَلَ عَلَىٰ بَصَرِهِ غِشَاوَةً فَمَن يَهْدِيهِ مِن بَعْدِ اللَّهِ﴾ (الجاثية:٢٣)

**తన మనోవాంఛలను ఆరాధ్య దైవంగా చేసుకున్నవాణ్ణి నీవు చూశావా? అంతా తెలిసినప్పటికీ – అల్లాహ్ అతన్ని అపమార్గానికి లోను చేశాడు. అతని చెవులకూ, అతని హృదయానికీ సీలు వేశాడు. అతని కళ్ళపై కూడా తెరను వేసేశాడు. ఇక ఇప్పుడు అలాంటి వ్యక్తిని – అల్లాహ్ తర్వాత – సన్మార్గానికి తెచ్చేవాడెవడుంటాడు? (అల్ జాసియహ్ : 23)**

## (ఇ) కొన్ని ప్రత్యేక అభిమతాల పట్ల, కొందరు వ్యక్తుల పట్ల దురభిమానం

ఏదైనా ఒక ప్రత్యేక దృక్పథాన్ని, సిద్ధాంతాన్ని గుడ్డిగా అనుసరించటం, లేదా కొందరు వ్యక్తుల పట్ల గల ప్రేమాతిశయంతో పక్షపాత వైఖరిని అవలంబించటం మనిషికి సత్యాన్వేషణా మార్గంలో ఎప్పటికీ ప్రతిబంధకంగానే ఉంటుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:



﴿وَإِذَا قِيلَ لَهُمُ اتَّبِعُوا مَا أَنزَلَ اللَّهُ قَالُوا بَلْ نَتَّبِعُ مَا أَلْفَيْنَا عَلَيْهِ آبَاءَنَا﴾ (البقرة:١٧٠)

**"అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని అనుసరించండి" అని వారికి చెప్పినప్పుడల్లా, 'మా తాతలు తండ్రులు అవలంబిస్తూ ఉండగా చూచిన పద్ధతినే మేము పాటిస్తాము' అని వారు సమాధానమిస్తారు." (అల్ బఖర : 170)**

నేడు సూఫీలను అనుసరించేవారి పరిస్థితి కూడా ఇదే. సమాధులను పూజించే కొందరు దురభిమానుల ధోరణి కూడా ఇదే. దైవగ్రంథాన్ని, దైవప్రవక్త (ﷺ) విధానాన్ని అనుసరించండి అని వారిని కోరినప్పుడల్లా వారు సిద్ధాంతకర్తలైన గురువులను, మషాయఖ్లను, తండ్రీతాతల పద్ధతులను ఉదాహరించి, వారినే తమ ఆదర్శమూర్తులుగా పేర్కొంటారు.

## (ఈ) అవిశ్వాసులను పోలిన పద్ధతులను పాటించటం :

అవిశ్వాసుల అడుగులకు మడుగులొత్తడం, దైనందిన జీవితంలో వారి శైలిని పుణికి పుచ్చుకోవటం ద్వారా మనిషి చాలా తొందరగా బిద్అతులకు అలవాటు పడతాడు. ఉదాహరణకు : హజ్రత్ అబూ వాఖిద్ లైసీ (رضي الله عنه) హదీసు – ఆయన ఇలా తెలిపారు: "మేము దైవప్రవక్త (ﷺ)తో కలిసి హునైన్ (యుద్ధం కొరకు) బయలుదేరాము. మేము అవిశ్వాసాన్ని వీడి ఎక్కువ కాలం గడవలేదు. ఆ కాలంలో అవిశ్వాసులు రేగు వృక్షం వద్ద నిలబడి, ఆ వృక్షానికి తమ ఖడ్గాలు (శుభం కొరకు) వ్రేలాడదీసేవారు. అది **'జాతుల్ అన్వాత్'** గా వ్యవహరించబడేది. మేము వెళుతున్న మార్గంలో కూడా ఒక రేగు వృక్షం ఎదురయ్యేసరికి, "ఓ దైవప్రవక్తా (ﷺ)! మా కోసం కూడా – ముష్రిక్కుల మాదిరిగా – ఒక **'జాతె అన్వాత్'**ను నిర్ధారించండి" అని విన్నవించుకున్నాము. ఇది వినగానే దైవప్రవక్త (ﷺ) ఆశ్చర్యచకితులై ఇలా అన్నారు :

"سُبْحَانَ اللّٰهِ هٰذَا كَمَا قَالَ قَوْمُ مُوسَىٰ! إِنَّهَا السُّنَنُ، قُلْتُمْ وَالَّذِي نَفْسِي بِيَدِهِ كَمَا قَالَتْ بَنُو إِسْرَائِيلَ لِمُوسَىٰ: ﴿اجْعَل لَّنَا إِلَٰهًا كَمَا لَهُمْ آلِهَةٌ قَالَ إِنَّكُمْ قَوْمٌ تَجْهَلُونَ﴾ لَتَرْكَبُنَّ سُنَّةَ مَنْ كَانَ قَبْلَكُمْ (ترمذي:٢١٨٠صحيح، الاعراف:١٣٨)

**"సుబ్హానల్లాహ్! ఇవేకదా (అప) మార్గాలంటే! ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆ శక్తిమంతుని సాక్షి! ఇస్రాయీల్ వంశీయులు మూసా (عليه السلام)తో అన్నమాటే మీరన్నారు. వారు (ఇస్రాయీల్ సంతతివారు) ఇలా అని ఉన్నారు : "వీళ్లకు ఈ ఆరాధ్య దైవాలు ఉన్నట్లు మాక్కూడా ఒక దేవుణ్ణి చేసిపెట్టవా!' దానికి మూసా(عليه السلام), 'నిజంగానే మీరు మూర్ఖజనులు" అన్నాడు. (అల్ ఆరాఫ్ : 138)**

**"మీరు మీ పూర్వీకులయిన పెద్దలను అనుసరిస్తారు." (దీనిని తిర్మిజీ – 2180 ఉల్లేఖించి, ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)**

ఈ హదీసు ద్వారా తేటతెల్లమైన విషయం ఏమిటంటే, అవిశ్వాసుల పంథాను అనుసరించాలన్న కుతూహలమే ఇస్రాయీల్ వంశీయులను బరితెగించేలా చేసింది. ఆఖరికి వారు ఎంతవరకు పోయారంటే, తమ కోసం ఓ కొత్త దేముణ్ణి చేసిపెట్టమని సాక్షాత్తూ దైవప్రవక్త మూసానే డిమాండు చేశారు. అవిశ్వాసుల పోకడలు రమణీయంగానే ఉండవచ్చు. దానికి ప్రభావితుడైన బలహీన విశ్వాసులు దారితప్పే అవకాశం ఉంటుంది. ఎవరో ఎందుకు? సాక్షాత్తూ మహాప్రవక్త (ﷺ) సహచరులే, తమ కోసం కూడా ముష్రిక్కుల మాదిరి 'జాతె అన్వాత్' నొక దానిని కల్పించమని అభ్యర్థించారు.

నేటి పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదు. ఎందుకంటే ముస్లింలలో మెజారిటీ జనులు కొత్తపుంతలు తొక్కటంలో, షిర్కును అనుసరించటంలో అన్యులను అనుకరిస్తున్నారు. ఉదాహరణకు : పుట్టిన రోజు పండగ చేసుకోవటం, కొన్ని ప్రత్యేక పనుల కోసం సాప్తాహిక కార్యక్రమాలు నిర్వహించటం, కొన్ని ధార్మిక సంఘటనలను, కొందరు వ్యక్తులను స్మరించుకునేందుకు ఉత్సవాలు జరపటం, స్మారక స్థూపాలు ప్రతిష్ఠించటం, సంతాప సభలు కండక్ట్ చేయటం, సమాధులపై కట్టడాలు కట్టడం మొదలగునవి.



**మూడవ ప్రకరణం**

# బిద్అతీల విషయంలో ఇస్లామీయ సమాజం వైఖరి, వారి పోకడలను ఖండించటంలో 'అహ్లెసున్నత్ వల్ జమాఅత్' విధానం

## (1) బిద్అతీల విషయంలో అహ్లె సున్నత్ వల్ జమాఅత్ వైఖరి :

'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' వారు నిత్యం బిద్అతీల పనులను ఖండిస్తూ వచ్చారు. దీనివల్ల పట్టబోయే దుర్గతి గురించి హెచ్చరించారు. తత్సంబంధితమయిన కొన్ని మచ్చుతునకలు ఇవి :

**(అ) ఉమ్మె దర్దా (رضي الله عنها) కథనం :** "ఒకసారి అబూదర్దా (رضي الله عنه) ఆగ్రహంతో ఊగిపోతూ నా వద్దకు వచ్చారు. 'ఇంతకీ ఏం జరిగింది?' అని నేనడిగాను. దానికి ఆయన ఇలా అన్నారు : 'దైవసాక్షి! వారిలో ముహమ్మద్ (ﷺ) అందజేసిన ధర్మంలోని ఏ వస్తువూ నాకు కనిపించటం లేదు. చూడబోతే వారంతా నమాజు చేసేవారే." (బుఖారీ)

**(ఆ) ఉమర్ బిన్ యహ్యా కథనం :** ఆయన ఇలా తెలిపారు – నేను నా తండ్రి చెప్పగా విన్నాను. ఆయన గారు తన తండ్రి ఆధారంగా ఈ విషయాన్ని వివరించారు : "మేము ఫజ్ర్ నమాజ్‌కు ముందు అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (رضي الله عنه) గుమ్మం వద్ద కూర్చునేవారం. ఆయన బయటకు రాగానే మేమందరం ఆయన గారితో కలిసి మస్జిద్‌కు వెళ్ళేవారం. ఒకనాటి మాట! మా వద్దకు అబూ మూసా అష్అరీ (رضي الله عنه) ఏతెంచారు. 'ఏమిటీ, అబూ అబ్దుర్రహ్మాన్ ఇంకా బయలుదేరలేదా?' అని ఆయన అడిగారు. 'లేద'ని మేమన్నాము. ఆయనగారు కూడా ఆయన (అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్) కోసం మాతోపాటే నిరీక్షించారు. ఆయన బయటికి రాగానే, మేమంతా లేచి నిలబడ్డాము. ఆయన (అబూ మూసా) ఇలా అన్నారు : 'ఓ అబూ అబ్దుర్రహ్మాన్! నేను ఇప్పుడిప్పుడే మస్జిద్‌లో ఒక దృశ్యం చూశాను. అది నాకు నచ్చలేదు. అల్ హమ్దులిల్లాహ్ నేను చూసిన వస్తువు మంచిదే.' 'ఇంతకీ ఏమిటదీ?' అని ఆయన ప్రశ్నించగా, ఆయన ఇలా సమాధానమిచ్చారు: 'తమరు గనక బ్రతికి ఉంటే, తమరే తమ కళ్లతో దానిని చూసుకుంటారు' అని చెప్పి ఇలా వివరించారు : 'నేను మస్జిద్‌లో కొంతమందిని నమాజు నిరీక్షణలో వలయాకారంలో కూర్చోవటం చూశాను. ప్రతి వలయం మధ్యలో ఒక వ్యక్తి ఉన్నాడు. అతని చేతిలో కంకరరాళ్ళు ఉన్నాయి. అతను జనులను ఉద్దేశ్యించి, వందసార్లు **"అల్లాహు అక్బర్"** అనండి అంటున్నాడు. వారంతా వందసార్లు **"అల్లాహు అక్బర్"** అంటున్నారు. తరువాత అతను వందసార్లు **"లా ఇలాహ ఇల్లల్లాహ్"** అనండి అని పురమాయిస్తున్నాడు. వారంతా వందసార్లు **"లా ఇలాహ ఇల్లల్లాహ్"** అంటున్నారు. తరువాత అతను వందసార్లు **"సుబ్‌హానల్లాహ్"** అనండి అని చెబుతున్నాడు. వారంతా వందసార్లు **"సుబ్‌హానల్లాహ్"**

అంటున్నారు.' 'మరయితే మీరు వారితో ఏమన్నారు?' అని ఆయన అడిగారు. 'నేను దీని గురించి మీ అభిప్రాయం, ఆజ్ఞ ఏమిటో తెలుసుకునేందుకు వేచి ఉన్నాను. వారిని ఏమీ అనలేదు' అని సమాధానమిచ్చారు. 'మీరు మీ పాపాలను లెక్కపెట్టుకోండి అని వారిని ఎందుకు ఆజ్ఞాపించలేదు? వారి పుణ్యకార్యమేదీ వృధా అవదని కూడా మీరు వారికి భరోసా ఇవ్వాల్సింది కదా!' అని అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (رضي الله عنه) అన్నారు.

తరువాత ఆయన బయలుదేరారు. మేము కూడా ఆయన వెనకే నడిచాము. చివరకు అక్కడ వృత్తాకారంలో కూర్చుని ఉన్నవారిలో ఒక బృందం వద్దకు వెళ్ళారు. అక్కడ వారినుద్దేశించి, "ఇంతకీ మీరిక్కడ ఏం చేస్తున్నారు?" అని ప్రశ్నించారు. దానికి వారు, "ఓ అబూ అబ్దుర్రహ్మాన్! ఇవి కంకర రాళ్లు. వీటి సహాయంతో మేము తక్బీర్, తహ్లీల్, తస్బీహ్, తహ్మీద్‌లను లెక్కించుకుంటున్నాము" అని బదులిచ్చారు.

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (رضي الله عنه) వారందరినీ ఉద్దేశించి ఇలా ఉపదేశించారు : "(లెక్కించుకోవాలనే ఉంటే) మీరు మీ పాపాలను లెక్కపెట్టుకోండి. మీ పుణ్యకార్యమేదీ వృధా గావించబడదని నేను మీకు హామీ ఇస్తున్నాను. ఓ ముహమ్మద్ సమాజ సభ్యులారా! మీ పాడుగాను! మీరెంత తొందరగా వినాశకర మార్గాన పడిపోయారు కదా! ఆయన(ﷺ) సహచరులు ఇంకా బ్రతికే ఉన్నారు. ఆయన (ﷺ) దుస్తులు ఇంకా శిథిలమవనే లేదు. ఆయన (ﷺ) పాత్రలు ఇంకా పగిలిపోలేదు. ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నా! మీరు ఉంటే ముహమ్మద్ (ﷺ) పద్ధతికన్నా మంచి పద్ధతి మీద ఉన్నారు లేదా మీరు మార్గభ్రష్టత యొక్క ద్వారాన్నయినా తెరువబోతున్నారు!"

అలా చెప్పి ఆయన (رضي الله عنه) అక్కడి నుండి వెళ్ళిపోయారు. అమ్ర్ బిన్ సలమా ఇలా అంటున్నారు : మేము వారిలో అనేకులను చూశాము - వారు నహర్వాన్ యుద్ధం జరిగిన నాడు ఖవారిజ్ వర్గీయులతో చేరి మాపై కత్తులు దూయసాగారు. (సుననె దారిమీ పీఠిక : 210)

(ఇ) హజ్రత్ ఇమామ్ మాలిక్ బిన్ అనస్ (رحمه الله) వద్దకు ఒక వ్యక్తి వచ్చి, 'నేను ఎక్కడి నుండి ఇహ్రామ్ దీక్షబూనాలి?' అని అడిగాడు. "దైవప్రవక్త (ﷺ) ఎక్కడి నుండి 'మీఖాత్' ను నిర్ధారించారో అక్కడి నుండి! ఆయన (ﷺ) స్వయంగా ఎక్కడి నుండి ఇహ్రామ్ కట్టుకున్నారో అక్కడి నుండి!" అని ఆయన చెప్పారు. 'నేను మీఖాత్ రాకముందే ఇహ్రామ్ కట్టుకుంటే పోయిందేముందీ?' అని ఆ వ్యక్తి ప్రశ్నించాడు. "నా దృష్టిలో అది సరైంది కాద"ని మాలిక్ బిన్ అనస్ (رحمه الله) బదులిచ్చారు. 'ఎందుకు సరైంది కాదు?' అని ఆ వ్యక్తి మళ్లీ అడగటంతో ఆయన (رحمه الله), "నీవు ఉపద్రవానికి గురవుతావేమోనని నాకు భయంగా ఉంది" అన్నారు. 'ఎక్కువ మేలును కాంక్షించటంలో ఉపద్రవం ఏముంది?' అని ఆ వ్యక్తి మళ్లీ రెట్టించి అడిగాడు. ఇమామ్ మాలిక్ (رحمه الله) ఇలా అన్నారు : ఎందుకంటే అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿ فَلْيَحْذَرِ الَّذِينَ يُخَالِفُونَ عَنْ أَمْرِهِ أَن تُصِيبَهُمْ فِتْنَةٌ أَوْ يُصِيبَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴾ (النور: ٦٣)



**వినండి! ప్రవక్త ఆజ్ఞను ఎదిరించేవారు తమపై ఏదయినా ఘోర విపత్తు వచ్చిపడుతుందేమోనని లేదా తమను ఏదయినా బాధాకర మయిన శిక్ష చుట్టుకుంటుందేమోనని భయపడాలి. (అన్ నూర్ : 63)**

ఇంతకన్నా పెద్ద ఉపద్రవం ఏముంటుంది చెప్పు? నీవు నీ కొత్త ఆచరణ ద్వారా దైవప్రవక్త (ﷺ)నే మించిపోవాలనుకుంటున్నావు. అవునా!?"

(ఈ సంఘటనను అబూ షమామా గారు తన పుస్తకం – "అల్ బాయిస్ అలా ఇన్‌కార్ అల్ బిద్అ వల్ హవాదిస్" (పేజీ : 14)లో అబూబకర్ ఖిలాల్ నుండి నకలు చేశారు).

ఇవి మచ్చుకు కొన్ని సంఘటనలు మాత్రమే. ఇస్లామీయ విద్వాంసులైతే సర్వకాల సర్వావస్థల్లో అల్ హమ్దులిల్లాహ్ కొత్త పోకడలు పోయే వారిని ఎండగడుతూనే వచ్చారు.

**(2) బిద్అతీల చర్యలను ఖండించటంలో 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' వారి పద్ధతి :**

ఖుర్ఆన్ హదీసుల ఆధారంగా ఎదుటి వ్యక్తిని సమాధానపర్చాలన్నదే వారి విధానం. వారు బిద్అతీల సందేహాలను కూలంకషంగా వివరించి, వాటికి విరుగుడును ప్రతిపాదిస్తారు. సున్నతులను ఖచ్చితంగా పాటించవలసిందిగా సూచిస్తారు. ధర్మంలో కొత్తగా కల్పించబడిన విషయాలకు దూరంగా ఉండవలసిన ఆవశ్యకతను ఖుర్ఆన్ హదీసుల ఆధారాలతో నొక్కి వక్కాణిస్తారు. ఈ నేపథ్యంలో వారు అనేక రచనలు చేశారు. ఉదాహరణకు వాటిలో కొన్ని పుస్తకాలివి :

1. ఇమామ్ షాతిబీచే విరచితమైన "అల్ ఏతెసామ్".
2. షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియచే విరచితమైన పుస్తకం, "ఇఖ్తెజా అస్సిరాతిల్ ముస్తఖీమ్" – ఈ పుస్తకంలోని ఓ పెద్ద భాగం బిద్అతీల చర్యలను ఖండిస్తోంది.
3. ఇబ్నె వజాహ్ చే విరచితమైన "ఇన్‌కారుల్ హవాదిస్ వల్ బిద్అ."
4. తిర్‌తోషీచే విరచితమైన "అల్ హవాదిస్ వల్ బిద్అ."
5. అబూ షామాగారి పుస్తకం–"అల్ బాయిస్ అలా ఇన్‌కారుల్ బిద్అ వల్ హవాదిస్."

**మరికొన్ని కొత్త పుస్తకాలు**

1. షేఖ్ అలీ మహ్ఫూజ్ గారి పుస్తకం "అల్ అబ్‌దాఅ ఫీ మజాద్దుల్ ఇబ్తెదా."

2. షేఖ్ ముహమ్మద్ బిన్ అహ్మద్ అల్ షఖీరీ అల్ హవామిదీ గారి పుస్తకం – "అల్ సునన్ వల్ ముబ్తదిఆత్ అల్ ముత్తాల్లుఖతు బిల్ అజ్‌కార్ వస్సలవాత్."

దైవకృపవల్ల ఇస్లామీయ విద్వాంసులు పత్రికలు, మ్యాగజైన్లు, రేడియోలు, టెలివిజన్, జుమా ప్రసంగాలు, సెమినార్లు, ప్రసంగాల ద్వారా బిద్అతీల పోకడలను నిరంతరం ఖండిస్తూ వచ్చారు. బిద్అతీలు ఏ విధంగా ముస్లిం సమాజంలో జొరబడి విశ్వాసాన్ని బలహీనపరుస్తున్నారో వివరించి, ప్రజలలో ధార్మిక చైతన్యాన్ని తీసుకువచ్చారు. ఈ విధంగా వారు ధర్మంలోని కొత్త పుంతలను నిర్మూలించటంలో, బిద్అతీల బండారాన్ని బయటపెట్టడంలో కీలకపాత్ర పోషించారు.

## నాల్గవ ప్రకరణం

# వర్తమాన కాలంలోని బిద్‌అతులు : కొన్ని మచ్చుతునకలు

ప్రస్తుత కాలంలోని బిద్‌అతుల కొన్ని నమూనాలు ఇవి :

1. మహాప్రవక్త (ﷺ) జన్మదినోత్సవం జరుపుకోవటం.

2. కొన్ని స్థలాలు, చిహ్నాలు, మృతులు మొదలగు వాటి ద్వారా శుభం (బరకత్) పొందటం.

3. ఆరాధనలు, దైవసామీప్యానికి సంబంధించిన బిద్‌అతులు.

ప్రస్తుత కాలంలో బిద్‌అతులు పెచ్చరిల్లిపోయాయి. దీనికి ప్రధాన కారణం నేటి కాలానికీ – దైవప్రవక్త (ﷺ) కాలానికీ మధ్య చాలా ఎక్కువ అంతరం ఉండటం, నిజ జ్ఞానం కొరవడటం, షరీయత్‌కు వ్యతిరేకమయిన విషయాల వైపు పిలుపు ఇచ్చేవారు అధికంగా ఉండటం. మహనీయ ముహమ్మద్ (ﷺ) వారు ఇలా చెప్పి ఉన్నారు :

﴿لَتَتَّبِعُنَّ سُنَّةَ مَنْ كَانَ قَبْلَكُمْ﴾ (رواه ابن ماجه:٣٩٩٤ صحيح)

**"మీరు తప్పకుండా మీ పూర్వీకుల అడుగు జాడల్లో నడుస్తారు."**
**(దీనిని ఇబ్నెమాజా–3994 ఉల్లేఖించి, ప్రామాణికంగా పేర్కొన్నారు)**

ఈ హదీసు ప్రకారం ముస్లిములు అన్యుల ఆచార వ్యవహారాలను ఎక్కువగా అనుకరించటం మొదలెట్టారు.

### 1. మీలాదున్నబీ (ﷺ) పేరిట ఉత్సవాలు :

మహాప్రవక్త (ﷺ) పుట్టిన రోజు పేరుతో పండుగ జరుపుకోవటం వాస్తవానికి క్రైస్తవుల అనుకరణ. క్రైస్తవులు ఏసుక్రీస్తు (ఈసా عليه السلام) పుట్టిన రోజు పండుగ జరుపుకుంటారు. విద్యాగంధం లేని ముస్లిములు, రుజుమార్గానికి కుడిఎడమ వైపుల్లో కాలిబాటలు తీసుకున్న విద్వాంసులు (ఉలమా) ఏటేటా రబీవుల్ అవ్వల్ మాసంలో మహాప్రవక్త (ﷺ) పుట్టిన రోజును పురస్కరించుకుని సంబరాలు జరుపుకుంటారు. కొంతమంది ఈ ఉత్సవాన్ని మస్జిదుల్లో జరుపుకుంటే, మరికొంతమంది తమ ఇండ్లలో చేసుకుంటారు. ఇంకా కొందరు కొన్ని నిర్ణీత బహిరంగ స్థలాలలో ఈ ఉత్సవం జరుపుకుంటారు. ఈ ఉత్సవంలో ముస్లిం సమాజానికి చెందినవారు చాలాపెద్ద సంఖ్యలోనే హాజరవుతారు. ఇంతకుముందు చెప్పినట్లు ఇది క్రైస్తవుల నుండి పుణికిపుచ్చుకున్న పోకడ. పూర్వం క్రైస్తవులు ఏసుక్రీస్తు పుట్టిన రోజు పండుగను తమంతట తామే కల్పించుకున్నారు. సాధారణంగా ఈ మీలాద్ ఉత్సవాలలో క్రైస్తవులను పోలిన ఎన్నో బిద్‌అతులు చేయబడతాయి. కొన్ని షిర్కుతో కూడిన పనులు కూడా జరుగుతుంటాయి. ఉదాహరణకు:



ఈ సందర్భంలో చదవబడే నాతులు, కవితలలో దైవప్రవక్త (ﷺ) విషయంలో అతిశయిల్లడం కద్దు. వారు ఆ నాతులలో అల్లాహ్ బదులు దైవప్రవక్త (ﷺ)ను మొరపెట్టుకోవటం మొదలెడతారు. సహాయం కొరకు ప్రవక్త (ﷺ)నే అర్థించసాగుతారు. కాగా; తనను పొగిడే విషయంలో అవధులు మీరరాదని దైవప్రవక్త (ﷺ) స్వయంగా తాకీదు చేసి ఉన్నారు. ఆయన (ﷺ) ఇలా ఉపదేశించారు :

"لَا تُطْرُونِي كَمَا أَطْرَتِ النَّصَارَى ابْنَ مَرْيَمَ إِنَّمَا أَنَا عَبْدٌ فَقُولُوا: عَبْدُ اللهِ وَرَسُولُهُ" (بخاری ومسلم)

**"క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసాను పొగడటంలో మితిమీరిపోయినట్లుగా మీరు నన్ను పొగడటంలో మితిమీరకండి (కడకు వారు తమ ప్రవక్తను దేవుని కుమారునిగా చేసేశారు). చూడండి! నేనొక దాసుడను. కాబట్టి నన్ను అల్లాహ్ దాసుడు, అల్లాహ్ సందేశహరుడు అని అనండి." (బుఖారీ, ముస్లిం)**

ఒక్కోసారి 'మీలాద్' పేరిట జరిగే ఈ సదనాలలో స్త్రీలు పురుషులు కలిసిపోతారు. ఈ మిశ్రమ సమ్మేళనాలు నైతిక పతనానికి, భావ కాలుష్యానికి కూడా కారణం అవుతాయి.

ఒక్కోసారి వారు దైవప్రవక్త (ﷺ) తమ సమావేశాలకు హాజరవుతారని కూడా నమ్ముతుంటారు. ఈ సమావేశాలలో సామూహికంగా (కొన్నిచోట్ల స్త్రీలు – పురుషులు కూడా) నాతె షరీఫ్ పఠిస్తారు. కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు. బృందగానాలు ఆలాపిస్తారు. సూఫీ మహాశయులు కల్పించుకున్న ప్రత్యేక ధ్యానాలు కూడా ఈ సందర్భంగా పాటించబడతాయి. అదలా ఉంచితే స్త్రీ, పురుషుల మిశ్రమ సమావేశాలు ఉపద్రవానికి కారణభూతం అయ్యే ప్రమాదం ఉంటుంది.

అలాంటిదేమీ లేదండీ! కేవలం మేమిక్కడ సమావేశమై భోజనాలు చేసి వెళ్ళిపోతామండీ అని కొంతమంది చెబుతుంటారు. వారు చెప్పిందే నిజమే అయినా అది కూడా ఇస్లాం ధర్మంలో ఓ కొత్తపోకడే. (ధర్మంలో ప్రతి కొత్త విషయావిష్కరణ బిద్‌అతే. ప్రతి బిద్‌అత్ మార్గభ్రష్టత వైపు గొనిపోతుంది). కాలక్రమేణా ఈ చిన్న విషయాలే చెడుల వైపునకు, నీతి బాహ్యత వైపునకు దారితెరుస్తాయి.

మేము దీనిని బిద్‌అత్ అని ఎందుకన్నామంటే ఖుర్‌ఆన్ హదీసులలో ఈ ఉత్సవానికి ఎలాంటి ఆధారం లేదు. సలఫె సాలిహీన్ ఆచరణ ద్వారా కూడా దీనికి సంబంధించిన ఉపమానం ఏదీ లభించటం లేదు. హిజ్రీ 4వ శతాబ్ది తరువాతనే ఇది ఉనికిలోనికి వచ్చింది. ఫాతిమీ షియాలు దీనిని మొదలెట్టారు.

ఇమామ్ అబూ హఫస్ తాజుద్దీన్ అల్ఫాఖానీ (رحمه الله) ఇలా అన్నారు :

ముబారికీన్‌కు చెందిన ఒక బృందం తరపున – రబీవుల్ అవ్వల్ నెలలో మీలాద్ ఉత్సవం పేరిట నిర్వహించబడే ఈ సమావేశం గురించి, 'ధర్మం (దీన్)లో దీనికేదన్నా ఆధారం ఉందా?' అని ప్రశ్నించటం జరిగింది. దీనికి సంబంధించి వారు స్పష్టమయిన,

నిర్దిష్టమయిన సమాధానం కావాలని కోరారు. కాబట్టి దేవుడిచ్చిన సద్బుద్ధితో సమాధానం ఇవ్వబడుతోంది :

దైవగ్రంథంలోగానీ, దైవప్రవక్త (ﷺ) సంప్రదాయంలో గానీ నేడు చెలామణీలో ఉన్న మీలాద్‌కు ఎలాంటి 'మూలం' లేదు. ఎలాంటి నిదర్శనం కూడా నాకు కనిపించలేదు. ఉమ్మత్‌కు చెందిన ఎన్నదగ్గ ఉలమాలు, ఆదర్శప్రాయులైన వారు కూడా ఈ విధంగా ఆచరించినట్లు లేదు. పైగా ఇదొక బిద్‌అత్. దీనిని పనీ పాటా లేని వ్యక్తులు, నిరుద్యోగులు కనుగొన్నారు. ఇదొక మనోవాంఛ. పదార్థ పూజారులు దీనిని తమ పబ్బం గడుపుకునేందుకు వాడుకుంటున్నారు." (రిసాలతుల్ మోరిద్ ఫీ అమలుల్ మౌలిద్)

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఏమంటున్నారో చూడండి :

"ఇదేవిధంగా కొంతమంది ఏసుక్రీస్తు (ఈసా – عليه السلام) పుట్టిన రోజు విషయంలో క్రైస్తవులను అనుకరిస్తూ లేదా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (ﷺ) ప్రేమలో, భక్తీతత్పరతలో ముహమ్మద్ (ﷺ) పుట్టిన రోజు పండుగను ఆవిష్కరించారు. వాస్తవానికి ఆయన (ﷺ) పుట్టినరోజు నిర్ధారణ విషయంలో ఇప్పటికీ ప్రజల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. తొలికాలపు సజ్జనులు సయితం ఈ 'ఉత్సవం' జరుపుకోలేదు. ఒకవేళ ఇలా చేయటంలో 'మంచి' అనేది ఏదయినా ఉంటే, లేదా మంచికి ఆస్కార ముంటుందని అయినా ఆశాభావం ఉండి ఉంటే ఆ సజ్జనులు (رضي الله عنهم) ఇలాంటి సంబరం తప్పకుండా జరుపుకునేవారే. ఎందుకంటే దైవప్రవక్త (ﷺ) యెడల ప్రేమాదరణల విషయంలో ఆ మహనీయులు మనకన్నా గొప్పవారే. వారు ఎల్లప్పుడూ మేలును, శుభాన్ని కాంక్షించేవారు. యదార్థానికి దైవప్రవక్త (ﷺ)ను అనుసరించటం ద్వారానే ఆయన (ﷺ) యెడల ప్రేమాదరణలకు సార్థకత లభిస్తుంది. ఆయన ఆజ్ఞలను శిరసావహించేవారు, ఆయన (ﷺ) నెలకొల్పిన సంప్రదాయాల పునరుద్ధరణకు చిత్తశుద్ధితో పాటుపడేవారు, ఆయన (ﷺ) రాకలోని లక్ష్యాన్ని నెరవేర్చటానికి మనోవాక్కాయ కర్మల చేత కృషిచేసేవారు మాత్రమే నిజంగా ఆయన (ﷺ) యెడల ప్రేమాదరణలు గలవారు. ఎందుకంటే అన్సార్ – ముహాజిర్లలోని ప్రథమశ్రేణి సహాబీలు గాని, వారిని అనుసరించే తరువాతి తరాల వారుగానీ ఇలాగే చేసేవారు." (ఇఖ్తెజా అస్సిరాతల్ ముస్తఖీమ్ – 2/615, డా. నాసిరుల్ అఖల్ పరిశోధన)

ఈ కొత్త పోకడను ఖండిస్తూ లెక్కలేనన్ని పుస్తకాలు (పాతవి, కొత్తవి) ప్రచురించ బడ్డాయి. ఈ మీలాద్ ఉత్సవం స్వతహాగా ఒక బిద్‌అత్ అవటంతో పాటు అది మరెన్నో మీలాదుల నిర్వహణకు ప్రేరకం అయ్యే అవకాశం ఉంది. మరెందరో ఔలియాల, మషాయెఖ్‌ల, నాయకుల మీలాద్ (బర్త్‌డే) లకు శ్రీకారం చుట్టవచ్చు. ఈ విధంగా ముస్లిం సముదాయం కీడుకు, ఉపద్రవానికి ద్వారం తెరుచుకుంటుంది.

**(2) కొన్ని స్థలాల, చిహ్నాల, మృతుల నుండి శుభం (బరకత్) పొందటం :**

కొత్తగా కనిపెట్టిన బిద్‌అతులలో 'సృష్టితాల' నుండి 'శుభం' పొందగోరటం కూడా ఒకటి. ఇది కూడా విగ్రహారాధనలో ఒక భాగమే. ఈ వల పన్నటం ద్వారా ఎంతోమంది బ్రతకనేర్చిన స్వార్థపరులు అమాయక వ్యక్తుల జేబులు ఖాళీ చేస్తుంటారు.



'బరకత్' అంటే ఏదేని వస్తువులో శుభం, సమృద్ధి స్థిరంగా ఉండటం అని భావం.

ఇలాంటి శుభం లేక సమృద్ధి కొరకు ప్రార్థించాల్సింది దైవాన్నే. ఎందుకంటే ఆ వస్తువును ప్రసాదించిన వానికే 'బరకత్'ని పొందుపరిచే శక్తి ఉంటుంది. ఆ పని అల్లాహ్ మాత్రమే చేయగలడు. ఎందుకంటే శుభాన్ని అవతరింపజేసేవాడు, దానిని స్థిరపరిచేవాడు అల్లాహ్ మాత్రమే. మనుషులకు, వేరితర సృష్టితాలకు బరకత్‌ని ప్రసాదించే శక్తిగానీ, బరకత్ అనే దానికి ఉనికినిచ్చే శక్తిగానీ, దానిని నిలిపి ఉంచేశక్తిగానీ ఉండదు.

కాబట్టి స్థలాల నుండి, చిహ్నాల నుండి, చనిపోయిన వ్యక్తుల నుండి 'శుభం' (తబర్రుక్) పొందటం ధర్మసమ్మతం కాదు. ఎందుకంటే ఆ వస్తువుకు శుభం చేకూర్చే శక్తి స్వతస్సిద్ధంగా ఉందని మనిషి గనక నమ్మాడంటే అది 'షిర్క్' అవుతుంది. ఒకవేళ అతను ఫలానా వస్తువును సందర్శించటం, దానిని తాకటం, దానిని తన శరీరంపై స్పర్శించటం అల్లాహ్ తరఫున బరకత్ ప్రాప్తికి సాధనమని నమ్మితే అది షిర్క్ కాదుగానీ, షిర్క్‌కు దోహదపడే ఒక సాధనమవుతుంది.

ఇక ప్రవక్త ప్రియ సహచరుల విషయానికి వస్తే వారు దైవప్రవక్త (ﷺ) కేశముల ద్వారా, ఆయన (ﷺ) గారి లాలాజలం ద్వారా, ఆయన (ﷺ) వుజూ చేసిన నీళ్ల ద్వారా బరకత్ (శుభం) పొందేందుకు పోటీపడేవారు. అయితే ఇదంతా ఆయన (ﷺ) జీవించి ఉన్నంతవరకే జరిగింది. దీనికి ఆధారం ఏమిటంటే, ఆయన (ﷺ) పరమపదించిన తరువాత, సహచరులు ఆయన (ﷺ) సమాధి ఉన్న గదిలోకి వెళ్ళి శుభం పొందలేదు. ఆయన (ﷺ) నమాజ్ చేసిన వివిధ స్థలాలకు వెళ్ళి, లేదా ఆయన (ﷺ) విశ్రాంతి పొందిన స్థలాలకు వెళ్ళి అక్కడి నుండి 'శుభం' పొందలేదు. కాబట్టి ఔలియాల (అల్లాహ్ ప్రియతములైన వ్యక్తుల) స్థలాలకు వెళ్ళి అక్కడి నుండి శుభం పొందగోరటం ధర్మసమ్మతం కాదు.

అలాగే ప్రవక్త సహచరులు తమలోని గొప్ప వ్యక్తుల నుండి కూడా శుభం పొందేవారు కారు. ఉదాహరణకు : హజ్రత్ అబూబకర్, హజ్రత్ ఉమర్ (رضي الله عنهم), ఇంకా ఆ కోవకు చెందిన మరెందరో సహాబీల జీవిత కాలంలోగానీ, వారు మరణించిన తరువాత గానీ వారి నుండి శుభం పొందేందుకు యత్నించలేదు. వారు హిరా గుహ వద్దకు వెళ్ళి నమాజ్ చేయటంగానీ, దుఆ చేయటంగానీ చేయలేదు. దేవుడు మూసా (అలైహిస్సలాం)తో సంభాషించిన తూర్ పర్వత సందర్శన నిమిత్తం వెళ్ళటంగానీ, అక్కడ నమాజ్ చేయటం గానీ చేయలేదు. దైవప్రవక్తల సమాధులున్నాయని అనుమానించ బడుతున్న పర్వతాల వద్దకు, స్థలాల వద్దకు కూడా వారు వెళ్ళలేదు.

అలాగే మదీనా నగరంలో మహాప్రవక్త (ﷺ) నిత్యం నమాజ్ చేసే స్థలంలోనే నిలబడటంగానీ, మక్కాలో ఆయన (ﷺ) నమాజ్ చేసిన స్థలాలలో తొలికాలపు మహనీయులు నిలబడటం గానీ, ఆ స్థలాలను తాకటంగానీ, ముద్దాడటం గానీ చేసేవారు కారు.

కాస్త ఆలోచించండి! మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) గారి శుభప్రదమైన అడుగులు పడిన స్థలాలను, ఆయన నమాజ్ చేసిన స్థలాలనే తాకటం, ముద్దుపెట్టుకోవటం

ఆయన అనుయాయులకు ధర్మసమ్మతం కానపుడు వేరితరులు సంచరించిన, ఆరాధనలు చేసిన స్థలాలను, ప్రదేశాలను ముద్దాడటం ఎంత వరకు సమ్మతం? ఎంతవరకు సహేతుకం?

ఆ స్థలాలలో దేనినయినా తాకటం లేదా ముద్దుపెట్టుకోవటం మహాప్రవక్త (ﷺ) షరీయత్ ప్రకారం ధర్మసమ్మతం కాదన్న విషయం ఇస్లామీయ విద్వాంసులకు బాగా తెలుసు. (ఇఖ్తెజా అస్సిరాతల్ ముస్తఖీమ్ – 2/795-802. డా. నాసిరుల్ అఖల్ పరిశోధన).

**(3) ఆరాధనలు, దైవసామీప్యం పొందటానికి సంబంధించిన బిద్అతులు :**

ఈ రోజుల్లో 'ఆరాధనల' అధ్యాయంలో సృష్టించుకున్న బిద్అత్‌లకు లెక్కలేకుండా పోయింది. వాస్తవానికి ఏ ఆరాధన అయినా ఆధారం లేకుండా సమ్మతం కాదు. ఏదయినా వస్తువుకు ఆధారం లేనంత వరకూ అది బిద్అతే. ఎందుకంటే మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రవచించారు :

"مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ" (مسلم)

**"ఎవడయినా మేము ఆజ్ఞాపించని ఆచరణ చేస్తే అది స్వీకారయోగ్యం అవదు (త్రోసిపుచ్చబడుతుంది) (ముస్లిమ్)."**

ఈ మధ్య కాలంలో నిరాధారంగా, నిర్హేతుకంగా నెరవేర్చబడే ఆరాధనలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ఇవి :

**(1) నమాజ్ కొరకు హెచ్చు స్వరంతో సంకల్పం (నియ్యత్) చేసుకోవటం–** ఉదాహరణకు : "నేను అల్లాహ్ కోసం ఇన్ని రకతుల ఫలానా నమాజు చేస్తున్నాన"ని పలకటం. ఇది బిద్అత్. ఎందుకంటే మహాప్రవక్త (ﷺ) ఆచరణ ద్వారా ఇది ఎక్కడా రూఢీ కాలేదు. ఈ నేపథ్యంలో ఉన్న దైవాదేశం గమనించదగినది –

﴿قُلْ أَتُعَلِّمُونَ اللَّهَ بِدِينِكُمْ وَاللَّهُ يَعْلَمُ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ وَاللَّهُ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ﴾ (الحجرات :١٦)

**(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "ఏమిటీ, మీ ధార్మికత గురించి మీరు అల్లాహ్‌కే తెలియపరచాలని అనుకుంటున్నారా? భూమ్యాకాశాలలో ఉన్న ప్రతిదీ అల్లాహ్‌కు తెలుసు. అల్లాహ్ సర్వం తెలిసినవాడు." (అల్‌హుజురాత్ : 16)**

**(2)** నమాజు అనంతరం సామూహికంగా ధ్యానించటం : దైవప్రవక్త (ﷺ) చే తెలియజేయబడిన 'జిక్ర్'ను వ్యక్తిగతంగా చేసుకోవటమే సరయిన, సమ్మతింపదగిన పద్ధతి.

**(3)** వివిధ సందర్భాలలో దుఆ అనంతరం ఫాతిహా చదవటం, అలాగే మృతుల కొరకు ఫాతిహా సదనాలు ఏర్పాటు చేయటం.



**(4)** మృతుల పేరిట సంతాప సభలు ఏర్పాటు చేయటం, సంతర్పణ చేయటం, ఖుర్ఆన్ పారాయణం కొరకు కిరాయి మనుషులను పిలవటం.

ఇదంతా మృతుల పట్ల తమకు గల గౌరవానికి, శ్రద్ధాంజలికి నిదర్శనమని వారు తలపోస్తారు. ఇదంతా మృతులకు చేరుతుందని అనుకుంటారు. వాస్తవానికి ఇది బిద్అత్. ధర్మంలో దీనికి ఎలాంటి ఆధారం లేదు. పైగా ఇవన్నీ మెడలో గుదిబండగా, చేతులకు బేడీలుగా పరిణమిస్తాయి.

**(5) ధార్మిక సందర్భాలను పురస్కరించుకుని ఉత్సవాలు జరుపుకోవటం :** ఉదా : ఇస్రా – మేరాజ్ సందర్భాన్ని, మహాప్రవక్త (ﷺ) మదీనాకు హిజ్రత్ చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సమావేశాలు పెట్టడం. చూడబోతే ఈ సందర్భాలలో 'ఉత్సవం' జరుపుకునే ఆధారమేదీ ఇస్లామీయ షరీయత్‌లో లేదు.

**(6) రజబ్ మాసంలో నెరవేర్చబడే ప్రత్యేక ఆరాధనలు :** ఉదాహరణకు : రజబ్ నెలలో ప్రత్యేకంగా నఫిల్ నమాజులు చేయటం, నఫిల్ ఉపవాసాలు పాటించటం. వాస్తవానికి ఈ మాసానికి ఇతర మాసాలపై ఎలాంటి ప్రాధాన్యతా, విశిష్టతా లేదు. నమాజ్ విషయంలోగానీ, ఉపవాసాల విషయంలోగానీ, ఖుర్బానీ విషయంలో గానీ, మరే ఇతర విషయంలోగానీ దీనికి ఎలాంటి ప్రత్యేకతా లేదు.

**(7) సూఫీల కాల్పనిక ధ్యానం :** సూఫీలు తమ తరఫున సృష్టించుకున్న దైవధ్యానాలు, వజీఫాలు, సాధనలు అన్నీ బిద్అత్‌లే. ఎందుకంటే అవి దీన్ (ధర్మం)లో కొత్తగా ఆవిష్కరించబడిన అంశాలు. అవి పద్ధతి ప్రకారం గానీ, వేళల దృష్ట్యాగానీ, పరిభాష రీత్యాగానీ షరీయత్‌కు విరుద్ధమైనవి.

**(8)** షాబాన్ నెల 15వ తేదీ పగలును ఉపవాసం కొరకు, రాత్రిని జాగారం కొరకు ప్రత్యేకించుకోవటం : ఇది కూడా ఓ కొత్త పోకడే. ఎందుకంటే దీని గురించి దైవప్రవక్త (ﷺ) ప్రత్యేకంగా తాకీదు చేసినట్లు ఆధారం ఏదీ లేదు.

**(9)** సమాధులపై కట్టడాలు నిర్మించటం : సమాధులను 'సజ్దా' స్థలాలుగా చేసుకోవటం, మృతుల నుండి 'శుభం' పొందగోరటం, మృతులను ఆధారంగా చేసుకుని సిఫార్సు కోరటం వంటి ఉద్దేశ్యాలతో సమాధులను సందర్శించటం. అలాగే స్త్రీలు సమాధులను సందర్శించటం – దైవప్రవక్త (ﷺ) సమాధులను సందర్శించే స్త్రీలను, సమాధులపై మస్జిదులను నిర్మించేవారిని, సమాధుల వద్ద దీపాలంకరణ చేసేవారిని ధూత్కరించారు.

## ముగింపు

నిశ్చయంగా బిద్అతులు అవిశ్వాసానికి (కుఫ్రికి) ఆనవాలు. ఇది ధర్మం (దీన్)లో అదనపు వస్తువులకు నిదర్శనం. ధర్మంలో హెచ్చుతగ్గులను దేవుడుగానీ, దైవప్రవక్త (ﷺ) గానీ సమ్మతించలేదు. పైగా అవి పెద్ద పాపాలకన్నా ఘోరమైనవి. జుగుప్సాకరమైనవి. షైతాన్ పాపకార్యం కన్నా బిద్అత్ చేష్టపై ఎక్కువగా సంతోషిస్తాడు. ఎందుకంటే పాపకార్యానికి ఒడిగట్టేవానికి, తాను దైవ అవిధేయతకు పాల్పడుతున్నానన్న విషయం

తెలిసి ఉంటుంది. అందుకే అతను ఎప్పుడయినా సిగ్గుతో పశ్చాత్తాపం చెందుతాడు. కాని బిద్అతీ పరిస్థితి తద్భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే తాను చేసే ప్రతి బిద్అత్‌ను ధర్మం (దీన్) అనుకుని చేస్తాడు. తద్వారా అల్లాహ్ సంతోషిస్తాడన్న ఆలోచన అతని మనసులో ఉంటుంది. కాబట్టి అతను పశ్చాత్తాపం ప్రకటించే ప్రశ్నే ఉండదు.

అంతేకాదు, బిద్అతులు సున్నతులను అంతమొందిస్తాయి. బిద్అతులకు పాల్పడే వారికి సున్నతులన్నా, సున్నతులను పాటించే వారన్నా గిట్టదు.

యదార్థమేమంటే బిద్అతులు మనిషిని అల్లాహ్‌కు దూరం చేస్తాయి. అల్లాహ్ ఆగ్రహానికి కారణం అవుతాయి. మనసులో వక్రభావాలను జనింపజేస్తాయి. ఆంతర్యంలో చెడుగు చోటు చేసుకుంటుంది.

## బిద్అతీ పట్ల ఎలా వ్యవహరించాలి?

బిద్అతీని తరచూ కలుసుకోవటం, అతనితో కలిసి ఎక్కువసేపు గడపటం నిషిద్ధం (హరామ్). అయితే అతని శ్రేయాన్ని అభిలషించి, నచ్చజెప్పే ఉద్దేశంతో కలుసుకుంటే తప్పు లేదు. ఇంత కఠినమైన ఆంక్ష ఎందుకంటే బిద్అతీ సహవాసంలో ఉండేవారు అతని పనులకు ప్రభావితం అయ్యే ప్రమాదముంది. అతని అంటువ్యాధి ఇతరులకు కూడా తగిలి వ్యాప్తి చెందవచ్చు.

ఒకవేళ బిద్అతీలను, వారి పోకడల నుండి నిరోధించటం సాధ్యపడకపోతే, వారి కీడు నుండి జనులను ఆపాలి. వారి సహచర్యం వల్ల కలిగే నష్టం ఏమిటో ప్రజలకు తెలియజేయాలి. పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటే విద్వాంసులు, పరిపాలకులు బిద్అతులకు ముకుతాడు బిగించాలి. బిద్అతీలను నిలదీసి అడగాలి. వారిని వారి పోకడ నుండి నిలువరించాలి. ఎందుకంటే వారి పోకడల వల్ల ఇస్లాంకు తీరని నష్టం వాటిల్లగలదు.

ఇస్లాం విరోధ దేశాలు బిద్అతీలకు వారి కార్యకలాపాలలో సహాయపడుతూ ఉంటాయి. వివిధ రకాలుగా వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ ఉంటాయి. ఎందుకంటే బిద్అతుల ద్వారానే ఇస్లాంను అరికట్టవచ్చని, అపఖ్యాతి పాల్జేయవచ్చని అవి ఆలోచిస్తుంటాయి. కాబట్టి అలాంటి విరోధుల పట్ల కూడా కడు అప్రమత్తంగా ఉండాలి.

అల్లాహ్ తన ధర్మానికి తోడ్పడవలసిందిగా, తన వాక్కును ఉన్నతికి చేర్చవలసిందిగా, తన విరోధులను పరాభవానికి లోను చేయవలసిందిగా ఈ సందర్భంగా మేము అర్థిస్తున్నాము.

మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ)పై, ఆయన ఇంటివారలపై, ఆయన సంతానంపై, ఆయన సహచరులపై అల్లాహ్ కారుణ్యం, శాంతి కురియుగాక!

(والحمدلله الذي بنعمته تتم الصالحات- و صلى على نبينا محمد وعلى آله و صحبه وسلم)

**వ సల్లల్లాహు అలా నబియ్యాన ముహమ్మదిన్ వ ఆలా ఆలిహి వ సహబిహీ వ సల్లిమ్.**